

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ fb.com/vaartha

PUBLISHED FROM VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM, SRIKAKULAM

20-8-2023 ఆదివారం సంపుటి : 29 సంచిక : 201, పేజీలు : 12 వెల : 8.00



రతన్ టాటాకు ఉద్యోగరత్న పురస్కారం

వాషింగ్టన్‌వైపు దూసుకొస్తున్న కార్చిచ్చు

9లో


## కొత్త అన్వేషణలకు భారత్ ఓ ల్యాబ్



### త్వరలోనే కృత్రిమమేధ తర్జుమా ప్లాట్‌ఫామ్ భాషిణి

### జి20 డిజిటల్‌ఎకానమి సదస్సులో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** కొత్తకొత్తపరిష్కారాలను గుర్తించడంలో భారత్ ఆదర్శ ప్రయోగశాల అని ప్రధానిమోడీ అన్నారు. భారత్‌లో అన్వేషించిన పరిష్కారాలను ప్రపంచంలో ఎక్కడైనా అమలుచేయవచ్చని అన్నారు. జి20 డిజిటల్ ఎకానమి వర్కింగ్ గ్రూప్ మంత్రులతో బెంగళూరు వేదికగా జరిగిన సమావేశంలో ప్రధాని వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. భారత్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ప్రపంచ సవాళ్లకు సురక్షితమైన సమగ్రపరిష్కారాన్ని అందిస్తుందని మోడీ పేర్కొన్నారు. భారత్ వైవిధ్యభరితమైన దేశం అని ఎన్నోభాషలు వందలాది మాండలికాలు ఉన్నాయన్నారు. ప్రపంచంలోని అన్ని మతాలకు సాంస్కృతిక పద్దతులకు నిలయంగా మారింది. పురాతన సాంప్రదాయాలనుంచి నేటి సాంకేతికత వరకూ భారత్ ఎంతోప్రత్యేకమైనదని పరిష్కారాలను గుర్తించడంలో మనదేశం ఆదర్శవంతమైన ప్రయోగశాల అనిఅన్నారు. ఇక్కడ అన్వేషించినపరిష్కారాలు ప్రపంచంలో ఎక్కడయినా కచ్చితంగా అమలుచేసుకోవచ్చని, తర్వాలో కృత్రిమ మేధ ఆధారిత భాషా తర్జుమా ప్లాట్‌ఫాం భాషినిని రూపొందిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని అన్నిభాషలను అనువదించేందుకు ఇది ఉపకరిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. డిజిటల్ ఎకానమీ రంగంలో భారతప్రభుత్వంచేసిన ప్రయోగాలు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. తన అనుభవాలను ప్రపంచంతో పంచుకునేందుకు భారత్ సిద్ధంగాఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలోప్రధానంగా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్, సెక్యూరిటీ డిజిటల్ ఎకానమి, డిజిటల్‌స్కేలింగ్ అంశాలపై చర్చలు జరిగాయి. ఈ ≫2

# రాష్ట్రంలో హరిత ప్రగతి

### విశాఖపట్టణంలో వ్యర్థాల నుంచి విలువైన వస్తువుల తయారీ పైలట్ ప్రాజెక్టు

### రాష్ట్రంలో అరకు, అనంతగిరి, రంపచోడవరం ప్రాంతాల్లో ఎకో టూరిజం: సిఎం జగన్



**విజయవాడ,ఆగస్టు19, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్రంలో సుస్థిర ప్రగతి కోసం హరిత విధానాలు అమలుచేసే దిశలో ఆంధ్రప్రదేశ్ చర్యలు చేపట్టింది. ఆరోగ్యవంతమైన వ్యవస్థతో పాటుగా హరిత విధానాలతో ఆర్థిక ప్రగతిని సాధించాలని ప్రభుత్వం సిఎం జగన్ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టింది. సుస్థిర ప్రగతి కోసం తీసుకుంటున్న చర్యల్లో హరిత విధానాలకు పెద్ద పీట వేయడం, తద్వారా అభివృద్ధికి, పర్యావరణ రక్షణకు మధ్య సమతుల్యత సాధించడం తదితర కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వ్యర్థాల నుంచి విలువైన వస్తువుల తయారీని పైలట్ ప్రాజెక్టు కింద విశాఖపట్నంలో చేపట్టాలని నిర్ణయించారు. గ్లోబల్ అలియన్స్ ఫర్ సస్టయిన్‌బుల్ ప్లానెట్ (జిఎఎస్‌పి) సంస్థతో ఇప్పటికే సిఎం జగన్ సమక్షంలో కీలక ఒప్పందం జరిగింది. సమాచార.పౌరసంబంధాలశాఖ నుంచి లభించిన సమాచారాన్ని అనుసరించి వ్యర్దాలనుంచి విలువైన వస్తువులను తయారు చేసే విషయంలో సిఎం జగన్ అధికారులకు ప్లాస్టిక్ వ్యర్థాలనుంచి విలువైన వస్తువుల తయారీ విషయంలో చర్యలు తీసుకుంటున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, రీసైక్లింగ్‌పై జిఎఎస్‌పి ప్రతినిధి, ప్రముఖ అంతర్జాతీయ డిజైనర్, పార్లే ఫర్‌ది ఓసియన్ ఫౌండర్ సైరిల్ గట్స్ ప్లాస్టిక్ సూచనలను అనుసరించి ప్రభుత్వం కీలక కార్యచరణను చేపట్టింది. వ్యర్థాలతో సముద్రాలు తీవ్రంగా కలుషితమైపోతున్నాయని, వీటి నుంచి సముద్రాలను, తద్వారా ధరిత్రిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వ్యర్థాలను రీసైకిల్ చేయడంలో, అందులో పర్యావరణ అనుకూల విధానాలను పాటించడం చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా 150 మిలియన్ టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులు వస్తే వాటిలో కేవలం 9శాతం మాత్రమే రీసైక్లింగ్ చేస్తున్నారని, మిగతావన్నీ కూడా కాలుష్యానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయని వివరించారు.

ఈ వ్యర్థాలను విలువైన ఉత్పత్తులుగా మార్చడంలో హరిత విధానాలకు పెద్దపీట వేయడం ద్వారా కొత్త ఆర్థిక వ్యవస్థతో మంచి అభివృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించార జిఎఎస్‌పి అనుబంధ సంస్థ పార్లే ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి తయారు చేస్తున్న విలువైన ఉత్పత్తులను ముఖ్యమంత్రి వివరించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంతో అనుసందానమై ఈ పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని ఆదేశించారు. తద్వారా బీచ్‌లను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇతర ≫2

# తిరుమలలో మరో చిరుత!

### మొదటి ఘాట్‌లో తిరిగినట్లు సమాచారం

### సిసికెమెరాల ట్రాప్‌లో కదలికలు

### బోనులు ఏర్పాటుదిశగా చర్యలు



**తిరుమల,ఆగస్టు 19ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంఅటవీప్రాంతంలో తిరుమల కాలినడక మార్గాలు, ఘాట్‌రోడ్లలో చిరుతపులుల సంచారం భక్తులను భయాందోళనకు గురిచేస్తోంది. తిరుమల అడవిలో దాదాపు వందకు పైగా చిరుతలు సంచారం ఉన్నట్లు అటవీశాఖ గణాంకాలు చెబుతున్నా వీటిల్లో ఐదు వరకు చిరుతలు అటు కాలినడక మార్గాలకు సమీపంలో ఇటు ఏకంగా తిరుమల ఘాట్‌రోడ్లపైకి దూసుకువచ్చేస్తున్నాయి. అడపాదడపా భక్తులపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన చిరుతలు పదిరోజుల క్రిందట నెల్లూరు జిల్లా కోవూరుమండలం పోతిరెడ్డిపాళెంకు చెందిన ఆరేళ్ల లక్షితపై కాలినడక మార్గంలో మెట్లపై లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సమీపంలో దాడిచేసి తలను పీక్కుతిని దారుణంగా చంపిన ఘటన విదితమే.

ఈ ఘటనతో టిటిడి,పోలీసు,అటవీశాఖ అధికా రులు ఆపరేషన్ చిరుత మొదలు పెట్టారు. భక్తులను భయపెడుతూ అవకాశం దొరికితే ఏకంగా దాడిచేసి చంపుకుతింటున్న ఘటనలు జరగడంతో చిరుతల సంచారంపై 300కుపైగా ట్రాఫ్ సిసికెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి కదలికలను గమనిస్తూ పదివరకు బోనులు ఏర్పాటుచేసి చిరుతలను బంధించే ప్రక్రియ జరుగుతోంది. కొద్దికాలంలోనే మూడు చిరుతలు పట్టుబడటంతో చిరుతల సంచారం ఉండదనే భావిస్తున్న తరుణంలో శుక్రవారం రాత్రి ఏకంగా ఓ చిరుత మొదటిఘాట్‌లో తిరుపతికి దిగే మార్గంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం దాటిన తరువాత ఎలిఫెంట్‌ఆర్చి సమీపంలో సంచరించినట్లు ట్రాఫ్ సిసి కెమెరాల్లో గమనించారు. ఎలిఫెంట్ ఆర్చిసమీపంలో అడవిలో చిరుత కెమెరాకు చిక్కింది. కాలినడక మార్గంలోని ట్రాఫ్ కెమెరాల్లో ఈ చిరుత కనిపించింది.

దీంతో వెంటనే అప్రమత్తమైన భద్రత సిబ్బంది ఆ ప్రాంతంలోని అటవీశాఖ, పోలీసులకు సమాచారం అందించి అలర్ట్ చేశారు. చిరుతను టార్చిలైట్ల వెలుగుల్లో, భారీ శబ్దాలతో అడవిలోకి దారిమళ్లించారు. ఇదే సమయంలో తిరుమల కొండపై స్పెషల్‌టైప్ కాటేజీల సమీపంలో ఎలుగుబంటి కదికలను గమనిం చారు. ఆప్రాంతంలో భక్తులసంచారం ఎక్కువగానే ఉంటుంది. ఇదే ≫2

### తిరుమల కాలినడక మార్గాల్లో శాశ్వత 'కంచె' ఆలోచన!

#### మంత్రి పెద్దిరెడ్డి



**తిరుమల, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వచ్చే భక్తులకు పూర్తి భద్రత కల్పించడంలో భాగంగా కాలినడక మార్గాల్లో భక్తుల రక్షణకు ప్రభుత్వం, టిటిడి కృతనిశ్చయంతో ఉందని అటవీ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి తెలిపారు. ఎక్కడా ≫2



## పాలిటెక్నిక్ విద్యార్థులకు సీట్ల కేటాయింపు

### పాలిసెట్ కన్వీనర్ చదలవాడ నాగరాణి

**విజయవాడ, ఆగస్టు19, ప్రభాతవార్తప్రతినిధి:** పాలిసెట్2023 ప్రవేశాలకు సంబంధించి శుక్రవారం విద్యార్ధులకు సీట్లు కేటాయించినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, పాలిసెట్ కన్వీనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మొత్తం 34,624 మంది విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోగా, 34,122 మందికి సీట్లు కేటాయంచామన్నారు. 88 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 10,456 సీట్లు, 181 ప్రవేటు పాలిటెక్నికల్‌లలో 23,666 సీట్లు భర్తీ చేసామన్నారు.

వీరంతా ఈ నెల 23వ తేది లోపు ఆయా కళాశాలల్లో వ్యక్తిగతంగా రిపోర్టు చేయవలసి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాలిటెక్నిక్‌లలో 82 729 సీట్లు ఉండగా, తొలి విడుతలో మిగిలిన సీట్లను తుది విడుత కౌన్సిలింగ్‌లో భర్తీ చేస్తామని వివరించారు. సీట్లు పొందిన విద్యార్థులకు 23వ తేది నుండే క్లాసులు ప్రారంభవుతాయని చదలవాడ నాగరాణి తెలిపారు. త్వరలోనే ≫2



డిక్లరేషన్ ఫారం అందుకుంటుకున్న ఉపేంద్రరెడ్డి

## బాలయ్య ఇలకాలో వైఎస్సార్సీ జయభేరి

### టిడిపి, వైఎస్సార్సీ అసమ్మతీయులకు ఝలక్

**హిందూపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త :** నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలోని చలివెందుల సర్పంచు స్థానానికి శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్సీ మద్దతుదారుడు జయభేరి మ్రోగించారు. వైఎస్సార్సీ ఇన్‌చార్జ్ దీపికావేణు పోల్ మేనేజ్‌మెంట్ సక్సెస్ కావడంతో అటు తెలుగుదేశంపార్టీకి, ఇటు వైఎస్సార్సీలోని అసమ్మతీయులకు ఝులక్ తగిలింది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్సీ మద్దతుదారునిగా ఉపేంద్రరెడ్డి టిడిపి మద్దతుదారుడు రవీంద్రారెడ్డిపై 337 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గతంలో వైఎస్సార్సీ సర్పంచు సౌభాగ్యమ్మమృతితో ఉప ఎన్నికలు రాగా ఆమె కుమారుడు ఉపేంద్రరెడ్డి ≫2

## జగన్ సర్కార్‌కు రోజులు దగ్గర పడ్డాయి..

### విజయవాడ పాతబస్తీలో లోకేష్

### వెస్ట్ సీటు ఆర్యవైశ్యులకే!



**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రాక్షసపాలన అంతమొందే రోజులు దగ్గర పడ్డాయని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి లోకేష్ నారా అన్నారు. జె- ట్యాక్స్ ఇబ్బంది ఉండదన్నారు. బాలికలు, దళిత, బలహీన వర్గాలపై అత్యాచారాలకు పాల్పడుతున్న అరాచక శక్తులరు రానున్న తమ ప్రభుత్వంలో ఉక్కు పాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. యువగళం పాదయాత్రను చేస్తున్న లోకేష్ శనివారం మంగళవారం మధ్యాహ్నం తరువాత విజయవాడ చేరుకున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద ఆయనను ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలనుంచి పెద్ద సంఖ్యలో చేరుకున్న టిడిపి, తెలుగుయువత, విద్యార్థి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పాదయాత్ర విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వన్‌టౌన్ (పాతబస్తీ) చేరుకున్నారు.

ఈ సందర్భంగా ఆయనకు ఆర్యవైశ్య సంఘాలు, ఇతర వ్యాపార సంఘాలు, మహిళా. యువజన సంఘాలు స్వాగతం పలికారు. ఆయనకు ఈ సంఘాల నాయకులు వినతి పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యాపార, వాణిజ్య వర్గాల ప్రభుత్వం రాజ్యమేలుతుందన్నారు. రకరాల పన్నులతో పాటు జె-ట్యాక్స్ కోసం వ్యాపారులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. వైకాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలను ప్రశ్నించిన వ్యాపార ప్రముఖులపై దాడులు, హత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఒంగోలులో సుబ్బారావు గుప్తాపై గంజాయి కేసు బనాయించి జైలులో పెట్టారన్నారు. నంద్యాల మండి మర్చంట్ అసోషియేషన్ అధ్యక్షుడు తిరువీధి వెంకట సుబ్బయ్య కిరాతకంగా చంపిన రౌడీలు నడి రోడ్డులో దర్జాగా తిరుగుతున్నార ≫2

# దేశంలో వరదలకు 2038 మంది మృతి

### కేంద్ర హోంశాఖ నివేదిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** దేశవ్యాప్తంగా ఈ వర్షాకాలంలో ఇప్పటివరకూ 2038 మంది మరణించినట్లు కేంద్ర హోంశాఖప్రకటించింది. ఈ సీజన్‌లో వర్షాలకు సంబంధించిన ఘటనల్లోనే ఎక్కువమంది దుర్మరణం పాలయ్యారు. వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడటానికి సంబంధించి ఈ మరణాలు సంభవించినట్లు తెలిపింది. ఏప్రిల్ ఒకటినుంచి ఆగస్టు 17వ తేదీవరకూ దేశవ్యాప్తంగా ఉన్న డేటాను సేకరించి కేంద్ర హోంశాఖ ఈ నివేదికనున రూపొందించింది. వీరితోపాటు 101 మంది వరదల్లో గల్లంతుకాగా 1584 మందికి గాయాలయినట్లు పేర్కొంది. మొత్తంగా 2038 మందిచనిపోతే ఒక్క బీహార్‌లోనే ఎక్కువగా 518 మంది చనిపోయారు. హిమాచల్‌ప్రదేశ్ 330 మంది మృతులసంఖ్యలోరెండోస్థానంలో ఉంది. దేశంలోని అన్నిరాష్ట్రాల్లోకలిపి 335 జిల్లాలు ఈ వర్షాలు, విపత్తులకారణంగా నష్టపోయాయని హోంశాఖ వివరించింది.

మధ్యప్రదేశ్‌లోని 40 జిల్లాలు, ఆసన్సాంలోని 30 జిల్లాలు, యుపిలోని 27 జిల్లాలున్నాయి. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లోని 12 జిల్లాలు ఉత్తరాఖండ్‌లోని ఏడుజిల్లాలు వర్షాలు వరదల ధాటికి తీవ్రంగా దెబ్బతిన్నట్లు కేంద్ర హోంశాఖ నివేదిక చెపుతోంది. కొండచరియలు విరిగిపడి జరిగిన ప్రమాదాల్లో 186 మంది చనిపోగా పిడుగుపాటుకారణంగా చనిపోయిన వారిసంఖ్య 506గా నమోదయింది. వర్షాల ప్రభావం అత్యధికంగా హిమాచల్‌ప్రదేశ్‌పైనే ఉంది. మొత్తం కొండ చరియలు విరిగి పడటంద్వారా 75 మందిచనిపోయారు. మండి జిల్లాలోని వరద ప్రాంతాల్లో ముఖ్యమంత్రి సుకు పర్యటించి అక్కడిపరిస్థితులను తెలుసుకున్నారు. ఈ జలవిలయాన్ని రాష్ట్ర విపత్తుగా ప్రకటించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో పదివే లకోట్లు నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విరివిగా ఆదుకోవాలనికోరారు. పంజాబ్‌లోనూ ఇటీవల శారీ వర్షాలు కురుస్తున్నాయి.

కపుర్తలాజిల్లాలో భారీ వర్షాల్లో చిక్కుకున్న 300 మందిని సైన్యం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా కాపాడి బయటకు తెచ్చాయి. ఇప్పటివరకూ ఐదువేల ఎకరాల పంట నీటమునిగినట్లు అధికారులు గుర్తించారు. భాక్రా డ్యామ్ నిండటంతో గేట్లు ఎత్తి నీటిని దిగువన ఉన్న బియాస్ నదిలోకి విడుదల చేస్తున్నారు. దీనివల్ల హోషియార్‌పూర్, గురుదాస్‌పూర్, రూప్‌నగర్, కపుర్తలా జిల్లాల్లోని ప్రాంతాలు నీటమునిగాయి. పంజాబ్ వరద పరిస్థితిపై సీఎం భగవంత్‌మాన్ సమీక్షచేసారు.

## బిజెపి రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన పురందేశ్వరి

**విజయవాడ,ఆగస్టు9,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి భారతీయ జనతాపార్టీ నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పూరందేశ్వరి రాత్రి ప్రకటించారు. మొత్తం 26మంది ఈ కార్యవర్గంలో ఉంటారు. ప్రధాన కార్యదర్శులు కాశీ విశ్వనాధరాజు, బిట్ర శివన్నారాయణ, దయాకర్‌రెడ్డి, తపనా చౌదరిలను ఎంపిక చేశారు. మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, విష్ణుకుమార్‌రాజుతో పాటు మరో 11మంది రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తారు. కార్యదర్శులుగా మరో మంది వ్యవహరిస్తారు., పార్టీ అధికార ప్రతినిధులుగా ఏడుగురి అవకాశం కల్పించారు. పార్టీ అనుబంధ విభాగాలకు (మోర్చాలకు) అధ్యక్షులను ప్రకటించారు. యువమోర్చా అధ్యక్షునిగా మిట్టా వంశీ, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నిర్మలా కిశోర్, కిసాన్‌మోర్చా అధ్యక్షునిగా కుమారస్వామి, ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా గుడిసె దేవానంద్, ఓబీసీ మోర్చా అధ్యక్షునిగా గోపీ శ్రీనివాస్, ఎస్టీ మోర్చా అధ్యక్షునిగా షేక్‌బాజీ, మీడియా ఇన్‌చార్జీగా పాతూరి నాగభూషణంలను ఎంపిక చేసారు.



## రేపు విజయవాడకు బండి సంజయ్

**విజయవాడ,ఆగస్టు19,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణా బిజెపి మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ విజయవాడ రానున్నారు. ఎపి రాజకీయవర్గాల్లో ఇది సంచలనంగా మారింది. ఎపిలో బలీయమైన శక్తిగా ఎదిగేందుకు వ్యూహరచనలు చేస్తోంది. ఒక సామాజికవర్గంపై కీలకదృష్టిని పెట్టింది. ఇప్పటికే బిజెపితో సత్సంబంధాలు నేరుపుతున్న పవన్ కల్యాణ్ ఆ దిశలోనే పావులు కదుపుతున్నారు, రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు, ఆ సామాజిక వర్గంతో మంచి సంబంధాలున్న బండి సంజయ్‌ను ఎపిపై దృష్టి పెట్టాలని బిజెపి అధిష్టానం ఆదేశించినట్లు సమాచారం.

ఆ క్రమంలోనే బండి సంజయ్‌ను ఓటరు నమోదు కార్యక్రమ ప్రక్రియను సమీక్షించేందుకు బండి సంజయ్ ఎపిరాజకీయాల్లో అడుగుపెట్ట నున్నారు. ఈ నెల21న బండి సంజయ్ ఓటరు నమోదు కార్యక్రమ ప్రక్రియను సమీక్షించడంతో పాటుగా ఉభయగోదావరి జిల్లాలకు చెందిన కొందరు కీలక సామాజిక వర్గనాయకులతో ప్రత్యేకంగా అంతరగత సమాలోచన చేస్తారని బిజెపి వర్గాలు చెబుతున్నాయి. బండి సంజయ్‌ను ఎపి బిజెపి ఇన్‌చార్జిగా కుడా నియమించే అవకాశా ≫2



అయోధ్యలో కొనసాగుతున్న రామమందిర నిర్మాణం పనులు శనివారం పరిశీలించిన యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్

# ఆర్మీట్రక్ లోయలోపడి తొమ్మిది జవాన్ల మృతి

**లేహ్:** లడక్‌లోని ఖేరి సమీపంలో ఘోర ప్రమాదంచోటుచేసుకుంది. జవాన్లుప్రయాణిస్తున్న ఆర్మీ ట్రక్కు ఒకటిప్రమాదవశాత్తూ లోయలో పడిపోయింది. ఈదుర్ఘటనలో తొమ్మిది మందిప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒకరు జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ ఎనిమిది మంది జవాన్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. లేహ్‌నుంచి 150 కిలోమీటర్ల దూరంలోని ఖేరీ ప్రాంతం వద్ద ఈదుర్ఘటనచోటుచేసుకుంది. ప్రమాదం జరిగినసమయంలో సైనిక వాహనంలో 10 మందిప్రయాణిస్తున్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ సాయంత్రం 4.45 గంటల సమయంలో లేహ్‌నుంచి నైమా వెపు వెళుతుండగా వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు లేహ్ సీనియర్ ఎస్పీ పిడి నిత్యా వెల్లడించారు. సమాచారం తెలియగానే పోలీస్ బృందం ఘటనా స్థలానికి వెల్లిందని, గాయపడినసైనికులను ఆర్మీ ఆసుపత్రికి తరలించినట్లు ఆమెఠ వివరించారు. అప్పటికే ఎనిమిది మందిమృతిచెందగా తర్వాత మరో జవాను ప్రాణాలు విడిచినట్లు తెలిపారు. ప్రస్తుతం గాయాలతో చికిత్స పొందుతున్న ఒక జవానుపరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

లడక్‌లోజరిగినప్రమాదంలో వీరసైనికులను కోల్పోవడంబాధాకరమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. ఈ విషాద సమయంలో యావత్‌దేశం మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తుందని భహరోసా ఇచ్చారు. అమరులైన జనవ్లాకు ప్రగాఢసానుభూతిని తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన జవాను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ట్వీట్‌చేసారు. లడక్‌లో జరిగినప్రమాదంపై యుపి సిఎం యోగి ఆదిత్య నాథ్ విచారం వ్యక్తంచేసారు. భారతమాత విరపుత్రులకు వినయకపూర్వకంగా నివాళులర్పిస్తున్నట్లు ట్వీట్‌చేసారు. ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని గాయపడినసైనికులు త్వరగా కోలుకోవాలనిప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ తీరని బాధను తట్టుకునే శక్తిని మృతుల కుటుంబసభ్యులుప్రసాదించాలని ఆ భగవంతుడిని వేడుకుంటున్నట్లు తెలిపారు.

# రాష్ట్రంలో హరిత ప్రగతి

≫ అంశాలపైన కూడా తగిన ప్రణాళికలు రూపొందించి నివేదించాలన్నారు. భవన నిర్మాణ మెటీరియల్, ఫర్నిచర్, వస్త్రాలు, షూలు ఇతరత్రా వినూత్న వస్తువుల తయారీపై సిఎంకు వివరించారు. అంతిమంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. రీసైక్లింగ్ ద్వారా నూతన ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో అరకు, అనంతగిరి, రంపచోడవరం ప్రాంతాల్లో ఎకో టూరిజం విస్తృతి, అభివృద్ధికి మంచి అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. దీనిపై తగిన ప్రణాళిక తయారు చేయాలని సిఎం ఆదేశించారు. స్థానికులకు మంచి ఆదాయాలను ఇచ్చేదిగా ఈ ప్రణాళిక ఉండాలన్నారు. కర్బన వ్యర్థాలతో సారవంతంగా నిరుపయోగ భూములను మార్చడంతో పాటు, సేంద్రియ సహజ వ్యవసాయ ఉత్పత్తులు, వాటికి అంతర్జాతీయ మార్కెటింగ్ తదితర అంశాలపైన సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ మనం కలెక్ట్ చేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగపడేలా చేయడం చాలా మంచి పరిణామం. సముద్ర తీరాలను శుభ్రం చేయడం, మరింత అందంగా తయారు చేయాలన్నది మంచి విధానం. ఇందులో మంచి అనుభవమున్న మీరు అంతర్జాతీయంగా ఇప్పటికే ఈ ప్రక్రియ చేపట్టారు. ఇందులో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది.. నాన్ బయోడిగ్రేడబుల్ మెటీరియల్‌ను ఎలా రీసైక్లింగ్ లేదా రీయూజ్‌లోకి తేవాలన్న దానిపై సీరియస్‌గానే ఆలోచన చేస్తున్నాం. అందుకు మల్టీ నేషనల్ స్థాయిలో పనిచేస్తున్న మీలాంటి వారి అనుభవాన్ని కూడా ఉపయోగించుకోవాల్సి ఉంది. ఇది ఓ మంచి ప్రయత్నం. పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ కోసం జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి సేకరిస్తున్న వ్యర్థాలను ప్రాసెస్ చేస్తున్న విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ పురపాలక పట్టణాభివృద్ధి సంస్థ నిర్ణయం తీసుకుంది. విశాఖను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసుకోవాలని సిఎం అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అమలవుతున్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమాన్ని అనుసంధానం చేసుకుంటూ విలువైన ఉత్పత్తుల తయారీని చేపట్టడంతో పాటు, బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచడంపై దృష్టి పెట్టాలన్నారు. విశాఖపట్నంలో దీన్ని అమలు చేసి ఫలితాల ఆధారంగా మిగిలిన ప్రాంతాల్లో కూడా ఈ తరహా విధానాలపై దృష్టి పెడతామన్నారు. ఎకో టూరిజంపై ఉత్తరాఖండ్‌లో చేపడుతున్న ప్రాజెక్టు వివరాలను ఎఎస్‌పి ప్రతినిధులు వివరించారు. వ్యవసాయ రంగంలో దేశ చరిత్రలో మొదటిసారిగా మేం ఒక కొత్త వ్యవస్థను తీసుకొచ్చాం. దాదాపు 13వేల గ్రామ పంచాయితీలు ఉంటే వాటిలో 10,777 రైతు భరోసా కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేశాం. అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్లు అక్కడ ఉండి పనిచేస్తారు. ప్రతి ఆర్బీకేలో అక్కడే ఒక కియోస్క్‌ను కూడా ఏర్పాటు చేశాం. విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తూ రైతును చేయి పట్టుకుని నడిపించే బాధ్యత తీసుకున్నాం. విత్తనాలు, ఎరువులు రైతులకు సకాలంలో అందించడంతో పాటు నకిలీ, కల్తీలు లేకుండా చేయడానికి ఆర్బీకే కేంద్రంగా విక్రయాలు ఏర్పాటు చేస్తున్నాం. నాణ్యత నిర్ధారణ కోసం, ప్రభుత్వమే విత్తనాలు, ఎరువులు నాణ్యత నిర్ధారించిన తర్వాతే రైతులకు అందిస్తున్నాం. అంటే విత్తనం నుంచి విక్రయం వరకు రైతులను దగ్గరుండి చేయిపట్టుకుని నడిపించే కార్యక్రమం చేస్తున్నాం. ఇందులో ఆర్బీకే కీలకపాత్ర పోషిస్తుంది. ఇందులో భాగంగానే గ్రామంలో ప్రతి పంటను ఇ-క్రాప్ ద్వారా ప్రతి ఎకరాను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసి, జియో ట్యాగింగ్ చేస్తున్నాం. రైతుతో పాటు పండిస్తున్న పంట వివరాలు నమోదు చేస్తున్నాం. దీని ద్వారా రైతుకు ప్రభుత్వం తరపున అన్ని రాయితీలను అందించడానికి అవకాశం ఉంటుంది. పంట నష్టపోతే ఈ వివరాల సాయంతో పరిహారం కూడా చెల్లిస్తున్నాం. ఈ నేపథ్యంలో ఆర్బీకేలు భవిష్యత్తులో సహజసాగుకు కేంద్రాలుగా మారనున్నాయి.



శనివారం పాటియాలాలో ఆప్ ఎమ్మెల్యే హర్మీత్‌సింగ్ నివాసం వద్ద నిరసన ప్రదర్శన జరిపిన వరద బాధిత రైతులు

# భారత్ ఓ ల్యాబ్

≫ అంశాలతో డిజిటల్ ఎకానమి ప్రపంచ వ్యాప్తంగా మరింత పరిపుష్టి అవుతుందని సురక్షితమైన, సమ్మిళితమైన అందరికీ సమానస్థాయంలో ఫలాలు అందుతాయన్నారు. ఇప్పటికే దేశంలోని బెంగళూరు ఇన్నోవేషన్ హబ్‌గా మారింది. ప్రపంచంలోనే అత్యంతప్రముఖ టెక్ కంపెనీలన్నీ ఇక్కడ ఉన్నాయన్నారు. జి20 డిజిటల్ ఎకానమి మంత్రుల సమావేశం ప్రపంచదేశాల్లో డిజిటల్ ఎకానమి వృద్ధి, అమలుకు సంబంధించినపరిజ్ఞానాన్ని పంచుకునేందుకు తోడ్పడుతున్నదని అన్నారు. భారత్‌లో 85 కోట్లమంది ఇంటర్నెట్ వినియోగదారులు కారుచౌక ధరలతో నెట్‌పొందుతున్నా రన్నారు. డేటా వేగం, పరిధి కూడా భారత డిజిటల్ పరివర్తనానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. అంతేకాకుండా దేశంలో అమలవుతున్న జన్‌ధన్‌బ్యాంకుఖాతాలు, ఆధార్, మొబైల్ వినియోగాలు (జామ్‌త్రయం) యుపిఐ చెల్లింపుల వ్యవస్థలు డిజిటల్ పరివర్తనానికి మార్పులన్నారు. ప్రతినెలా ఇపుడు పదిబిలియన్ లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. ప్రపంచంలోజరిగే రియల్‌టైమ్ చెల్లింపుల్లో 45శాతం భారత్‌లోనే జరుగుతున్నాయన్నారు. నేరుగా లబ్ధి బదిలీచేయడంవల్ల వ్యవస్థలో లీకేజిలను అరికట్టగలుగుతున్నామన్నారు. పన్ను వ్యవస్థ పూర్తిగా డిజిటైజ్‌చేయడం వల్ల పారదర్శకత పెరిగిందని, సుపరిపాలన సాధ్యం అవుతున్నదని ప్రధాని అన్నారు. ప్రపంచ స్థాయిలో వర్చువల్ గ్లోబల్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రా రిపాజిటరీని ఏర్పాటు చేయడం మంచిపరిణామం అన్నారు. ప్రపంచం మొత్తం ఒకే వ్యవస్థ అమలయితే మరింతగా డిజిటల్ ఎకానమీ వృద్ధిసాధిస్తుందన్నారు. డిజిటల్ వృత్తినైపుణ్య మెరుగుపడేందుకు సెంటర్‌ఆఫ్ వర్చువల్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలనిసూచించారు. అయితే ప్రస్తుతం డిజిటల్ ఆర్థికవ్యవస్థకు సైబర్ హాని ఎక్కువ ఉందని, సవాళ్లు ఎ దురవు తున్నాయని మోడీ అన్నారు. జి20 సదస్సులో ఉన్నతస్థాయి సూత్రాలను సురక్షిత, నమ్మకమైన డిజిటల్ ఎకానమి ఏర్పాటుకు దేశాలు పరస్పరం సహకరించుకోవాలన్నారు.

# బండి సంజయ్

≫ లున్నట్లు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బండి సంజయ్ విజయవాడ వస్తున్నారు. ఆయన అమరావతి రైతులను కలుసుకునే అవకాశం ఉంది. బండి సంజయ్ అనంతర పరిణామాల్లో ఉమ్మడి గోదావరి జిల్లాలు, విశాఖ, ఉత్తరాంధ్రలోను పర్యటించే అవకాశం ఉందంటున్నారు. ఆయన ఉత్తేజ పూరిత ప్రసంగాలు బిజెపి కార్యకర్తల్లో జోష్ తీసుకుని వచ్చే అవకాశాలున్నాయని ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# వైఎస్సార్సీ జయభేరి

≫ పోటీ చేశారు. టిడిపికి గట్టి పట్టు వున్న చలివెందులలో తమ గెలుపు ఖాయమని టిడిపి నాయకులు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగా రవీంద్రారెడ్డికి అన్ని రకాలుగా ఎమ్మెల్యే బాలయ్య సహకరించినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరలో వుండడంతో కీలకమైన ఈ ఎన్నికల్లో గెలిచి టిడిపి సత్తా చూపి మానసికంగా వైసిపిని దెబ్బ కొట్టాలని బాలయ్య పన్నిన వ్యూహం బెడిసికొట్టింది. అయితే ఈ ఎన్నికల్లో ఓడిపోతే తమ సొంత పార్టీలో అసమ్మతినాయకులు పండుగ చేసుకుంటారని వారి నుండి కొత్త ఇబ్బందులు వస్తాయని ఊహించిన వైఎస్సార్సీ ఇన్‌చార్జ్ దీపికావేణు ఈ ఎన్నికలు ఛాలెంజ్‌గా తీసుకున్నారు. దీపిక భర్త వేణురెడ్డి, చల్లాపల్లి బాబురెడ్డి, కొల్లకుంట ఆనంద్‌రెడ్డి, తదితరుల బృందం ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేసి విజయం సాధించారు. అన్ని రౌండ్లలోను వైసిపి ఆధిక్యత కనబరిచింది. చలివెందుల పోలింగ్ ఉదయం 7 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగింది. 2 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమై 5 గంటలకు ముగిసింది. మొత్తం 4 పోలింగ్‌స్టేషన్లలో 2514 ఓటర్లు వుండగా 2077 ఓట్లు (82.61 శాతం) పోలయ్యాయి. వైసిపి మద్దతుదారునికి మొదటి రౌండ్‌లో 228, రెండవ రౌండ్‌లో 25, మూడవ రౌండ్‌లో 24 ఓట్ల ఆధికత్యత రాగా మొత్తం మెజార్టీ 337 వచ్చింది. ఇదిలా వుండగా వైసిపికి చెందిన నాయకులు ఓటర్లకు డబ్బు పంచుతున్నారన్న ఆరోపణలు రావడంతో టిడిపి నాయకులు అడ్డుకోగా తోపులాట జరిగింది. అంతకుముందు రాచపల్లిలో మహిళా వాలంటీర్ వైసిపికి ఓటు వేయాలని ప్రచారం చేసిందని ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి కన్జక్షన్ నేతృత్వంలో సిఐలు ఈరన్న, శ్రీనివాసులు, వేణుగోపాల్, ఎస్‌ఐలు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# సీట్ల కేటాయింపు

≫ మలివిడుత కౌన్సిలింగ్‌కు సంబంధించిన వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సుల పట్ల విద్యార్థులు మంచి ఆసక్తి కన్పరుస్తున్నారని వివరించారు. ప్రభుత్వ నిర్దేశిత నిబంధనలను అనుసరించి ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలల ఫీజులు అమలవుతున్నాయన్నారు.

SINGAM KUIL WHITE SATURDAY
DrawDate on:19/08/23

DAY - SINGAM SERIES Dr No:200
1st Prize Rs.100000/- 743158
2nd Prize Rs.7000/- 86504
3rd Prize Rs.3500/-
09587 14311 48692 49576 59625
63113 67521 71523 83826 90768
4th Prize Rs.200/-
0101 1032 1129 1422 2385 2415 2522
2726 3126 7084
5th Prize Rs.100/-
1550 1620 1862 3494 4059 4622 6744
7579 8608 9727
6th Prize Rs.50/-
0078 1327 2979 4605 5908 7136 8900
0144 1621 2980 4700 6077 7213 9000
0203 1647 3041 4711 6218 7221 9188
0350 1710 3257 4732 6371 7250 9220
0439 1769 3505 4782 6383 7304 9227
0485 1857 3521 4909 6669 7396 9513
0688 1924 3653 5013 6717 7666 9570
0929 1966 3691 5034 6780 7727 9698
0996 2175 3864 5120 6800 7856 9845
1016 2188 3931 5280 6823 8170 9853
1090 2304 4043 5364 6827 8346
1153 2484 4049 5509 6859 8391
1251 2530 4131 5666 6938 8475
1283 2861 4197 5734 6960 8511
1285 2921 4301 5867 7104 8729

DAY - KUIL SERIES Dr No:200
1st Prize Rs.100000/- 221575
2nd Prize Rs.7000/- 65013
3rd Prize Rs.3500/-
06111 12010 15153 19635 20036
39462 45298 52088 53476 96379
4th Prize Rs.200/-
0578 2203 2207 3842 4123 5537 5604
6123 7207 9743
5th Prize Rs.100/-
0357 2100 2208 2511 2807 3789 4527
7588 7740 9001
6th Prize Rs.50/-
0073 1150 2158 4042 5750 7077 8949
0110 1191 2259 4137 5788 7102 9010
0129 1261 2489 4157 5790 7112 9016
0201 1324 2554 4162 5990 7190 9123
0286 1478 2640 4181 6061 7239 9290
0310 1520 2652 4270 6062 7389 9469
0321 1659 2796 4296 6345 7504 9615
0364 1709 3070 4331 6367 7520 9861
0542 1817 3097 4340 6418 7564 9905
0559 1850 3187 4466 6431 8248 9926
0594 1873 3247 4503 6456 8265
0623 1875 3400 4792 6531 8406
0822 1881 3567 5056 6682 8410
0848 1992 3702 5137 6919 8456
0931 2156 4000 5306 6939 8551

ROSA DEAR DIAMOND SATURDAY
DrawDate on:19/08/23

DAY - ROSA SERIES Dr No:200
1st Prize Rs.100000/- 813980
2nd Prize Rs.7000/- 48400
3rd Prize Rs.3500/-
01007 13812 29068 30015 40564
47875 69211 70823 77897 88312
4th Prize Rs.200/-
0768 1081 3585 4005 4048 5514 6313
7816 8257 9139
5th Prize Rs.100/-
0133 0923 1066 3852 3913 4639 4758
7280 7479 9891
6th Prize Rs.50/-
0210 1365 2721 4667 6073 7592 9119
0213 1379 2727 4773 6204 7666 9124
0328 1515 2844 4867 6397 7749 9142
0588 1598 3420 5121 6483 7895 9154
0600 1611 3478 5172 6509 7979 9210
0704 1650 3575 5204 6524 8120 9236
0718 1667 3656 5353 6581 8211 9432
0740 1669 3807 5400 6698 8258 9534
0875 1770 3903 5577 6918 8266 9561
0983 1952 4000 5685 6963 8326 9969
1158 2165 4031 5826 7052 8769
1191 2214 4160 5836 7260 8780
1244 2349 4268 5931 7278 8797
1280 2523 4343 5948 7315 9072
1290 2538 4574 5963 7359 9106

DAY - DEAR SERIES Dr No:200
1st Prize Rs.100000/- 372844
2nd Prize Rs.7000/- 07591
3rd Prize Rs.3500/-
01924 12537 19301 21669 27637
40457 55953 66244 83425 89221
4th Prize Rs.200/-
0904 1407 1559 3140 3494 5901 6441
7958 8811 9086
5th Prize Rs.100/-
1421 2572 3671 3985 4327 4770 5360
7063 7717 7906
6th Prize Rs.50/-
0195 1512 2602 3734 5433 7057 8649
0302 1636 2680 3743 5504 7164 8746
0347 1654 2707 3801 5580 7201 8929
0413 1692 2808 4006 5718 7205 9167
0581 1697 3082 4072 5814 7316 9275
0585 1771 3223 4110 5931 7686 9298
0729 1786 3306 4152 5942 7936 9600
0799 1973 3318 4248 6050 7996 9644
1083 2090 3339 4444 6190 8055 9778
1261 2183 3357 4524 6340 8227 9885
1301 2203 3438 4596 6356 8344
1313 2212 3472 4854 6426 8347
1423 2289 3616 4929 6446 8389
1464 2371 3682 5077 6696 8571
1490 2438 3727 5275 6739 8588

THANGAM VAIRAM SKILL SATURDAY
DrawDate on:19/08/23

DAY - THANGAM SERIES Dr No:200
1st Prize Rs.100000/- 971270
2nd Prize Rs.7000/- 64231
3rd Prize Rs.3500/-
20420 23485 25597 28122 48621
54193 54920 80834 81106 90991
4th Prize Rs.200/-
1318 2713 3288 3684 3788 4597 4708
7357 7527 8362
5th Prize Rs.100/-
2635 3538 4538 5617 7229 7772 7784
7942 8855 9042
6th Prize Rs.50/-
0186 2231 3273 5375 6646 7480 9246
0671 2294 3534 5401 6725 7686 9419
0854 2310 3539 5583 6853 7838 9437
0858 2372 3646 5728 6872 7949 9440
1031 2416 3865 5770 6884 8057 9594
1094 2437 3910 5832 6963 8230 9680
1217 2457 4166 6096 7038 8266 9741
1242 2461 4456 6103 7039 8364 9833
1595 2722 4613 6219 7111 8397 9889
1685 2735 4718 6309 7163 8453 9942
1715 2867 4791 6314 7286 8654
1769 2880 4866 6324 7298 8776
1898 2901 4898 6422 7333 8854
2054 2987 5264 6557 7413 8925
2229 3019 5317 6567 7446 9009

DAY - VAIRAM SERIES Dr No:59
1st Prize Rs.50000/- 262889
2nd Prize Rs.7000/- 20912
3rd Prize Rs.3500/-
08649 12833 14386 18389 48409
54638 64577 67553 77260 77795
4th Prize Rs.200/-
1274 2299 2506 5106 5168 6231 7617
8517 8542 9082
5th Prize Rs.100/-
0963 1179 3428 5810 5821 6657 6847
8956 9270 9690
6th Prize Rs.50/-
0003 1542 2839 4587 5611 7870 9049
0049 1576 2850 4597 5682 8069 9056
0060 1743 2906 4799 5883 8241 9188
0103 1849 3083 4835 6011 8250 9346
0484 1874 3175 4895 6431 8303 9567
0613 1944 3177 4951 6438 8371 9831
0767 2073 3233 5008 6456 8412 9883
1068 2122 3247 5120 6732 8434 9908
1116 2176 3307 5151 6750 8476 9922
1257 2249 3468 5259 7029 8529 9945
1294 2269 3502 5273 7068 8804
1326 2462 3791 5518 7176 8807
1349 2691 3822 5545 7209 8809
1350 2707 3868 5562 7443 8899
1420 2799 4150 5605 7520 8953

NALLANERAM MANI SKILL SATURDAY
DrawDate on:19/08/23

DAY - NALLANERAM SERIES Dr No:200
1st Prize Rs.50000/- 685707
2nd Prize Rs.7000/- 59759
3rd Prize Rs.3500/-
05649 10152 17515 24948 32252
47943 51514 75379 84673 92619
4th Prize Rs.200/-
0156 0506 1235 1496 2903 3120 3609
4052 5034 9371
5th Prize Rs.100/-
0326 0385 0481 2120 4368 4520 4711
7654 7983 9354
6th Prize Rs.50/-
0078 2275 3151 5108 7169 8073 9601
0211 2281 3401 5300 7217 8092 9733
0236 2338 3482 5474 7222 8093 9740
0589 2594 3747 5607 7268 8614 9792
0592 2656 3785 5679 7296 8678 9833
1140 2667 3913 5703 7441 8691 9844
1224 2708 4007 5764 7527 8997 9846
1345 2839 4009 5990 7554 9052 9900
1408 2870 4330 6081 7565 9059 9982
1686 2905 4401 6349 7603 9122 9997
2060 2965 4649 6394 7713 9141
2093 2976 4657 6576 7906 9162
2135 2991 4996 6748 7974 9205
2140 3000 5065 6900 8014 9297
2221 3055 5087 6949 8026 9475

DAY - MANI SERIES Dr No:59
1st Prize Rs.50000/- 984515
2nd Prize Rs.7000/- 29584
3rd Prize Rs.3500/-
20422 24961 30753 40664 43748
46865 55788 88538 94113 99336
4th Prize Rs.200/-
0609 0748 1932 3518 3990 5195 5919
6346 7749 9967
5th Prize Rs.100/-
1018 1740 2344 3904 7757 8074 8312
8380 8481 9997
6th Prize Rs.50/-
0155 1543 3013 4055 6369 7890 8863
0371 1567 3102 4104 6374 7916 8918
0428 1688 3165 4228 6452 7920 8924
0568 1778 3310 4361 6680 7966 9056
0646 2087 3336 4391 6737 8016 9187
0696 2121 3337 4539 7035 8135 9433
0725 2135 3349 4699 7038 8139 9837
0773 2227 3626 4785 7158 8435 9910
0790 2276 3724 5090 7163 8462 9917
0795 2445 3741 5141 7168 8533 9929
0963 2510 3774 5344 7200 8627
1124 2674 3841 5474 7277 8629
1209 2686 4028 5604 7546 8694
1266 2884 4034 5828 7580 8779
1358 2996 4036 6256 7690 8848

KUMARAN VISHNU WAVE SATURDAY
DrawDate on:19/08/23

DAY - KUMARAN SERIES Dr No:200
1st Prize Rs.50000/- 154829
2nd Prize Rs.7000/- 33846
3rd Prize Rs.3500/-
00286 04133 13059 27005 31031
59804 87080 87363 87762 99318
4th Prize Rs.200/-
3585 4359 4531 5398 6281 8785 9111
9595 9821 9986
5th Prize Rs.100/-
0296 2672 4320 4528 4557 6472 6628
7246 8627 9393
6th Prize Rs.50/-
0120 2418 3743 5323 6151 7754 8880
0246 2538 3777 5470 6197 7771 8890
0423 2642 3838 5598 6359 7775 8905
0513 2690 3920 5604 6375 8031 9135
0617 2718 3949 5611 6454 8076 9281
0784 2855 4207 5612 6531 8238 9374
1085 3005 4214 5682 6620 8393 9472
1228 3088 4253 5777 6697 8406 9494
1300 3098 4330 5827 6972 8427 9610
1692 3169 4640 5914 7151 8491 9809
1740 3222 4694 5919 7171 8525
1759 3241 4938 5929 7288 8598
1903 3385 4995 5995 7309 8692
2112 3459 5197 5996 7575 8815
2404 3544 5279 6103 7657 8841

DAY - VISHNU SERIES Dr No:200
1st Prize Rs.50000/- 538810
2nd Prize Rs.7000/- 52238
3rd Prize Rs.3500/-
02620 03010 13069 53151 57092
60574 79320 79859 80158 84210
4th Prize Rs.200/-
2651 3003 4021 4940 5972 6023 6272
6406 7115 8613
5th Prize Rs.100/-
0353 3318 4194 4645 5924 6370 6676
7197 8679 9330
6th Prize Rs.50/-
0057 1467 2334 4492 5918 7103 8581
0191 1492 2505 4771 5942 7241 8619
0240 1603 2541 4912 6028 7292 8746
0243 1636 2586 4944 6086 7432 8789
0305 1696 2605 5018 6335 7532 9339
0356 1761 2682 5063 6368 7626 9446
0640 1794 2700 5067 6369 7638 9495
0659 1819 3522 5202 6467 7686 9695
0670 2007 3618 5260 6476 7697 9753
0741 2047 3712 5267 6481 7800 9870
0977 2079 3717 5280 6688 7847
1010 2094 3917 5454 6707 8065
1046 2131 4275 5658 6849 8370
1136 2160 4362 5749 6858 8372
1437 2204 4481 5816 6995 8425

SWARNALAXMI LION GOLD SATURDAY
DrawDate on:19/08/23

SWARNALAXMI SERIES Dr No:200
1st Prize Rs.50000/- 685928
2nd Prize Rs.7000/- 74426
3rd Prize Rs.3500/-
17921 28648 39105 41548 52235
52547 65731 74939 85337 96535
4th Prize Rs.200/-
0254 3603 3905 4612 4752 4791 5172
6038 8310 9954
5th Prize Rs.100/-
0483 0754 2824 3185 3569 3873 5233
5864 8655 9988
6th Prize Rs.50/-
0435 1845 3584 4839 6200 7644 9133
0510 1946 3688 4935 6261 7775 9149
0568 2304 3775 5034 6375 7777 9278
0597 2329 3790 5184 6531 7809 9285
0699 2751 3809 5248 6593 7910 9373
0801 2753 3813 5291 6665 7953 9622
0841 2903 3815 5462 6823 8056 9644
0851 2912 4073 5544 6884 8241 9754
0932 2930 4161 5601 6900 8479 9951
0933 3102 4240 5614 6958 8719 9981
0945 3110 4376 5617 7054 8894
1012 3117 4389 5767 7073 8972
1248 3264 4532 5844 7149 8991
1502 3352 4552 6178 7230 9035
1640 3545 4765 6194 7341 9122

DAY - LION SERIES Dr No:59
1st Prize Rs.50000/- 638115
2nd Prize Rs.7000/- 51332
3rd Prize Rs.3500/-
16662 27348 38768 49497 49954
51511 62668 73873 84628 95570
4th Prize Rs.200/-
1173 1253 4253 4387 4792 6153 6168
8228 8911 9008
5th Prize Rs.100/-
1783 2654 4261 4552 5220 5709 6495
6911 7652 8398
6th Prize Rs.50/-
0099 1595 2667 4941 6523 7721 9250
0129 1787 2783 4946 6596 7727 9283
0195 1939 2922 5024 6624 8103 9293
0469 1966 2985 5052 6762 8260 9346
0574 1993 3048 5056 6811 8328 9438
0757 2145 3109 5161 6833 8464 9518
0790 2157 3610 5381 7017 8556 9688
0870 2267 3688 5389 7047 8645 9789
0980 2396 3893 5480 7195 8754 9842
1018 2437 3912 5545 7282 8757 9947
1151 2461 4097 5801 7369 8996
1334 2517 4553 5812 7418 9019
1376 2551 4579 6088 7586 9082
1416 2560 4871 6223 7647 9120
1448 2637 4875 6398 7672 9190

# తిరుమలలో మరో చిరుత!

≫ ప్రాంతంలో ఇఒ బంగ్లా కూడా ఉండ టంతో అటవీఅధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఇప్పటికే తిరుమలలో కాలినడక మార్గాల్లో చిరుతలు, ఎలుగుబంట్లు కదలికలపై టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, అటవీశాఖ అధికారి శ్రీనివాసులు స్వయంగా భక్తుల భద్రతపై సమీక్షిస్తున్నారు.

**కదలికల ప్రాంతాల్లో బోనులు:**

తిరుమల కాలినడక మార్గంలో, కొండపై ఉన్న సిసికెమెరాల్లో చిరుత, ఎలుగు బంటి కదలికలు గమనిస్తున్న అటవీఅధికారులు ఆయా ప్రాంతాల్లో వాటిని పట్టుకునేందుకు బోనులు ఏర్పాటుకు అటవీ సిబ్బంది సిద్ధమయ్యారు. శేషాచలం అడవుల్లో భక్తుల సంచారం మార్గాల్లో ఐదు వరకు చిరుతలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. వీటిల్లో మూడు చిరుతలను పట్టి బంధించి తిరుపతి ఎస్వీజూకు తరలించారు. ఇందులో రెండు మేన్‌ఈటర్ చిరుతలు ఉన్నాయి. ట్రాఫ్ కెమెరాల్లో కనుగొన్న చిరుతలను పట్టుకునేందుకు అవసరమైన బోనులు మహారాష్ట్ర నుండి తెప్పించారు. చిరుతల జాడను గుర్తిస్తూ పట్టివేసే చర్యలు తీవ్రతరం చేశారు. అంతేగాక చిరుతలను బంధించడంలో ప్రత్యేక అనుభవం, నైపుణ్యం ఉన్న శ్రీశైలం నుంచి అటవీఅధికారుల బృందం తిరుమలలో మకాం వేసింది. ఇక్కడి అటవీఅధికారులతో కలసి చిరుతలను బంధించడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే జూన్ 24వతేదీ ఒక చిరుతపులి, ఆగస్టు 14న మరో చిరుతను, 17వతేదీ మూడో చిరుతను కాలినడకమార్గంలో బోనుల్లో బంధించారు. తాజాగా మొదటిఘాట్‌లో చిరుత పులి సంచారం కనిపించడంతో సాయంత్రం 6గంటల నుండి ఉదయం 6గంటల వరకు ద్విచక్రవాహనాలను నిషేధించారు. భద్రత వలయంలో తిరుమల కాలినడక మార్గాలు, ఘాట్‌రోడ్లు ఉన్నాయి.

# శాశ్వత 'కంచె' ఆలోచన!

≫ సిబ్బంది కొరత లేదని, అవసరమైన మేరకు సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. తిరుమల నడకమార్గాలు, ఘాట్‌రోడ్లలో చిరుతల దాడులు జరగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.

ఇప్పటివరకు దొరికిన రెండు చిరుతలను తిరుపతి జూపార్కులోనే ఉంచుతామన్నారు. నడకమార్గాల్లో శాశ్వతప్రాతిపదికన కంచే ఏర్పాటుచేసే దిశగా టిటిడి, అటవీశాఖ ఆలోచన చేస్తోందని వెల్లడించారు. ఇటీవల టిటిడి అటవీప్రాంతంలో ఆరేళ్ల బాలికపై చిరుత దాడిచేసి చంపిన ఘటన జరిగింది. చిరుతదాడిలో మృతిచెందిన బాలిక కుటుంబానికి ప్రభుత్వం తరపున 5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించామన్నారు.

జరిగిన ఘటన చాలా బాధాకరమని మంత్రి విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున టిటిడికి పూర్తిసహాయసహకారాలందిస్తామని స్పష్టం చేశారు. కాలినడక మార్గాల్లో చిరుతల కదలికలపై పట్టి బంధించడం, భక్తుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై టిటిడి నివేదిక వచ్చిన తరువాత తదుపరి కార్యాచరణ ఉంటుందని మంత్రి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు.

# రోజులు దగ్గర పడ్డాయి..

≫ న్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. అనవసరమైన పన్నుల భారాన్ని తగ్గించి వ్యాపారాలను ప్రోత్సహిస్తామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, చిరు వ్యాపారులకు రాయితీ రుణాలను అందజేస్తామన్నారు. ఆర్యవైశ్యులకు రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామన్నారు. టిడిపి పాలనలో ఆర్యవైశ్యులకు దక్కిన గౌరవం ,అందిన అవకాశాలు మరువలేనివన్నారు. ఎన్నికల్లో సీట్లు, నామినేటెడ్ పదవులు, వివిధ స్దానాల్లో పదువులు ఇచ్చి ప్రోత్సహించారు. ఆర్యవైశ్య కార్పోరేషన్ పెట్టి నిధులు కేటాయించిన ఘనత చంద్రబాబుదన్నారు. వైకాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక మా కార్పోరేషన్ నిధులు కేటాయించాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో దామాషా ప్రకారం అవకాశాలివ్వాలన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సీటును ఆర్యవైశ్యులకు కేటాయించాలన్నారు. మంత్రివర్గంలో, పార్టీ పదవుల్లో తగిన ప్రాధాన్యత నివ్వాలని పలువురు ఆర్యవైశ్యనాయకులు లోకేష్‌కు వినతి పత్రం అందజేసారు. ఆ దిశలో ఆలోచన చేస్తామని లోకేష్ హామీని ఇచ్చారు. లోకేష్ పాద యాత్ర విజయవాడలో కొనసాగుతుంది. ఆయన ఈ రాత్రికి గన్నవరంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం అక్కడ బసచేసి, ముందుకు సాగుతారు.

## వారం - వర్జ్యం

20-8-2023 ఆదివారం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం దక్షిణాయనం
నిజ శ్రావణ మాసం, శుక్ల పక్షం, కార్తి మఖ
చవితి రా.08-29; హస్త రా.01-52
వర్జ్యం ఉ.09-00 ల 10-43
రా.కా.సా.4-30 - 6-00 వ
యమగండం మ.12-00 ల 1-30 వ
దుర్ముహూర్తం సా.4-24 ల 5-12

## వార్తాఫలం

**మేషం:** ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. సామాన్య ధన లాభం.

**వృషభం:** పనులు పూర్తవుతాయి. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది.

**మిథునం:** ఆర్థికంగా బాగుంటుంది. రోజంతా ఉత్సాహంగా గడుస్తుంది.

**కర్కాటకం:** ప్రశాంతత కరువవుతుంది. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు.

**సింహం:** వ్యవసాయదారులకు సామాన్యం. విద్యార్థులకు పరీక్షల్లో విజయం లభిస్తుంది.

**కన్య:** ఉద్యోగాభివృద్ధి సంతృప్తినిస్తుంది. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి.

**తుల:** ఆకస్మిక ధన లాభం. అకారణంగా మానసిక ఆందోళన చెందుతారు.

**వృశ్చికం:** ఖర్చులు అధికం. క్రయ-విక్రయాలు యథాతథంగా ఉంటాయి.

**ధనుస్సు:** వాహన యోగం. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. కార్య సిద్ధి.

**మకరం:** వ్యాపారులకు శ్రమ అధికం. బంధు, మిత్రులను కలుసుకుంటారు.

**కుంభం:** విదేశీ వస్తువులు కొనుగోలు. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి.

**మీనం:** శుభ కార్య చర్చలు ఫలించే సూచనలున్నాయి. వాహన యోగం.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్



# నవంబర్ నెల ఆర్జితసేవ కోటావిడుదల

**తిరుమల, ఆగస్టు 19ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా ఆన్‌లైన్‌లో 90రోజులకు ముందుగానే విడుదల చేస్తున్న ఆర్జితసేవా టిక్కెట్ల కోటా సామాన్యభక్తులు ప్రశాంతంగా టిక్కెట్లు అందుకుంటున్నారు. శనివారం రానున్న నవంబర్ నెలకు సంబంధించి ఆర్జిత సేవలు, దర్శన కోటాను విడుదల చేసింది. నవంబర్‌నెలకు సంబంధించి సుప్రభాతం, తోమాల,అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం బుకింగ్ మొదలైంది. సోమవారం ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లక్కీడిప్‌లో టిక్కెట్లు పొందిన భక్తులు నగదు చెల్లించి వాటిని ఖరారుచేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవాటిక్కెట్లను 22న ఉదయం 10గంటలకు విడుదల చేస్తున్నారు. వర్చువల్‌టిక్కెట్లను 22న మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షణటోకెన్లు 23వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తారు. శ్రీవాణిట్రస్టు బ్రేక్ టిక్కెట్లు ఉదయం 11గంటలకు . వృద్ధులు దివ్యాంగులు కోటాను మధ్యాహ్నం 3గంటలకు, 300రూపాయలు ప్రత్యేక ప్రవేశదర్శనాల టిక్కెట్లను 24వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తారు. ఇక తిరుమల,తిరుపతిలో వసతికోసం గదుల ముందస్తు బుకింగ్‌ను 25వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో టిటిడి విడుదల చేస్తుంది. భక్తులు తిరుపతిబాలాజీ.ఎపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో బుక్‌చేసుకోవాలని టిటిడి కోరింది.

# అలిపిరి తనిఖీకేంద్రానికి బాంబు బెదిరింపు!

## ఫోన్‌చేసి బెదిరించిన వ్యక్తి అరెస్టు



**తిరుమల, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వచ్చే భక్తులు మొదట ప్రవేశమార్గం అలిపిరి తనిఖీకేంద్రంలో బాంబు పెట్టామని, 15వ తేదీ సాయంత్రం 3గంటలకు బాంబు పేలుతుందని, వందమందివరకు చనిపోతారని ఫోన్‌కాల్‌చేసి బెదిరించిన వ్యక్తిని తిరుమల పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడు సేలం వల్లపట్టిపోస్టు స్వామినాధపురంకు చెందిన బి.బాలాజీ(39)ఈనెల 15వ తేదీ ఉదయం 11.25గంటల ప్రాంతంలో అలిపిరి తనిఖీకేంద్రంలోని ల్యాండ్‌లైన్‌కు ఫోన్‌చేసి బాంబు పెట్టామని, బాంబుపేలి వందమంది వరకు చనిపోతారని ఫేక్‌కాల్‌తోబెదిరించాడు. దీంతో అప్రమత్తమైన టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసులు వరుసగా రెండురోజులపాటు నిశితతనిఖీలు, పరిసరాల్లో గట్టి భద్రత చర్యలు తీసుకున్నారు. బాంబు డిస్పోజల్ టీమ్‌తో నిశితంగా పరిశీలించి ఉత్తుత్తి ఫోన్ కాల్‌గా తేల్చారు. ఈ బెదిరింపు కాల్‌చేసిన వ్యక్తిని శనివారం తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఎవరైనా ఇలాంటి ఆకతాయి పనులకు, భక్తులకు, టిటిడికి హాని తలపెట్టినా కఠినంగా చర్యలు తీసుకుంటామని తిరుమల అదనపు ఎస్పి మునిరామయ్య తెలిపారు.

# అమెరికానుంచి తెలుగు విద్యార్థులు వెనక్కి?

## పరిస్థితి ఆరాతీసిన సిఎం జగన్

**విజయవాడ,ఆగస్టు 19,ప్రభాతవార్త ప్రతినిధి:** అమెరికా నుంచి కొంత మంది తెలుగు విద్యార్థులను వెనక్కి పంపిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అధికారులను ఆరా తీసారు. విద్యార్థుల వివరాలు తెలుసుకుని త్వరితగతిన వారి సమస్యను పరిష్కరించాలని,ఈ విషయంలో ఎటువంటి అలసత్వం ఉండకూడదని సూచించారు.అమెరికా నుంచి 21 మంది భారతీయ విద్యార్థులను మన దేశానికి పంపించారు.ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించిన నేపథ్యంలో వీరిలో పలువురు తెలుగువారున్నట్లు సమాచారం ఉండటంతో వారి వివరాలతోపాటు పూర్తి సమాచారాన్ని సేకరించాలని సిఎం జగన్మోహనరెడ్డి సిఎంఒ అధికారులను ఆదేశించారు.విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు కుడా జరపాలని సిఎంఒ అధికారులను సిఎం జగన్ సూచించారు. ఉన్నత విద్య నిమిత్తం అమెరికా చేరుకున్న పలువురు విద్యార్దులు తాము అన్ని డాక్యుమెంట్లను సమర్పించిన తరువాత అక్కడి అధికారులు తమను వెనక్కు వెళ్లాలని ఆదేశించారని ఇండియా తిరిగి వచ్చిన విద్యార్దులు వాపోయారు.ఇమిగ్రేషన్ అధికారుల అడిగిన అన్ని పత్రాలు ఇచ్చామన్నారు. వాటిని తనిఖీ చేసి, తమను కొద్ది సేపు విచారించారని విద్యార్థులు తెలిపారు.వీరిలో అనేక మంది అమెరికాలోని అట్లాంటా,చికాగో,శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయాలలో దిగిన తరువాత ఈ పరిస్థితిని ఎదుర్కొన్నారు.

# ఎన్నిక ఏదైనా గెలుపుకోసం వైఎస్సార్సీ అధికార దుర్వినియోగం



శనివారం మీడియాతో మాట్లాడుతున్న నక్కా ఆనంద్‌బాబు

## ఓటర్లను వలంటీర్లు ప్రలోభపెడుతుంటే ఎన్నికల కమిషన్ స్పందించదా?

## మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శ

**అమరావతి, ఆగస్టు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పలుచోట్ల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూడ అధికార పార్టీ నిసిగ్గుగా అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, ప్రజాస్వామ్యంలో ఎన్నికలను అవహేళనగా, ఫార్సుగా మార్చిన ప్రభుత్వ తీరుతో పాలకులకు కనీస ఇంగిత జ్ఞానం కూడ లేదని స్పష్టమైందని అన్నారు. ఇక్కడి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆనంద్‌బాబు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం 34 పంచాయతీలు, 234 వార్డుల్లో ఉప ఎన్నికలు జరిగాయన్నారు. అధికారంలో ఉన్నామన్న అహంకారంతో వైఎస్సార్సీ నేతలు దిగజారి ప్రవర్తించారన్నారు.. ఉప ఎన్నికల్లో పోలీసు వ్యవస్థను, వాలంటీర్లను వైఎస్సార్సీ ఇష్టానుసారంగా దుర్వినియోగం చేసిందన్నారు. ఈచిన్నపాటి ఎన్నికలే అధికార పార్టీ ఇలా వ్యవహరిస్తే 7,8 నెలల్లో జరిగే సాధారణ ఎననఇనకల్లో పరిస్థితి ఎలాఉంటుందో చెప్పాల్సిన పనిలేదన్నారు. దెందులూరు నియోజకవర్గంలో వీరమ్మకుంట పంచాయతీ ఉప ఎన్నికల జరుగుతుంటే, స్థానిక వైఎస్సార్సీ ఎమ్మెల్యే పోలింగ్‌బూత్‌లో కూర్చొని మరీ దగ్గరుండి తన పార్టీ వారితో రిగ్గింగ్‌చేయించారని ఆరోపించారు. అక్కడి డిఎస్పీ తానే స్వయంగా పోలింగ్‌బూత్‌లోకి తీసుకెళ్లటాన్ని ఏమనాలి? అని ప్రశ్నించారు. ప్రకాశం జిల్లా కొండెపి నియోజకవర్గంలోని పాకాల పంచాయతీ ఉప ఎన్నిక జరుగుతుంటే, స్థానిక టిడిపి ఎమ్మెల్యే వీరాంజనేయస్వామిని గృహనిర్బంధంలో పెట్టిన పోలీసులు అబ్బయ్యచౌదరిని పోలింగ్‌బూత్‌వద్ద ఎలా కూర్చొపెట్టారన్నారు. టిడిపిఎమ్మెల్యేను గ్రామంలోకిఅడుగుపెట్టనివ్వని పోలీసులు, వైఎస్సార్సీ ఎమ్మెల్యేను మాత్రం పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లటం సిగ్గుచేటు కాదా అన్నారు.

**వాలంటీర్లు ఓటర్లను ప్రలోభపెడుతుంటే ఎన్నికల కమిషన్ స్పందించదా?**

ఉమ్మడి అనంతపురం జిల్లా హిందూపురంలో వాలంటీర్లు నేరుగా ఓటర్లను ప్రలోభపెట్టారని, వారి నిర్వాకానికి సంబంధించిన ఫొటోలు ప్రసారమాధ్యమాల్లో వైరల్ అయ్యాయని అన్నారు. ఈ విధంగా ఎన్నికల విధుల్లో వాలంటీర్లు పాల్గొని అధికార పార్టీకి పనిచేస్తుంటే ఎన్నికల కమిషన్ స్పందించదా? అని ప్రశ్నించారు. అధికార మదంతో వ్యవస్థల్ని నొక్కిపెట్టి, త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూడ గెలవచ్చని కలలు కంటున్న అధికార పార్టీకి ప్రజలు సరైన రీతిలో బుద్ధిచెబుతారని ఆనంద్ బాబు పేర్కొన్నారు.

# కుప్పం నుండి గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేస్తాం

## ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

## అక్రమాలకు పాల్పడిన వైఎస్సార్సీ నేతలను వదిలిపెట్టం!

**కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త :** టిడిపి అధినేత చంద్రబాబునాయుడును కుప్పంనుంచి ఈసారి లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించి మరలా రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేస్తామని ఎమ్మెల్సీ, టిడిపి సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మల్లానూరులో జరిగిన సైకిల్ యాత్ర సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో మరలా తెలుగుదేశం పార్టీ ప్రభంజనం మొదలైందని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైందన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడు వైపు చూస్తున్నారన్నారు. దేశానికి, రాష్ట్రానికి మహోన్నతమైన సేవలు అందిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబునాయుడుకు ఓట్లు వేసి గెలిపించడం కుప్పం ప్రజల అదృష్టమన్నారు. నాలుగున్నర ఏళ్ల వైఎస్సార్సీ పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ రాలేదన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు టిడిపి పాలనలో 12వేల కోట్లు ఖర్చు చేస్తే సిఎం జగన్‌రెడ్డి కేవలం 2800 కోట్లు ఖర్చు చేశారన్నారు. కుప్పంలో 90శాతం పూర్తయిన హంద్రీ-నీవా పూర్తి చేయలేదన్నారు. అభివృద్ధి గురించి వైఎస్సార్సీ నేతల మాటలు దెయ్యాలు వేదాలు వల్లించి నట్లుందన్నారు. కుప్పంలో గ్రానైట్,ఇసుక, గ్రావెల్ దోచుకుంటోంది ఎవరో ప్రజలకు తెలుసన్నారు.మల్లానూరులో సైతం ఓ వైఎస్సార్సీ నాయకుడు దోచుకుంటున్నాడని పేర్కొన్నారు. టిడిపి మద్దతుదారుల షాపులు కూల్చారన్నారు. మరో ఆర్నెల్లలో టిడిపి అధికారంలో రావడం ఖాయమన్నారు.అన్యాయాలకు పాల్పడిన వైఎస్సార్సీ నేతలను వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్ బాబు మాట్లాడుతూ కుప్పంలో టిడిపి అధినేత చంద్రబాబు ఉంటే వైఎస్సార్సీ నాయకుల ఆటలు సాగవని ఇక్కడ నుంచి ఓడించాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కుప్పంకు చంద్రబాబు చేసింది ఏమీ లేదనే అబద్దాలు చెబుతున్నారన్నారు.

కుప్పంలో ప్రజలను బెదిరించి భయపెట్టడం చేస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కోఆర్డినేటర్ సత్యేంద్రశేఖర్, సంక్షేమ విభాగం కన్వీనర్ త్రిలోక్,యూనిట్ ఇన్‌చార్జ్ రామచంద్ర, మాజీ ఎంపిపిలు సాంబశివం, డా॥ వెంకటేష్, నేతలు సంజీవి, కన్నన్, విభూషణ్, మోహన్, రాష్ట్ర తెలుగుయువత సభ్యుడు మణి, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, మండల యువత అధ్యక్షుడు సుబ్బు, బిసి సెల్ అధ్యక్షుడు మురళి, స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కర్నూలులో లలితా జ్యుయెల్లర్స్ షోరూం ప్రారంభం



జ్యోతిప్రజ్వలన గావిస్తున్న ముఖ్య అతిథులు

**కర్నూలు విద్య, ఆగస్టు 19, ప్రభాతవార్త:** నగరంలోని మేడం కాంపౌండ్‌లో నూతనంగా నిర్మించిన లలితా జ్యుయెల్లర్స్ షోరూం ప్రారంభోత్సవానికి లలితా జుయెల్లర్స్ అధినేత కిరణ్‌కుమార్ అధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్, పార్లమెంటు సభ్యులు ఎస్ సంజీవ్‌కుమార్, పాణ్యం ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఉమా మహేశ్వరమ్మ, నగర ఎమ్మెల్యే హాఫిజ్‌ఖాన్, నగర మేయర్ బి వై రామయ్య, డిప్యూటి మేయర్ సిద్దారేణుక, వార్డు కార్పొరేటర్ విజయలక్ష్మీలు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి లలితా జ్యుయెల్లర్స్‌నూతన షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎస్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ వ్యాపార ప్రారంభోత్సవాలకు నేను మొదటి నుండి దూరంగానే ఉంటాను కానీ లలిత జ్యుయెల్లర్స్ కిరణ్ ఒక మాములు స్థాయి నుండి 51 షోరూంలు పెట్టేస్థాయికి ఎదగడం అతని స్వయంకృషితో ఎదగడాన్ని అభినందిస్తు నేను ఈకార్యక్రమానికి పాల్గొన్నానన్నారు.

అనంతరం ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో లలితా జ్యుయెల్లర్స్ షోరూం ప్రారంభోత్సవానికి నగర ఎమ్మెల్యేగా ఆహ్వానిస్తు అదే విధంగా కర్నూలు నగరంలో స్వర్ణకారులు ఎంతో మంది ఈ వృత్తిని నమ్ముకొని ఉన్నారని వారి అర్హతను వారి నైపుణ్యాన్ని గుర్తించి వారిని మీ షోరూంలో ఉద్యోగులుగా చేర్చుకొని వారికి న్యాయంచేయాల్సిందిగా కిరణ్‌ను కోరుతున్నామన్నారు. తనందరం పాణ్యంఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన బంగారం, అభరణాలను వినియోగదారులకు నచ్చేవిధంగా తయారుచేస్తున్నారు.

అదేవిధంగా అతితక్కువ కాలంలో లలితా జ్యుయెల్లర్స్ మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. మేయర్ బి వై రామయ్య మాట్లాడుతూ కర్నూలుకు ఎంతో మంది వ్యాపారస్థులు కర్నూలు నగరాన్ని నమ్ముకొని వచ్చి అభివృద్ధి చెందుతున్నందున ప్రముఖ వ్యాపార సంస్థలు కర్నూలు నగరానికి వస్తున్నాయని లలితా జ్యుయెల్లర్స్ కూడ అత్యధిక లాభాలు గడించి మంచి పేరు సంపాదించుకోవాలని మేయర్ బివై రామయ్య పేర్కొన్నారు.

# శనీశ్వరునికి షోడశాభిషేకాలు



## అభయ వెంకటేశ్వరునికి ప్రత్యేకాలంకారాలు

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సందడి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. శనివారం శనీశ్వరుని ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఆలయంలో అభయ వెంకటేశ్వరస్వామి నిలువెత్తు విగ్రహం వెలసింది. ఇక్కడ స్వామికి ప్రత్యేక ఆలంకారాలు భక్తుల్ని ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా వెంకటేశ్వరస్వామి హస్తం కిందకు చూపుతుంటుంది. కానీ శ్రీకాళహస్తీశ్వరాయంలో వెలసిన వెంకటేశ్వరస్వామి విగ్రహం అభయమిస్తున్నట్లు ఉంటుంది. దీని ప్రాశస్త్యంను బాగా ప్రచారం చేస్తున్నారు. వేదపండితులు,అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడషాభిషేకాలు జరిపారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.శనివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిథులతో కళ కళ లాడింది. రాహుకేతుదోష నివారణ పూజలుసుమారు 5వేలు జరిగాయి. ఇక అభిషేకాలు విశేష సంఖ్యలో జరిగాయి.వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయంలోనే తిష్టవేసి పర్యవేక్షించారు.

**శివానందైక నిలయం జనంతో కిట కిట:**

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శివానందైక నిలయం శనివారం భక్తులతో కిటకిట లాడింది. దక్షిణ కైలాసంలో వెలసిన వాయులింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిధుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది.అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు ఆదేశాలతో వారి సిబ్బంది పరుగులు తీసారు.మరో వైపు ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారకశ్రీనివాసులు క్యూలైన్లను పర్యవేక్షించారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపంలోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది. ఒక్కసారిగా జనం తండోపతండాలుగా కడలి తరంగాల్లా కదలి వచ్చారు. రెండు రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ అధికమైంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ డెప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య, ఎఇఓ సతీష్‌మాలిక్, లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, వెంకటముని వారి సహచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**శనీశ్వరునికి షోడషాభిషేకాలు**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరునికి విశేషంగా షోఢషాభిషేకాలు నిర్వహించారు. దక్షిణ భారత దేశంలో ఎక్కడా లేని విధంగా వాయు లింగేశ్వరుడు స్వయంభువుగా వెలసినదివ్యక్షేత్రంలో శనీశ్వరుడు విగ్రహ రూపంలో వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ఈ నేపధ్యంలో శనీశ్వరునికి షోఢషాభిషేకాలు అందించారు.అభిషేకాలు సుమారు 90 మమన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 30 జరిగాయి. రాహుకేతుదోష నివారణ పూజలు 3581లు జరిగినట్లు దేవస్థానం అధికారులు ప్రకటించారు.ఈ ఆలయం వద్ద భక్తుల తాకిడి అధికంగా కనబడింది. అయితే దళారుల అట కట్టించుటకు అధికారులుసిసి కెమెరాలను పరిగణలోకి తీసుకున్నారు.



అగ్నికుల్ తొలి ప్రయోగం అగ్ని బాణం తరలిస్తున్న దృశ్యం

# షార్ నుంచి 'అగ్ని బాణ్' మినీ రాకెట్ ప్రయోగానికి సన్నాహాలు

## ప్రైవేటు నుంచి రెండో ప్రయోగం ఇది

**శ్రీహరికోట (తడ), ఆగస్టు 19 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ రాకెట్ల తయారీ, ప్రయోగాలకు ఇప్పటికే ప్రైవేటు వారికి అవకాశాలు ఇస్తోంది. గతంలో తెలంగాణకు చెందిన స్కైరూట్ వారు తమ తొలి ప్రయోగాన్ని శ్రీహరికోట నుంచి ప్రయోగించారు. అప్పట్లోనే తమిళనాడుకు చెందిన అగ్నికుల్ స్టార్టప్‌కు మరో అవకాశం ఇచ్చారు. అయితే ఎందువల్లనో ఆ ప్రయోగం ఆలస్యమైంది. షార్ తీరంలో అగ్నికుల్ కాస్మస్ సంస్థకు లాంచ్‌ప్యాడ్ నిర్మించుకునేందుకు ఇస్రోపెద్దలు స్థలం కూడా కేటాయించి ఉన్నారు. కొన్నిరోజుల క్రితం ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ లాంచ్ ప్యాడ్‌ను ప్రారంభించారు. ప్రస్తుతానికి అక్కడి నుంచి అగ్నికుల్ కాస్మోస్ వారు తమ తొలి ప్రయోగానికి రంగం సిద్ధం చేస్తున్నారు. అగ్నిబాణ్ పేరిట ఈ సబ్ ఆర్బిటల్ టెక్నాలజీ డెమానుస్ట్రేటర్ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 15న నూతన స్టార్టప్ సంస్థ కొన్ని పరిశీలనలు చేపట్టింది. ఈ స్మాల్ శాటిలైట్‌ను అతి త్వరలోనే భూమికి తక్కువ దూరపు కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ఇందులో ఎటువంటి ఉపగ్రహాలు ప్రయోగించడం లేదు. ఇస్రో వాణిజ్య విభాగం ఇన్‌స్పేస్ సంస్థ ఆహ్వానం మేరకు ఇస్రో సహకారంతో ఈ ప్రయోగాన్ని చేపడుతున్నామని, తాము ఇంతదూరం రావడానికి వారే కారణమని అగ్నికుల్ కాస్మోస్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సింగిల్ స్టేజ్ రాకెట్ సెమీ క్రయో దశతో నింగికి ఎగురుతుంది. త్రీడీ ప్రింటెడ్ సింగిల్ పీస్ 6కెఎన్ సెమీ క్రయోదశ సాయంతో అగ్నిబాణ్ రాకెట్ భూమి నుంచి నిట్టనిలువుగా నింగి వైపు దూసుకెళుతుంది. గతంలో సింగిల్ స్టేజ్ రాకెట్లు భూమి నుంచి ఏటవాలుగా ప్రయోగించేవారు. శ్రీహరికోట శాస్త్రవేత్తలకు ఈరాకెట్ ప్రయోగం మరో కొత్త అనుభూతిని ఇస్తుందనడంలో సందేహం లేదు. ఎందుకంటే గతంలో ప్రయోగించిన స్కైరూట్ ప్రైవేటు రాకెట్ మన రాకెట్ ప్రయోగ వేదికల నుంచి ప్రయోగించారు. ఇది కేవలం ప్రైవేటు సంస్థ వారు సొంతంగా నిర్మించుకున్న రాకెట్ ప్రయోగ వేదిక నుంచి ప్రయోగిస్తున్నారు. అయితే దాని ప్రయాణం, పరిశోధన వంటివి షార్ శాస్త్రవేత్తల సహకారంతోనే జరగనున్నట్లు తెలిసింది. ఈ ప్రయోగం తేదీపై ఇంకా స్పష్టత లేదని షార్ వర్గాలు వెల్లడించాయి.

# బాల్యవివాహాలను అరికట్టడంలో విఫలమైన అధికారులపై చర్యలు

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

**విజయవాడ,ఆగస్టు 19,ప్రభాతవార్త ప్రతినిధి:** బాల్య వివాహాలను అరికట్టడంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి స్పష్టం చేసారు.బాల్యవివాహాలను ప్రోత్సహించే కుటుంబాలకు సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని వెల్లడించారు.

సచివాలయంలో ప్రభుత్వ విభాగాల నిర్వహణలో అనుసరించాలని అంతర్గత వ్యూహాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహరరెడ్డి సమీక్షను నిర్వహించారు,బాల్య వివాహాల కట్టడిపై ఆయన కీలకంగా పలు అంశాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేసారు.బాల్య వివాహాలు చేస్తే ప్రభుత్వ పథకాలు రావని తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని సూచించారు.బాల్య వివాహాల నియంత్రణలో విఫలమైన అధికారుల పై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసారు.బాల్య వివా హాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకో వాలని ఆదేశాలు జారీ చేసారు..బాల్య వివాహిలు జరగకుండా ఖాజీలు,పాస్టర్లు, పురోహితులకు తగిన ఆదేశాలివ్వాలన్నారు.

వివాహ రిజిస్ట్రేషన్‌కు ఉన్న 60 రోజుల గడువును 6నెలలకు పెంచే చట్ట సవరణ తెసా్తమన్నారు.ఈ అంశంలో స్త్రీ,శిశు సంక్షమం,సెర్ప్,విద్య, ఆరోగ్య శాఖలు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేసే స్వచ్ఛంధ సంస్థల సహకారం తీసుకోవాలని సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు.

## చంద్రబాబు, పవన్‌లు విడిగా పోటీచేసినా, కలిసి పోటీ చేసినా

# అది రాజకీయ కుట్రలో భాగమే!: సజ్జల



**విజయవాడ,ఆగస్టు 19,ప్రభాతవార్త ప్రతినిధి:** టిడిపి అధినేత చంద్రబాబు,జనసేన చీఫ్ పవన్‌లు విడిగా పోటీచేసినా, కలిసి పోటీ చేసినా అదంతా రాజకీయ కుట్రలో భాగమేనని వైకాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ 2014లో టిడిపి, జనసేనలు వైకాంగ్రెస్ పార్టీని కేంద్రీకరించి బిజెపితో కలిసి పోటీ చేసారన్నారు. 2019లో విడివిడిగా టిడిపి, జెఎస్పీ పోటీ చేసాయన్నారు.ఈ ఎన్నికల్లో పవన్ నూతన అజెండా దిగాడన్నారు.

చంద్రబాబు గద్దె దిగకుండా చేయాలనే ఉద్దేశంతో వ్యవహరించాడన్నారు.అధికారంలో ఉన్న టిడిపిపై కాకుండా 2019లో పవన్ విపక్షంలో ఉన్న తమ పార్టీపై ఆరోపణలకు దిగారన్నారు. టిడిపి విజయాన్ని అందించేందుకు అనేక విధాలుగా ప్రయత్నించాడన్నారు. ఆయన కుట్ర కనిపెట్టి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పార న్నారు. పవన్ వెనుక చంద్రబాబు ఉన్నాడన్నారు.చంద్రబాబు చేప్పేదే పవన్ చేస్తాడన్నారు.విశాఖపట్టణం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, సిఎం జగన్ పాలనలో ప్రశాంతంగా ఉందన్నారు.చంద్రబాబు హయంలోనే ఘోరాలు జరిగాయని విమర్శించారు. విశాఖకు రాజధాని రాకుండా చేయాలని పవన్ కల్యాణ్, చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వంలో కరెంటు చార్జీలు ఎంత ఉండేవో అందరికి తెలుసునన్నారు.చంద్రబాబు మాట్లాడే మాటలు విజన్‌లా ఉన్నాయని ఏద్దేవా చేసారు.

చంద్రబాబును చూస్తే నవ్వొస్తుందన్నారు. దిశ యాప్ తాను కనిపెట్టానంటారు,సెల్‌ఫోన్‌లో టార్చిలైట్ టెక్నాలజీ తానే కనిపెట్టానని అంటారు.తనని తాను తిట్టుకోవాల్సింది పోయి జగన్‌ను తిడుతునారన్నారు. తమ పార్టీ చేయలేని వాగ్దానాలు ఇవ్వలేదన్నారు. ఇచ్చిన వాగ్దానాలు నూటికి 98.5శాతం అమలు చేసిందన్నారు.ఒక పక్క ప్రజలు సంక్షేమ ఫలాలు అనుభవిస్తూ సంతృప్తి పడుతుంటే, చంద్రబాబు ప్రజలకు మంచి జరగలేదని మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. సంక్షేమ మంటే పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇవ్వకుండా వ్యవస్థలు ద్వారా అడ్డుకోవడమా? అన్నారు. విపక్షనేత చంద్రబాబు రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకోవడానికి చేస్తున్న ప్రతి ప్రయత్నాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.


**MUNICIPAL CORPORATION:TIRUPATI**

**EXPRESSION OF INTEREST**

Invitation for Expression of Interest (EOI) from Organizations/ Consulting firms for Purchase of Double Decker AC Electrical Bus in Tirupati Municipal Corporation

**Roc No.933/TO/Engg/2023-24. Dt. -08-2023**

**Eligibility Criteria:**

The Organisation/ Consulting firms registered in India shall have/are eligible to participate in this Expression of Interest.

Applications for EOI must be clearly marked as "**Expression of Interest for Purchase of Double Decker AC Electrical Bus in Tirupati Municipal Corporation.**

Interest Agencies who are having financial capablity and Technical Competency to perform this Assignment can obtain the details and the Request for Proposal (RFP) documents from the office of the Commissioner, MCT by paying Rs.10,000/- (Rupees of Ten Thousand only) Non - Refundable in the favour of DD Drawn in favour of the Commissioner, Municipal Corporation,Tirupati payable at any Nationalized bank in Tirupati.

**Issue of Tender Schedule** : 20-08-2023 to -08-2023
**Receipt of Bids** : 06-09-2023 upto 3.00PM
**Opening of Bids** : 06-09-2023 @ 4.00PM

Commissioner MCT reserves the right to reject or cancel any or all the bids without assigning reasons thereof.

**Commissioner, Municipal Corporation, Tirupati**

శాస్త్రీయమైన విధానాలతో ఏనుగులు, పులులు వంటి జంతువుల జనారణ్యం లోకి రాకుం డా చర్యలు చేపట్టడంలో మన ప్రభుత్వం యాంత్రాంగాలు విఫలం అయ్యాయి. పంటలు, ఆస్తులు నష్టపోయిన వారిని ఎలా ఆదుకోవాలి అనే అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించలేదు. అడవులలోఉన్న వన్య మృగాలు బయటకు రావడానికి మనం చేస్తున్న తప్పిదాలే ఇందుకు ప్రధాన కారణం. అభివృద్ధి అంటూ చేస్తున్న కార్యక్రమాలు, మైనింగ్ పేరుతో చేస్తున్న దోపిడీలు ప్రధాన కారణాలు. వీటితో నీటి కొరత, ఆహార కొరత వేధిస్తుండడంతో బయటకు వస్తున్నాయి. అభివృద్ధి పేరుతో మనం అడవుల విస్తీర్ణం తగ్గిపోతుంది. అడవుల ఆక్రమణలు సైతం పెరిగిపోతున్నాయి. ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వమే అడవులను ధ్వంసం చేస్తుంది. ప్రత్యామ్యాయంగా చెట్లను నాటుతున్నామంటూ, కోట్లాది రూపా



యలు వెచ్చిస్తున్నామంటూ ప్రకటనలు చేస్తుంది. అయితే ప్రకృతి సిద్ధంగా ఉన్న అడవులకు, ప్రభుత్వం అడవుల నిర్మాణాలకు చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. క్రూరమైన మృగాలకు సహజ సిద్ధమైన అడవుల్లో మాత్రమే భద్రతఉంటుంది. అలా కాకుండా నిర్మితమైన అడువులతో అవి ఉండేందుకు ఆసక్తి చూపించవు. వీటితో పాటు అడవులలో రహదారి మార్గాలు ఏర్పాటు చేసి అడవులను వాణిజ్య, ఆదాయ మార్గాలుగా ఉపయోగించుకుంటున్నారు. దీంతో అడువులలో మానవ సంచారం పెరిగిపోతుంది. అక్కడ ఉండాల్సి న జీవాలుబయటకు వస్తున్నాయి. గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో అడువుల చెట్ల నరికివేత కూడా విపరీతంగాపెరిగింది. అటవీచట్టాలు ఎన్నిఉన్నప్పటికీ అమలు చేయడంలో విఫలంకావడంతో ఎన్నో సమస్యలు వస్తున్నాయి.

# జనవాసాల్లోకి వన్య మృగాలు

**తిరుమలరావు**

అభివృద్ధి పేరుతో సాగిస్తున్న ప్రకృతి విధ్వంసం మానవ మనుగడను ప్రశ్నార్థకంన చేస్తుంది. పర్యావరణ మార్పులతో పాటు వనాల్లోని ఉండాల్సి న జీవాలు జనాల్లోకి వస్తున్నాయి. అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం అంటూ ముందుకు వెళ్తూ జంతు, జీవరాశులకు నష్టం చేకూరుస్తున్నాడు. ఈ క్రమంలో ప్రకృతి విధ్వంసం కావడంతో, అడవుల్లో ఉండాల్సి న జీవరాశులు జనావాసాల మధ్య తిరుగుతున్నాయి. ఇటీవల కాలంలో జరుగుతున్న ఎన్నో మానవ మరణాలకు కారణం అవుతున్నాయి. గత కొద్ది రోజుల క్రితం తిరుమలలో జరిగిన సంఘటన ఉదాహరణగానే చెప్పొచ్చు. చిన్నారి మరణానికి కారణం ఎవరు అంటే అధికారుల వద్ద సమాధానం దొరకదు. తిరుమలకు కాలినడకన వెళ్తున్న చిన్నారిని చిరుత లాక్కెల్లి ముఖభాగాన్ని తినడంతో పాటు కాలిని తీవ్ర గాయపరిచినట్లు గుర్తించారు. ఇలంటి సంఘటనలు ఈ రహదారి వెంట కొత్తేమి కాదు. చాలా సంఘటనలు జరిగినప్పటికీ అధికారులు కట్టుదిట్టమైన భద్రతలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వెల్తువెత్తుతున్నాయి. సామాన్య ప్రజల ప్రాణాలు పోతున్నప్పటికీ ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. తిరుమలలో చిరుత ప్రాణాలు తీస్తే కరీంనగర్ జిల్లాలో ఓ ఎలుగుబంటి హల్ చేసి చేసింది. రాత్రి సమయంలో వచ్చిన ఎలుగుబంటి, మరుసటి రోజు సాయంత్రం వరకు హల్‌చల్ చేసింది. ఎంత ప్రయత్నించిన ఫలితం లేకపోవడంతో మత్తుమందు ఇచ్చి బుల్లెట్‌ను ఉపయోగించి దాన్ని బంధించి అడవుల్లోకి పంపించారు. ఇక శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద నిర్మాణాలు చేపట్టడంతో తరుచుగా మొసళ్లు బయటకు వస్తున్నాయి. నల్లవూరు ముక్కాల్ సెంటర్‌లో మొసళ్ల కారణంగా చేపల వేటకు వెళ్లేవారు, దోభిలు ఇతరులు అక్కడి వెళ్లేందుకు భయాందోళనకు గురౌతున్నారు. ఈ విషయంలో చాలాసార్లు ఫిర్యాదుల అందాయి. అయితే రక్షణ చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొంటున్నారు. ఇక శ్రీకాకుళంలో ఏనుగుల దాడులు అందరికి తెలిసిందే. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. అడవులలో ఉండాల్సి న వన్యమృగాలు జనాల్లోకి రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురౌవ్వడంతో పాటు ప్రాణాలను సైతం కోల్పోయితున్నారు. మరికొన్ని ప్రాంతాలలో అయితే సాధు జంతువులపై దాడి చేసి చంపి తింటున్నాయి. దీంతో వాటిపైన ఆధారపడిన కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. అటవీ పరివాహక ప్రాంతాలలో ఉన్న గ్రామాల్లో ఉన్న ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి న దుస్థితులు నెలకొన్నాయి. అడవులలోని వన్యమృగాలు ఇటీవల కాలంలో తరచుగా





వస్తున్నప్పటి దీనిపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రపంచ వ్యాప్తంగా 1950 నాటికి భూభాగంలో 14శాతం భూమి అరణ్యాలతో నిండి ఉండేది. అడవిలో దొరికే విలువైన కలప, ప్రకృతి సిద్ధమైన గనుల తవ్వకాలకు చేపట్టిన మైనింగ్ కార్యక్రమాలు, పారిశ్రామీకరణకు అటవీ ప్రాంతాలను ఎంచుకోవడం ద్వారా ప్రస్తుతం అటవీ ప్రాంతం 14శాతం నుంచి ఆరుశాతానికి పడిపోయింది. వన్య ప్రాణులు సహజసిద్దంగా ఏర్పరుచుకునన నఆవాసాలు కూడా ద్వంసం అయ్యాయి. దీంతో వన్యప్రాణులు జనావాసాల మీదకు వచ్చి దాడి చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అందించే వివరాల ప్రకారం దేశంలోన ప్రతి సంవత్సరం ఏనుగులు దాడుల వల్ల 1500 మంది మృత్యువాత పడుతుండగా, పులుల దాడుల వల్ల 100 మంది మరణిస్తున్నారు. వేలాది పశువులు, పంటల ధ్వంసం కారణంగా రైతులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతుంది. శాస్త్రీయమైన విధానాలతో ఏనుగులు, పులులు వంటి జంతువుల జనారణ్యంలోకి రాకుండా చర్యలు చేపట్టడంలో మన ప్రభుత్వం యాంత్రాంగాలు విఫలం అయ్యాయి. పంటలు, ఆస్తులు నష్టపోయిన వారిని ఎలా ఆదుకోవాలి అనే అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించలేదు. అడవులలో ఉన్న వన్య మృగాలు బయటకు రావడానికి మనం చేస్తున్న తప్పిదాలే ఇందుకు ప్రధాన కారణం. అభివృద్ధి అంటూ చేస్తున్న కార్యక్రమాలు, మైనింగ్ పేరుతో చేస్తున్న దోపిడీలు ప్రధాన కారణాలు. వీటితో నీటి కొరత, ఆహార కొరత వేధిస్తుండడంతో బయటకు వస్తున్నాయి. అభివృద్ధి పేరుతో మనం అడవుల విస్తీర్ణం తగిపోతుంది. అడవుల ఆక్రమణలు సైతం పెరిగిపోతున్నాయి. ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వమే అడవులను ధ్వంసం చేస్తుంది. ప్రత్యామ్యాయంగా చెట్లను నాటుతున్నామంటూ, కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామంటూ ప్రకటనలు చేస్తుంది. అయితే ప్రకృతి సిద్ధంగా ఉన్న అడవులకు, ప్రభుత్వం అడవుల నిర్మాణాలకు చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. క్రూరమైన మృగాలకు సహజసిద్ధమైన అడవుల్లో మాత్రమే భద్రత ఉంటుంది. అలా కాకుండా నిర్మితమైన అడువులతో అవి ఉండేందుకు ఆసక్తి చూపించవు. వీటితో పాటు అడవులలో రహదారి మార్గాలు ఏర్పాటు చేసి అడవులను వాణిజ్య, ఆదాయ మార్గాలుగాఉపయోగించుకుంటున్నారు. దీంతో అడువులలో మానవ సంచారం పెరిగిపోతుంది. అక్కడ ఉండాల్సి న జీవాలు బయటకు వస్తున్నాయి. గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో అడువుల చెట్ల నరికివేత కూడా విపరీతంగా పెరిగింది. అటవీచట్టాలు ఎన్ని ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో విఫలం కావడంతో ఎన్నో సమస్యలు వస్తున్నాయి. అటవీ ప్రాంతాలు, పులులు ఉన్న ప్రాంతాలలో వాటికి రక్షణ కల్పించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ ప్రాంతంతోపాటు పులులు ఉన్న ప్రాంతాలలో కలుపు మొక్కలను తొలగించడం ద్వారా పొడవైన గడ్డిని వేగవంతంగా పెరిగేలా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇది మంచి మేతగా తయారవడంతో పాటు పులులకు ఆశ్రయాన్ని అందించడంలో సహాయపడుతుందని, ఈ విధంగా చేయాలని కార్యాచరణను అటవీశాఖ అధికారులు చేశారు. ఇప్పుడు అది మరిచిపోయారు. చిన్నచిన్న మొక్కల నివారణలో భాగంగా ఏపుగా పెరిగిన వాటిని కాల్చివేస్తున్నారు. ఈ సమయంలో అడవుల్లో మంటలు వస్తున్నాయి. అంతేకాకుండా క్రూరమృగాలకు ఆహారమైన జంతువుల సంఖ్య కూడా అడవులలో తగ్గిపోతుంది. క్రూరమృగాలకు ఆహారమైన జంతువులను మానవులు వేటాడుతున్నారు. దీంతో అక్కడ ఆహారం దొరకపోవడంతో క్రూరమృగాలు జనాల మధ్యకు రావాల్సి న పరిస్థితి నెలకొంది. అటవీనఅధికారులు సాసర్ పిట్స్ వంటి నీటి వనరుల కూడా అంతంత మాత్రమేంగానే ఉన్నాయి. ఇలా చేయడం ద్వారా సరిహద్దు గ్రామాలలో మానవ నివాసాలు ఉన్న ప్రాంతాలలో పులులు నిరోధించేందుకు సహాయపడతాయి. కానీ ఇవి ఎక్కువ లేకపోవడంతో గ్రామాలమీదకు వస్తున్నాయి. అటవీశాఖ అధికారులు క్రూర మృగాలు సంచరించే ప్రాంతాలపై పూర్తిస్థాయిలో నిఘాఉంచాల్సి ఉంటుంది. అంతే కాకుండా ఎప్పటికప్పుడు సిసి కెమెరాలను ద్వారా పర్యవేక్షించడం ద్వారా మనుషులపై దాడులు నివారించడంతో, వాటికి అవసరమైన ఆహారపదార్థాలను అడువుల్లో అందుబాటు ఉండాల్సి న బాధ్యత అటవీశాఖ ఉంది. అడవులలో జంతు అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన శిక్షలతో పాటు అడవులలో పర్యటనలు చేయాల్సి న అవసరం ఎంతైనా ఉంది. ●

# లోగుట్టు..

మహారాష్ట్ర

**ఎ.వి.వి ప్రసాద్**

ఔనంటే కాదనిలే, కాదంటే ఔననిలే.. రాజకీయ నాయకులకు కూడా ఇది వర్తిస్తుందనే చెప్పాలి. ఫలానావారితో తనకు శత్రుత్వం లేదనో, లేకఫలానా వారితో చేతులు కలుపుతాననో ఎవరైనా పదేపదే అంటే వారు కచ్చితంగా 'తీపి పూత మాత్రలు' తిని పిస్తున్నారనే అర్థం చేసుకోవాలి. ఇప్పుడు అలాంటి చర్చల్లో నానుతున్న నేత శరద్‌పవార్. ప్రధానమంత్రి అయ్యేందుకు అర్హత దేశంలో తనకు మాత్రమే ఉన్నదనుకొంటున్న పవార్, ఆ మార్గంలో చాలాసార్లు పావులు కదిపారు. అయితే ప్రతిసారి భంగపడుతూనే ఉన్నారు. ఆయన ఎన్సీపి అనే పార్టీని నడుపుతున్నది కూడా దానికోసమే. మహారాష్ట్రలో ఆయనకు గణనీయమైన ప్రజాదరణే ఉన్నా, జాతీయ స్థాయిలో ప్రధాని పదవి సాధించడానికి అది చాలకపోవడంతో కనీసం రాష్ట్రపతి అయినా అయితే బాగుంటుందనే ఆలోచనతో కనిపిస్తున్నారు. బిజెపిని సమూలంగా పెకలించివేయాలనే అభిప్రాయంతో గతంలో కనిపించిన పవార్, ఇప్పుడు ఆ పార్టీతో కలిసి నడవడానికి సిద్ధపడుతున్నారంటే దాని పరమార్థం ఏమిటో తేలికగానే అంచనా వేయవచ్చు. తాను ఎంతో బలంగా పెంచాననుకుంటున్న ఎన్సీపీని అజిత్‌పవార్ రెండు ముక్కలు చేసి తన వద్దనున్న మెజారిటీ ముక్కతో కలిసి బిజెపికి అండగా నిలబడడంతో ఇది పవార్ కొత్త వ్యూహమా? అనే సందేహాన్ని కూడా చాలా మంది వెలిబుచ్చారు. మూడు వంతుల మంది ఎమ్మెల్యేలను తనతో తీసుకొని బిజెపితో చేతులు కలిపారు అజిత్. అజిత్ అలా ఎందుకు చేశారో తనకు తెలియదనీ, పార్టీలో చీలిక తెచ్చిన అజిత్ చాలా తప్పు చేశారనీ వ్యాఖ్యానించిన శరద్‌పవార్ ఆయనను పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించలేదో తెలియదు. పోనీ తమదే అసలైన ఎన్సీపీ అని ప్రకటించుకొన్న అజిత్ కూడా శరద్‌పవార్ జోలికి పోకుండా తమ మార్గదర్శి ఇప్పటికీ ఆయనే అంటూ ప్రశంసల జల్లుకురిపించారు. ఇది నిజంగా చోద్యమే. ఎన్సీపీలోని చీలిక వర్గంతో కలిసి బిజెపి సంకీర్ణ ప్రభుత్వంలో చేరిన అజిత్ డిప్యూటీ సిఎం పోస్టుతోపాటు తన అనుచరులందరికీ కీలకమైన పదవులు కూడా సాధించారు. అటువంటి ఏ సందర్భంలో కూడా అజిత్‌ను శరద్‌పవార్ నిశితంగా విమర్శించకపోవడం గమనించవలసిన అంశం. తన సోదరుని కుమారుడనే అభిమానమో, లేక మరొకటో గాని మొత్తానికి అజిత్ ఆకాంక్షలు ఒక్కొక్కటిగా నెరవేరుతున్నాయి. అందుకు పరోక్షంగానైనా శరద్‌పవార్ ఆశీస్సులున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. శరద్‌పవార్ బిజెపికి ప్రత్యక్షమద్దతు ఇస్తే అది ఆయన ప్రతిష్టను బంగాళా ఖాతంలో కలుపుతుంది గనుక, అజిత్‌ను ముందుకు కదిపి ఆయన వినోదం తిలకిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. శరద్‌పవార్ గతవారం మూడు పర్యాయాలు అజిత్‌పవార్‌తో భేటి అయినట్లుగా వచ్చిన



శరద్‌పవార్

వార్తలు రెండు గ్రూపులలోగాని కార్యకర్తలను అయోమయంలో పడేస్తున్నాయి. బిజెపితో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఒకవంక చెబుతూనే, మరోవంక ఆయా పార్టీల ముఖ్యులతో పవార్ చర్చలు జరుపుతున్నారన్నది కూడా బహిరంగ రహస్యమే. సాధారణ కార్యకర్తలు సైతం ఆశ్చర్యపోయేవిధంగా పవార్ కదలికలు సాగుతున్నాయి. ఏ ఎన్నికలొచ్చినా ఈ పరోక్షమద్దతే కీలక పాత్ర వహిస్తోంది. 2024లో మార్పు తీసుకు రావడంపైనే తామంతా దృష్టి పెట్టి పనిచేస్తున్నామని చెబుతున్నారు. రాష్ట్రపతి పదవి ఇవ్వడానికి బిజెపి అంగీకరించని పక్షంలో, కీలకమంత్రి పదవులైనా ఇవ్వాలని కోరుతున్నట్లుగా తెలుస్తోంది. పుణేలోని ఓ వ్యాపారి నివా సంలో శరద్, అజిత్‌లు గత శనివారం నుంచి మూడుసార్లు రహస్యంగా భేటీ అయ్యారని తెలుస్తోం ది. ఒక కుటుంబ పెద్దగా మాత్రమే అజిత్‌తో తాను మాట్లాడుతాననీ, అంతకుమించిన అవగాహన ఏదీ తామిద్దరిమధ్య లేదనీ పవార్ అంటున్నారు. పైకి కనిపించే కథ అలాగే ఉన్నా, లోక్‌సభ ఎన్నికల్లో మోడీ ఘనవిజయం సాధించడానికి పవార్ రూపొందించిన వ్యూహంలో భాగంగానే కథ అంతా నడుస్తున్నదని కూడా భావించవలసి వస్తుంది. అజిత్‌తో పవార్ 'రహస్య' చర్చల ప్రభావం క్రమంగా మిగిలిన పార్టీలపై కూడా పడుతోంది. ఎంవిఎ (మహా వికాస్ అఘాడి)లో భాగస్వాములైన పవార్ నాయకత్వంలోని ఎన్సీపి, ఉద్ధవ్ నాయకత్వంలోని శివసేనలు తమ నుంచి మరికొందరు సభ్యులు జారిపోకుండా జాగ్రత్త పడుతున్నట్లు కూడా కనిపిస్తోంది. అసలే ఉద్రిక్తంగా మారుతున్న రాజకీయాలు మరింత అయోమయానికి గురి చేస్తున్నాయి. తాను బిజెపికి దూరం అంటూనే పవార్ మరింత దగ్గరగా జరుగుతున్నారనే విమర్శలు అందుకే ఎక్కువవుతున్నాయి. కొత్తగా ఏర్పడిన 'ఇండియా' కూటమిలో కూడా పవార్ పట్ల అపోహలు పెరుగుతున్నాయి. ఆయన ప్రత్యక్షంగాని, పరోక్షంగాగని బిజెపికి మద్దతు ఇస్తే కూటమి బలహీనపడుతుందనే అభిప్రాయం వినబడుతోంది. త్వరలో జరిగే మూడో సమావేశంలో పవార్, కేజ్రివాల్ మొదలైన తటస్థ నేతలపై కూటమి ఒక గట్టి నిర్ణయం తీసుకోవచ్చని కూడా భావిస్తున్నారు. పవార్, కేజ్రివాల్‌ను కూటమి నుంచి బయటకు తేవడం బిజెపి వ్యూహంలో భాగం కావచ్చు. ప్రధాని మోడీని ఒకరోజు విమర్శించడం, మర్నాడు సానుకూలంగా వ్యవహరించడంతో పవార్ వ్యూహమేమిటో తెలియక ఆయన వర్గం, అజిత్ వర్గం కార్యకర్తలు కూడాతలలు పట్టుకొంటున్నారు. రాజకీయాలు వేరయినా తాము ఒకే కుటుంబమనే అభిప్రాయం అందరిలో కలిగించ డానికి అటు శరద్, ఇటు అజిత్ కూడా ప్రయత్నిస్తున్నారనీ, దీనిని బట్టి అజిత్ మాదిరిగానే శరద్‌పవార్ కూడా బిజెపికి పరోక్షంగానైనా మద్దతు ఇస్తున్నారనే అభిప్రాయమే సర్వత్రా వ్యక్తమవుతోంది. ●

# ట్రంప్‌ను వెంటాడుతున్న జార్జియా కేసు

అమెరికా

**గన్ని మోహన్**

అమెరికా మాజీ అధ్యక్షుడు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధం అయినప్పటినుంచి ఆయన్ను కేసులు వెంటాడుతున్నాయి. ఒకసారి కోర్టులో లొంగిపోయి విడుదలయినా మళ్లీ మరో కేసు ఆయన్ను వెంటాడుతోంది. ట్రంప్ ఎన్నికల్లో పోటీచేస్తానని ప్రకటించినప్పటి నుంచీ ఆయనపై ప్రత్యర్థులు పోలీస్ జాగిలాల మాదిరిగా వెంటపడి తరుముకుంటున్నట్లే కనిపిస్తోంది. తాజాగా 2020లో జార్జియా ఎన్నికల ఫలితాలను చెల్లనివిగా చేసేందుకు కుట్రలుచేసారన్న అభియోగాలపై ఆయన్నపై కేసులు నమోదయ్యాయి. ఈకేసుకు సంబంధించి ఆయన ఫుల్టన్ కౌంటీ జైలుకు హాజరుకావాల్సి ఉంటుంది. ఈనెల 25వ తేదీలోపు ఆయన లొంగిపోవాలని ఇప్పటికే జ్యూరీ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని షురూచేసుకున్న డొనాల్డ్ ట్రంప్ తనదైనశైలిలోప్రచారానికి దూసుకుపోతున్నారు. జార్జియా ఎన్నికలకు సంబంధించి ట్రంప్‌తోపాటు మరో 18మందిని ఈకేసులో నిందితులుగా నమోదు చేసారు. ఫుల్టన్ కౌంటీ జిల్లా అటార్నీ ఫానివిల్లిస్ ట్రంప్‌తోపాటు మరో 18మంది కూడా ఈనెల 25వ తేదీలోపు లొంగిపోవాలని ఆదేశాలుజారీచేసారు. ఇందుకు సంబంధించి ట్రంప్ తరపు న్యాయవాదులు, జడ్జి విల్లిస్‌పరంగా ఉన్న ప్రాసిక్యూటర్లు ఆయన లొంగిపోయే గడువును మరోవారం పెంచేందుకు చర్చలు జరుపుతున్నారు. ఈనెల 25వ తేదీ కాకుండా మరో వారంరోజులకుపైబడి గడువు పొడిగించేవిధంగా ఇరు పక్షాలమధ్య ఇపుడు పతాకస్థాయిలో చర్చలుజరుగుతున్నాయి. ఒపక్క లొంగిపోవాలన్న ఉత్తర్వులు తనను వెంటాడుతున్నా ట్రంప్‌మాత్రం జంకూగొంకూలేకుండా తనదైనశైలిలో తన అధ్యక్ష అభ్యర్థి ఎన్నికల ప్రచారం నిర్వహించుకుంటూ పోతున్నారు. అయితే ఈలోపు మళ్లీ ఆయన నిర్ణయం మార్చుకున్నా ఆశ్చర్యపోనవసరంలేదు. మొత్తం 91 అభియోగాలను ట్రంప్ ఎదుర్కొంటున్నారు. వీటన్నింటిపైనా వేరువేరుగా కేసులు నడుస్తున్నాయి. ఇపుడు రానున్న ప్రాసిక్యూషన్ కేసులో కూడా ఆయన జార్జియాలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఫలితాలను తారుమారుచేసే కుట్రలుచేసారని, జార్జియా లెక్కింపు చెల్లదన్నట్లు నిరూపించేందుకు అక్రమ మార్గాలు అనుసరించారన్నది ప్రధాన అభియోగం. జార్జియా కేసుకు ముందే ఆయన మరో మూడు కేసులు ఎదుర్కొన్నారు. వీటిలో ఒక మోడల్ అయితే తనపైలైంగిక దాడిచేసారన్నది జార్జియా కేసులోట్రంప్ తోపాటు 19మంది వ్యక్తులు కూడా 2020 ఎన్నికలను చెల్లనివిగా చేసేందుకు కుట్రలుచేసారని ఏకైక అభియోగం. ఫుల్టన్ కౌంటీ షరీఫ్‌పాట్ లాబట్ అయితే ట్రంప్ ఇతర నిందితులనుంచి ముందు వేలిముద్రలు తీసుకోవాలని చూస్తుంటే వచ్చే ఆరునెలల్లోపే ఈకేసు విచారణను పూర్తి చేయాలని జడ్జి విల్లిస్ భావిస్తున్నారు. అదే జరిగితే జార్జియా పరిధిలో మొట్టమొదటిసారి ఒక అమెరికా మాజీ అధ్యక్షుడిని ప్రాసిక్యూషన్‌చేసే కేసు నమోదైనట్లు రికార్డు సాధించినట్లవుతుంది. అలాగే విల్లిస్ కూడా మొట్టమొదటి ప్రాసిక్యూటర్‌గా నమోదవుతారు.



ట్రంప్

కేవలం ఈకేసులే కాకుండా అమెరికా చట్టసభ భవనంపై రిపబ్లికన్ మద్దతుదారులు దాడిచేసి విధ్వంసం చేసిన కేసును కూడా ఎదుర్కొన్నారు. అలాగే అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌ఎన్నికయ్యేందుకు రష్యా ఇంటెలిజెన్స్ సేవలు కూడా విస్తృతంగా పనిచేసాయన్న అభియోగాలు కూడా ఆయనపై నమోదయ్యాయి. రిపబ్లికన్ల అభ్యర్థిగా ఆయన మళ్లీ ఎన్నిక కావాలంటే ప్రచారంలో ఆయనకున్న ప్రాధాన్యం కూడా చూడాల్సి ఉంటుంది. ప్రజల్లో రిపబ్లికన్ల పట్ల ఉన్న ధోరణులు కూడా కొంత ప్రభావితంచేస్తాయి. ఇక అన్నింటికంటే అధ్యక్షభవనం నుంచి అత్యంత రహస్యపత్రాలను తీసుకెళ్లారనే అభియోగాలుకూడా ఉన్నాయి. మొట్టమొదటి కేసు ఆయనపై న్యూయార్క్ బిజినెస్ డాక్యుమెంట్లకేసు ఒకటి ఉంది. వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత మేనెలలో ఈ రహస్యపత్రాల బహిర్గతం కేసుకూడా విచారణకు రావాల్సి ఉంటుంది. ఇపుడున్న ఫెడరల్‌క్రిమినల్‌కేసుల్లోట్రంప్ పాత్ర రుజువైతే దీర్ఘకాలిక శిక్షలు కూడా ఉంటాయి. గరిష్టమైన జరిమానా కూడా విధిస్తారని అమెరికా న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. కనిష్టంగా ఐదేళ్ల జైలు ఉంటుందని అయితే ఇతర నిందితులవలే కాకుండా పెరోల్‌కు అర్హులవుతారు. ట్రంప్ తరహాలోనే గతంలో సోషలిస్టుపార్టీ నామినీ యూగెన్ డెబ్స్ నుప్రాసిక్యూట్‌చేసారు. విద్రోహకార్యకలాపాల చట్టంపరిధిలో ఆయన్ను మొదటి ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకించారని విచారణచేసారు. ట్రంప్‌కు ఉన్న సానుకూలం అంశం ఏమిటంటే రాష్ట్రం బయట ఉన్న వ్యక్తులను అనుమానితులను అరెస్టుచేసేందుకు వీలులేదు. ఈ వెసులుబాటుఉన్నాకూడా బయటున్నంత మాత్రాన ఫెడరల్ అధికారులు అనుమానితులు దేశంలో ఎక్కడఉన్నా అదుపులోనికి తీసుకునేవెసులుబాటు ఉండటంతో ట్రంప్ ఒకవేళ జార్జియాకు బయట ఉన్నప్పటికీ అవసరంఅనుకుంటే న్యాయమూర్తి అదుపులోకి తీసుకోవాలని ఆదేశాలు జారీచేసేప్రమాదం కూడా లేకపోలేదు. ఇపుడుట్రంప్‌పై కొలంబియా, ఫ్లోరిడా, ప్రస్తుత కేసు ఫుల్టన్ కౌంటీ జార్జియా, న్యూయార్క్ కౌంటీ అక్కడే మరోసివిల్‌కేసులు కూడా ఉన్నాయి. అలాగే న్యూయార్క్ సుప్రీంకోర్టులోకూడా ట్రంప్ మరో సివిల్ కేసును ఎదుర్కొంటున్నారు. స్వచ్ఛమైన చరిత్ర కలిగిన నాయకులే కావాలని ప్రతిపౌరుడు కోరుకుంటారు. అమెరికాఫస్ట్, అమెరికన్లే ఫస్ట్ అనేనినాదంతో అధికారంలోకివచ్చిన తర్వాతట్రంప్ తర్వాత ఎన్నికల్లోఘోరంగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. నల్లజాతీయుల నిరసనలతోపాటు, రహస్యపత్రాలను బహిర్గంచేసిన కేసు, ఎన్నికలు ఫలితాలు తారుమారుచేసేందుకు కుట్రలు వంటివి ప్రధానంగా ఆయన ఎదుర్కొంటున్న కీలక కేసులు. వీటి నుంచే ఆయన ముందు బయటపడాలి. అందుకే ఇపుడు ఒపక్కఎన్నికల ప్రచారం నిర్వహించుకుంటూనే మరోపక్క ఈకేసులనుంచి బయటపడే వ్యూహాలను ట్రంప్ అమలు చేయాల్సిందే. ●

# వ్యవసాయరంగంపై కృత్రిమ మేధ ప్రభావం

**ఎన్.సీతారామయ్య**

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి వ్యవసాయ రంగం దేశానికే వెన్నుముక వంటిది. అటువంటి వ్యవసాయ రంగం నేడు సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పుంతలు తొక్కుతుంది. వ్యవసాయరంగంలో మొదట నాగలిపోయి ట్రాక్టర్ వచ్చినప్పుడు యంత్రాలు సాగు చేస్తాయా? అన్నవాళ్లున్నారు. ట్రాక్టర్లకు హార్వెస్టర్లు, స్ప్రేయర్లు, ఇప్పుడు డ్రోన్లూ తోడవడంతో రైతులు ఈ పద్ధతులకు అలవాటు పడ్డారు. ఆధునిక యంత్ర పరికరాల రాకతో వ్యవసాయ రంగం నేడు కొంత పుంజుకున్నది. కానీ తర్వాతి తరాలు మాత్రం వ్యవసాయం అంటే అమ్మో అంటున్నారు. ఇలాంటి సమయం కృత్రిమ మేధ సాంకేతికతలు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తెరపైకి వచ్చింది. వ్యవసాయ రంగంపైనా దీని ప్రభావం నేడు చూపుతున్నది. ఇప్పటికే కొన్ని కృత్రిమ మేధ సాంకేతికత ఆధారిత పరికరాలు అందుబాటులోకి వచ్చాయి వ్యవసాయ రంగంలోకి. దీనివల్ల రైతులకు ఏం మేలు జరుగుతుంది? వ్యవసాయ రంగానికి అంతిమంగా వచ్చేది లాభమా? నష్టమా? అన్న చర్చ సాగుతోంది. మనదేశ స్థూల జాతీయోత్పత్తిలో ఇప్పటికీ వ్యవసాయం వాటా దాదాపు యాభై శాతంపైనే ఆధారపడి ఉన్నది. కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న రంగం ఇదే. అయితే రుతుపవనాలు, మార్కెట్ పరిస్థితులు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు లభించకపోవడం వంటి అనేక కారణాలతో వ్యవసాయం ఇప్పటికీ ఆశలజూదంగానే మిగిలిపోయింది. ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని విస్తృతపరిచి రైతులకు వ్యవసాయం లాభసాటిగా ఉండాలని తలచి వ్యవసాయరంగానికి అనేక రకరకాల పథకాలు పెట్టి తద్వారా లాభాలు చేకూరుస్తున్నప్పటికీ వ్యవసాయం అనేది అంత లాభసాటిగా ఉండడం లేదు. ఈ కారణంగానే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు డ్రోన్లు, మెషీన్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీల వాడకం మొదలైంది. అయితే గత యేడాది విడుదలైన 'చాట్ జిపిటి' ఈ ప్రస్థానాన్ని ఒక అడుగు ముందుకు తీసుకెళ్లిందని చెప్పాలి. మైక్రోసాఫ్ట్‌కు చెందిన అజ్యూర్ ఓపెన్ ఎఐ సర్వీస్ ద్వారా చాట్ జిపిటి ఆధారంగా తయారైన జుగల్ బందీ, చాట్‌బోట్ వీటిలో ఒకటి. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వేర్వేరు సంక్షేమ, సహాయ పథకాల వివరాలను అందిస్తుంది సాఫ్ట్‌వేర్. వాట్సాప్ ద్వారా కూడా అందుకోగల ఈ చాట్‌బోట్ ఇంగ్లీషులో ఉన్న ప్రభుత్వ సమాచారాన్ని పది భాషల్లోకి అనువదించి మరీ రైతులకు అందిస్తూండటం విశేషం. చాట్ జిపిటి వంటి కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్‌లకు వ్యవసాయంతో ఏం పని?అని చాలా మంది అనుకోవచ్చు. కానీ దీని చేరికతో సాగు అన్ని రకాలుగా మెరుగవుతుందన్నది నిపుణుల అంచనా. సమాచారం ఎంత ఎక్కువగా ఉన్నాసెకన్లలో దానిని విశ్లేషించి రైతులకు ఉపయోగపడే కొత్త సమాచారాన్ని అందించగలగడం దీనితో సాధ్యం. నీరు, ఎరువులు, కీటకనాశనుల వంటి వనరులను అవసరమైనంత మాత్రమే వాడేలా చేయడం, పంట దిగుబడులు పెంచడం కోసం తోడ్పడగలదు. ఎప్పటికప్పుడు మారిపోయే వాతావరణాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన సలహా సూచనలు ఇవ్వగలదు. వందేళ్ల వాతావరణ సమాచారం, మట్టికూర్పు, పంటకు ఆశించే చీడపీడలన్నింటిని పరిగణనలోకి తీసుకుని వేసిన పంట ఎంత బాగా పండుతుంది అని కచ్చితంగా చెప్పగలదు. దీన్నే అంచనా విశ్లేషణ అంటారు. ఒకవేళ నష్టం జరిగే అవకాశముంటే దాన్ని వీలైనంత తగ్గించుకునే సూచనలు అందుతాయి. పరిస్థితులు, అవసరాలకు తగ్గట్టుగా సూచించగలదు. వేర్వేరు మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించి విశ్లేషించడం, సొంతంగా పంటల తాలూకు సిమ్యులేషన్లు తయారు చేసుకుని అత్యున్నత సాగు పద్ధతులు, పంటలను అంచనా వేయడం సాధ్యమవుతుంది. దీనిద్వారా పంట దిగుబడులు, వ్యవసాయరంగ ఉత్పాదకత గణనీయంగా పెరిగే అవకాశం ఏర్పడుతుంది. ప్రిసిషన్ అగ్రికల్చర్ అనగా జనరేటివ్ ఏఐ ద్వారా వ్యవసాయంలో వ్యర్థాలను గణనీయంగా తగ్గించగల ప్రిసిషన్ వ్యవసాయంలో సాధ్యమవుతుంది. ఉదాహరణకు పంట పొలం మొత్తం తిరిగే డ్రోన్లు కలుపును గుర్తిస్తే అతి తక్కువ కలుపు నాశనులతో వాటిని తొలగించే ప్లాన్‌ను ఏఐ అందివ్వగలదన్న మాట. అలాగే ఏయే మొక్కలకు నీరు అవసరం? వేటికి ఎండ కావాలన్న, సూక్ష్మ వివరాలను కూడా ప్రిసిషన్ అగ్రికల్చర్ ద్వారా గుర్తించి అందించవచ్చు. ఉపగ్రహ ఛాయా చిత్రాలు, వాతావరణ సమాచారం, మట్టికూర్పు, వంటివన్నీ పరిగణించడం ద్వారా చేసే ప్రిసిషన్ అగ్రికల్చర్ ద్వారా ఖర్చులు తగ్గుతాయి. దిగుబడులు పెరుగుతాయి. వాతావరణ మార్పుల నేపథ్యంలో కరవు, కాటకాలు, వరదల వంటివి పెరిగాయి. ఈ ప్రతికూల పరిస్థితులను తట్టుకుని మనగలిగిన కొత్త వంగడాల అవసరం పెరిగింది. సంప్రదాయ పద్ధతుల్లో జరిగే పరిశోధనల ద్వారా ఈ వంగడాల సృష్టికి కూడా కాలం పడుతుంది. కానీ జనరేటివ్ ఏఐను ఉపయోగిస్తే అధిక దిగుబడులిచ్చే, వాతావరణ మార్పులను తట్టుకోగల వంగడాలను వేగంగా సృష్టించడం సాధ్యమని నిపుణులు చెప్పున్నారు. జన్యు సమాచారాన్ని విశ్లేషించి ఏ రకమైన జన్యువులను తొలగిస్తే, చేరిస్తే లాభదాయకమో ఈ కృత్రిమ మేధ సాంకేతికతలు వేగంగా గుర్తించగలవు. ఇప్పటికే బెంగళూరుకు చెందిన ఒక కంపెనీ సిద్ధం చేసిన కిసాన్ ఎఐ (కిసాన్ జిపిటి) ఇప్పటికే పది భారతీయ భాషల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల రైతు సంబంధిత కార్యక్రమాలు, పథకాల వివరాలను అందిస్తోంది. దీంతోపాటే దిగుబడులు, ఆదాయాన్ని పెంచుకునేందుకు అవసరమైన సలహా, సూచనలు ఇస్తోంది. ప్రతినెలా కనీసం 40వేల మంది రైతులు కిసాన్ ఎఐ ద్వారా లబ్ధి పొందుతున్నట్టు, దాన్ని అభివృద్ధి చేసిన ప్రతీక్ దేశాయ్ తెలిపారు. డిజిటల్ గ్రీన్ పేరున్న అంతర్జాతీయ సంస్థ గూయీ ఎఐతో జట్టుకట్టి వాతావరణ మార్పులను తట్టుకునేలా రైతులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూండగా ఒడిశా వ్యవసాయశాఖ అమాకృష్ ఎఐ ద్వారా పంటల నిర్వహణలో రైతులకు సమాచారం అందిస్తోంది. ప్రభుత్వ పథకాల వివరాలు, నలభైకు పైగా వాణిజ్య, సహకార బ్యాంకులు రైతులకు అందించే రుణ పథకాల వివరాలను ఈ చాట్‌బోట్ ద్వారా అందిస్తోంది. ఇప్పటికే మిర్చి, పసుపు, పరికరాలు మిర్చి, పసుపు పంటల్లో నాణ్యతను తేల్చేందుకు కృత్రిమ మేధ ఆధారిత పరికరాలను ఇప్పటికే వినియోగిస్తున్నారు. ఈ పంటలు ఏవైనా తెగుళ్లకు గురయ్యాయా? వాటిలోని రసాయనాల శాతం, రంగు, తేమ శాతం వంటి వాటిని నిమిషాల్లో తేల్చేస్తున్నారు. ఈ అంశాల ఆధారంగా మిర్చి, పసుపు పంటలకు గ్రేడింగ్ ఇస్తున్నారు. నిప్పు, విద్యుత్, ఎలాగైతే మానవజాతి అభివృద్ధిని కీలక మలుపులు తిప్పాయో అలాగే కృత్రిమేధ కూడా అన్ని అంటారు గూగుల్ సీఈవో సుందర్ పించాయ్. మనిషి యంత్రమూ చేయిచేయి కలిపి ఆడుతూ పాడుతూ పనిచేసే రోజులు వచ్చేశాయంటా రాయన. కృత్రిమమేధ సాయంతో యంత్రాలు ఇప్పుడు చదవగలవు, రాయగలవు, మాట్లాడగలవు. మనిషి చేసే ఎన్నో పనుల్ని అవి చేయగలుగుతున్నాయి. కాబట్టి వాటికి ఆ పనులు అప్పజెప్పి మనుషులు అంతకన్నా పైస్థాయిలో సృజనాత్మకత, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అవసరమైన పనులు చేసుకోవాలన్నది నిపుణుల సూచన. అంటే ఇక ముందు ఎఐ అన్ని రంగాల్లోనూ మనకి కుడిభుజంగా మారనుందన్నమాట. ఏదిఏమైనా ఈ కృత్రిమ మేధ సాంకేతికత పద్ధతి ద్వారా అయినా మనదేశానికి వెన్నుముక అయిన రైతన్నకు వ్యవసాయం లాభసాటిగా జరగాలి, రైతులకు వ్యవసాయంలో నష్టం వచ్చినా ఆత్మహత్యలు జరగకూడదు.రైతు కుటుంబాలు మరింతగా అభివృద్ధి జరగాలి. ●



*నిప్పు, విద్యుత్, ఎలాగైతే మానవజాతి అభివృద్ధిని కీలక మలుపులు తిప్పాయో అలాగే కృత్రిమేధ కూడా అన్ని అంటారు గూగుల్ సీఈవో సుందర్ పించాయ్. మనిషి యంత్రమూ చేయిచేయి కలిపి ఆడుతూ పాడుతూ పనిచేసే రోజులు వచ్చేశాయంటా రాయన. కృత్రిమమేధ సాయంతో యంత్రాలు ఇప్పుడు చదవగలవు, రాయగలవు, మాట్లాడ గలవు. మనిషి చేసే ఎన్నో పనుల్ని అవి చేయగలుగు తున్నాయి. కాబట్టి వాటికి ఆ పనులు అప్పుజెప్పి మనుషులు అంతకన్నా పైస్థాయిలో సృజనాత్మకత, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అవసరమైన పనులు చేసుకోవాలన్నది నిపుణుల సూచన. అంటే ఇక ముందు ఎఐ అన్ని రంగాల్లోనూ మనకి కుడిభుజంగా మారనుందన్నమాట. ఏదిఏమైనా ఈ కృత్రిమ మేధ సాంకేతికత పద్ధతి ద్వారా అయినా మనదేశానికి వెన్ను ముక అయిన రైతన్నకు వ్యవసాయం లాభసాటిగా జరగాలి, రైతులకు వ్యవసాయంలో నష్టం వచ్చినా ఆత్మహత్యలు జరగకూడదు. రైతు కుటుంబాల్లో మరింతగా అభివృద్ధి జరగాలి.*

# నగర ప్రజలకు ఆరోగ్యం,ఆహ్లాదం ఒకే చోట సమకూర్చాం

: మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**విజయవాడ కార్పొరేషన్,ఆగస్టు 19,ప్రభాతవార్త**

నగర ప్రజలకు ఆహ్లాదం,ఆనందం ఒకే చోట సమకూర్చే విధంగా ఏర్పాట్లు అంబేద్కర్ పార్క్‌లో చేసామని మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. నగర ప్రజలకు మౌలిక సదుపాలయను మెరుగపర్చడం,ఆరోగ్యకరమైన ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే అంబేద్కర్



పార్క్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

పార్క్ చివరి దశ పనులను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా పార్క్ ఆవరణలో కొత్తగా నిర్మించిన సైకిల్ ట్రాక్‌పై ట్రయల్‌పై కార్పొరేషన్ అధికారులు ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్క్ ఆవరణలో పచ్చదనాన్ని పూర్తి స్థాయిలో పెంపొందించడం జరిగిందని, అభివృద్ధిలో చివరి దశకు చేరుకుందని, నగర ప్రజలకు విశ్రాంతి,వ్యాయామానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేలా ఈ పార్కును అభివృద్ధిపర్చడం జరిగిందన్నారు. సైక్లింగ్,వ్యాయామాలు చేసేవారికి ఈ పార్కు వాతావరణం మరింత అనుకూలంగా ఉంటుందన్నారు. అంబేద్కర్ పార్క్ అభివృద్ధి పట్ల తన సంతృప్తిని ఆయన వ్యక్తం చేశారు. వచ్చే వారంలోగా అంబేద్కర్ పార్క్‌ను ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని ఆయన ఈ సందర్భంగా హామీనిచ్చారు. ఈ పర్యటనలో అదనపు కమీషనర్(ప్రాజెక్ట్స్) కెవి సత్యవతి,సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) కె.రామ్మోహనరావు,ఏడిహెచ్ శ్రీనివాస్,ఆర్ఎఫ్ఓ వెంకటేశ్వరరావు,ఎస్ఎఫ్ఓ రాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చరిత్ర ఉన్నంత కాలం నడకుదిటిని ప్రజలు మర్చిపోలేదు

- కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం, ఆగష్టు 19, ప్రభాత వార్త :** బందరు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు నడకుదిటి నరసింహారావు అని, బందరు అభివృద్ధి కోసం బతికున్నంత కాలం నిరంతర కృషి చేశారని పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర వెల్లడించారు. మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు 72వ జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ




కార్యాలయం నందు ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆయన ఫోటోకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నడకుదిటి నరసింహారావు బిసి సంక్షేమ శాఖా మంత్రిగా ఉంటూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం బిసి హాస్టల్స్, బిసి రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుతో పాటు ప్రత్యేకంగా మత్స్యకార విద్యార్థుల కోసం మత్స్యకార రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కూడా ఆయన హయాంలోనే నిర్మించేలా కృషి చేశారని కొనియాడారు. అంతే కాదు బందరు అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, వాటిలోవే మనం చూస్తున్న పల్లె తుమ్మలపాలెంలోని భారత్ సాల్ట్ ఫ్యాక్టరీ, కేంద్రీయ విద్యాలయం, ఫిషింగ్ హార్బర్, ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన సముదాయం, 34 పంచాయితీల్లో కరెంటు స్తంభాలు, మత్స్యకారులకు వేటకు వినియోగించే వైర్‌లెస్ సెట్లు, పంపుల చెరువు, తరకటూరు సమ్మర్ స్టోరేజీ లాంటివి అని గుర్తుచేశారు. గొర్రెపాటి గోపిచంద్ మాట్లాడుతూ నడకుదిటి ఏ రోజు పదవుల కోసం తపన చెందలేదని, పదవులు ఆయన కోరి వచ్చినవే కానీ.. ఆయన కోరి తెచ్చుకున్నవి కాదని, అందుకే ఎన్నడూ కూడా పదవిని చూసుకుని గర్వపడని మంచి వ్యక్తి అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో అన్ని విధాలుగా కృషి చేస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ డే

**మచిలీపట్నం టౌన్, ఆగష్టు 19, ప్రభాత వార్త :**

ఫోటో అండ్ మీడియా గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ 184వ ఫోటోగ్రఫీ డే దినోత్సవ వేడుకలు జిల్లా పరిషత్ సెంటర్ నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలో గల కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం లీగల్ అడ్వైజర్ లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ కోటి అక్షరాల భావాన్ని ఒకేసారి ఛాయాచిత్రం చూపిస్తుందని, గత



చరిత్రను నేటి యువతరానికి రాబోయే తరాలకి అందించే ఏకైక సాధనం ఫోటోగ్రఫీ అని, ఫోటోగ్రాఫర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి డాగురె కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేసి నేటి తరం ఫోటోగ్రాఫర్లకు స్ఫూర్తిని అందిస్తూ పట్టణంలో ఏర్పాటుచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం, పళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులు చిలంకుర్తి శేషు, కార్యదర్శి అనంత్, కోశాధికారి శ్రీరామ్, గౌరవాధ్యక్షులు సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ హరి, పెడన, బంటుమిల్లి, చల్లపల్లి ఫోటో మరియు వీడియో గ్రాఫర్ల అనుబంధ సంస్థకు సంబంధించిన సభ్యులు, కమిటీ సభ్యులు, పలువురు సంఘ నాయకులు, ఫోటోగ్రాఫర్లు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# 'అదమా ఇండియా' రైతులకు సేవతో పాటు సామాజిక సేవదృక్పదం లక్ష్యం

**ఎ కొండూరు, ఆగష్టు 19, ప్రభాత'వార్త' :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో అదామా ఇండియా విజయవాడ రీజియన్ మరియు శ్రీమన్నారాయణ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో రూ.7.లక్షల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను మండల తహశీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు తిరువూరు వ్యవసాయ శాఖ ఎడిఎ జి.కెనడి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ పెట్రల్ బంక్ (అబ్బాయిగారి బంకు) వద్ద వాటర్‌ప్లాంట్ ప్రారంభం



అనంతరం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో సౌత్ ఇండియా బిజినెస్‌మెన్ అదామా ఇండియా జి.పాపునాయుడు, జనరల్ మేనేజర్ ఎం.హనుమంతరావు ముఖ్య అతిధులుగా పాల్గొని మాట్లాడుతూ అదామా ఇండియా రైతులకు మార్కెట్‌లో రెండు కొత్త పురుగు మందులను విడుదల చేయడం జరిగిందని ఈ పురుగుమందులను వినియోగించడం ద్వారా పంటలకు ఎటువంటి తెగుళ్ళ సోకవని ఈ కొత్త పురుగుమందులు వినియోగించడం ద్వారా సన్న, చిన్నకారు రైతులు పంటలు అధిక దిగుబడులు సాధించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వీరు కోరారు. ఈ కంపెనీ ప్రోడక్ట్‌ను రైతులకు వినియోగించే విధానంపై పాపునాయుడు, హనుమంతరావు అవగాహన కల్పించారు. సేవా దృక్పదంతో వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,ఇంకా ఈ సదస్సులో శ్రీమన్నారాయణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత ఎస్‌విఎస్ పిచ్చియ్యారావు (అబ్బాయిగారు), ధారావతు రంగారావు, మోర్ల సాంబశివరావు, డాక్టర్ కోలా నరసింహారావు, జడ్పీటిసి మెంబర్ బి.గనియా నాయక్, తిరువూరు అగ్రికల్చర్ ఎడిఎ జి.కెనడి అగ్రికల్చర్ ఎవో ఎస్‌కె టిప్పుసుల్తాన్, అదామా ఇండియా కంపెనీ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ వార్త

# సత్యాన్వేషణకోసం న్యాయపోరాటం..

**అమరావతి, ఆగస్టు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళలు తను ఎలాంటి బాధ్యతలైనా ఎలా స్వీకరిస్తారు.. కర్తవ్యసాధన కోసం ఎలా పోరాడతారు?.. అనే అంశంపై ఆధారంగా రూపొందించిన దీప్తి మన్నె, దర్శి చంద్రన్న ప్రధాన పాత్రల్లో నటించిన జగద్ధాత్రి ధారావాహిక కార్యక్రమం ఈనెల 21న నుంచి జీ తెలుగులో ప్రసారం కానుందని తెలిపారు.. ఇందులోని ప్రధానపాత్ర, మహిళ సీక్రెట్ ఏజెంట్ చుట్టూ ముడిపడిన పరిస్థితుల్లో ఈ ధారావాహికం ఉంటున్నారు. సమాజంలో ఆదర్శవంతమైన మహిళగానే జీవిస్తూ సత్యాన్వేషణ కోసం సాగిస్తున్న న్యాయపోరాటం కోసం పాటుపడే ఓ శక్తివంతమైన మహిళ కథగా రూపొందిందని అన్నారు.

# 2500 కి.మీ మైలురాయి చేరుకున్న 'యువగళం'

**-మంగళగిరిలో 20 వేల ఇళ్ల నిర్మాణానికి శిలాఫలకం-కృష్ణాజిల్లాలోకి ప్రవేశించిన పాదయాత్ర-లోకేష్‌కు నేతల ఘనస్వాగతం**

**అమరావతి, ఆగస్టు 19, ప్రభాతవార్త ప్రతినిధి:**

తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర 188 రోజైన శనివారం 2500 కిలోమీటర్ల మైలురాయికి చేరుకుంది.. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో ఈ మైలురాయికి చేరుకోవటం సంతోషంగా ఉందని లోకేష్ పేర్కొన్నారు. ఈసందర్భంగా అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ఇళ్లులేని 20 వేల మంది నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తామని హామీనిస్తూ శిలాఫలకంను ఆవిష్కరించారు.. దీంతోపాటు అసైన్డ్, కొండవాగు, అటవీ, రైల్వే ఇతర భూముల్లో నివసిస్తున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించి పట్టాలు అందజేస్తానని లోకేష్ హామీనిచ్చారు. కొండవీటి వాగు వద్ద బోట్ అసోసియేషన్ ప్రతినిధుల ఘనస్వాగతంకొండవీటివాగు వద్ద లోకేష్‌కు బోట్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. వైకాపా ప్రభుత్వంలో తాము నష్టపోయిన తీరును వివరించారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చి తమకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. యువగళంతో పోటెత్తిన ప్రకాశం బ్యారేజ్‌ఉమ్మడి గుంటూరు జిల్లాలో పూర్తయిన యువగళం పాదయాత్ర శనివారం ప్రకాశం బ్యారేజ్ వద్ద వీడ్కోలు పలికారు.. పసుపు, ఎరుపు రంగు బెలూన్లతో కృష్ణాజిల్లా నాయకులు స్వాగతం పలికారు. భారీగా తరలివచ్చిన జనంతో జనసంద్రంగా ప్రకాశం బ్యారేజ్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి..



శనివారం ప్రకాశం బ్యారేజ్‌కు చేరుకున్న పాదయాత్రలో అభివాదం చేస్తున్న నారా లోకేష్

# వైద్య విద్య వ్యవసాయ రంగాలకు వైకాపా పెద్దపీట..

ఎమ్మెల్యే రక్షణనిధి వెల్లడి

**ఎ కొండూరు, ఆగష్టు 19, ప్రభాత'వార్త' :**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా వైద్య విద్య వ్యవసాయ రంగాలకు కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నారని, తద్వారా రాష్ట్రాని అన్ని రంగాల్లో అభివృద్ధికి బాటలు వేస్తున్నారని ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. ఎ కొండూరు మండలంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రూ.50లక్షలతో నిర్మించే హెల్త్ ల్యాబ్, తదుపరి చైతన్యనగర్‌లో ఎస్టీ ఆశ్రమపాఠశాలలో రూ.1.40కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులు డైనింగ్ హాల్ ఇంకా ఇతర వసతుల సౌకర్యాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ మండలంలో కిడ్నీ డయాలసిస్



సెంటర్, అలాగే వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ హెల్త్ ల్యాబ్‌లు నిర్మించడం వల్ల రోగులు విజయవాడ లాంటి దూరప్రాంతాలకు వెళ్లి అధిక మొత్తంలో డబ్బులు వృదా చేసుకోకుండా రోగులకు అన్ని రకాల పరీక్షలు ఈ హెల్త్ ల్యాబ్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని త్వరలో దీన్ని రోగులకు అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు. అలాగే నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల అధునాతనంగా నిర్మించి కార్పోరేట్‌లకు ధీటుగా అన్ని రంగాల్లో వసతులు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా నిర్మించడం జరిగిందని ఈ విషయంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో ప్రజల కోరిక మేరకు అభివృద్ధి చేస్తున్నట్లు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల విజ్ఞప్తుల మేరకు సిసి రోడ్లు డ్రైన్‌లకు ఒక్కో గ్రామానికి రూ.20లక్షలతో పాటు ఇంకా అదనంగా మరో 5లక్షలు నిదులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా ఎస్టీ ఆఫీసర్ రుక్మాంగదయ్య మాట్లాడుతూ ఈ ఎస్టీ ఆశ్రమ పాఠశాలను మోడల్ స్కూలుగా మార్చడంతో పాటు, త్వరలో జూనియర్ కళాశాలగా రూపాంతరం చెందటానికి ప్రతిపాదనలను ఎమ్మెల్యే ద్వారా పంపినట్లు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎంపిపి కాలసాని నాగలక్ష్మి, చెన్నారావు (రాడ్) వైస్ ఎంపిపి సిద్దం పద్మ, వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు వెంపాటి రజని, భూక్యా ఝాన్సీ, ఎం.సీతయ్య, కె.శ్రీను, తేళ్లూరి సురేష్, ఎంపిటిసి మెంబర్లు కోట పుల్లారావు, కోలా నాగమణి, డాక్టర్ వెంకట నరసింహారావు, కేశా తండా వైసిపి సీనియర్ నాయకులు దాసరి సతీష్, కొచ్చర్ల ప్రకాష్, కొచ్చర్ల రాజు, మంచికంటి రాజశేఖర్, గందం వెంకన్నచౌదరి, చిమట రామకృష్ణ (రేజా) పిఎసిఎస్ చైర్‌పర్సన్‌లు గుర్రాల వెంకటరావు, టి.వెంకటేశ్వర రెడ్డి, ఎ వెంకటరెడ్డి, తుమ్మూరు వీరారెడ్డి, జడ్పీటిసి మెంబర్ భూక్యా గనియా, మాజీ జడ్పీటిసి మెంబర్ పాలం ఆంజనేయులు, ఎన్‌టిఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం సుహాసిని, ఎడి కెనడి అగ్రికల్చర్ ఆఫీసర్ టిప్పుసుల్తాన్, తహశీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంపిడివో రవికాంత్, పిఆర్ డిఇఇ చక్రవర్తి, ఎఇ సాంబశివరావు, డాక్టర్ వి.స్వాతి, ఎం.బాలమురళీకృష్ణ మూడు రవి, వెంకటేశ్వరరావు, భూక్యాశ్రీను, వైకుంఠరావు, బత్తుల వెంకయ్య, వెంకట్ బి.నాగరాజు, మోర్ల సాంబశివరావు, గ్రామ పంచాయతీ సెక్రటరీలు కెటిరాజు భాస్కరరావు, శోభన్‌బాబు, వెంకటేశ్వరావులు పాల్గొన్నారు.

# నేడు పెద్ద తండాలో నాంచారమ్మ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం

**ఎ కొండూరు, ఆగష్టు 19, ప్రభాత'వార్త' :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం పెద్ద తండా నూతన ఎస్టీ మహిళ పంచాయతీతో నాంచారమ్మ గ్రామ దేవత విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా ఆదివారం ఉదయం 7 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు భరోతు నాగేశ్వరరావు, బి.భీమా, అమర్‌సింగ్, జరబల చిన్నా, వెంకట్రావ్, బానుప్రకాష్, భూక్యా నాగరాజు, బి.రామదాసు శనివారం ప్రెస్‌మీట్‌లో తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో భక్తులు పాల పొంగళ్లు తయారు చేసి గ్రామదేవతకు నైవేద్యంగా సమర్పిస్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించి తరించాల్సిందిగా కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధారవతు లక్ష్మీ రంగారావు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం..

ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు

**నందిగామ, ఆగష్టు 19, ప్రభాత'వార్త' :**

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు తెలిపారు. మండల పరిధిలోని మునగచర్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా శనివారం 8 లక్షల ప్రభుత్వ నిధులతో సిసి రోడ్ల నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. ఆ క్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ



ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఉన్న అన్నిగ్రామాలను అభివృద్ధి చేయడమే గాక 90% ప్రభుత్వ నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మండల కేంద్ర ప్రకటనకు జీవో విడుదల

**వీరులపాడు, ఆగష్టు 19, ప్రభాత'వార్త' :** వీరులపాడు మండల కేంద్రాన్ని వీరులపాడు నుండి జుజ్జూరుకు తరలించేందుకు సంవత్సరం క్రితమే ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసినా ఆలస్యంగా ప్రభుత్వం జీవో నెంబర్ 396తో మండలంలోని పరిపాలనా విభాగాలన్ని జుజ్జూరుకు తరలించాలని అధికారులను ఆదేశించింది. జుజ్జూరును మండల కేంద్రంగా ప్రకటిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటీసు విడుదల చేసిన సందర్భంగా గ్రామంలో ప్రజలు బాణసంచా కాలుస్తూ పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. అందుకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్'లకు ప్రజలు ధన్యవాదాలు తెలియచేశారు. శనివారం జుజ్జూరు ప్రెస్‌క్లబ్‌లో



మండల కేంద్ర ప్రకటనకు హర్షాతిరేకాలు తెలుపుకుంటున్న ప్రజలు

జరిగిన మీడియా సమావేశంలో మొదటనే అన్ని సౌకర్యాలు ఉన్న జుజ్జూరును మండల కేంద్రంగా ప్రకటించి జీవో విడుదల చేసినప్పటికి రాజకీయ కారణాల దృష్ట్యా అతిపెద్ద గ్రామ పంచాయతీగా మండల కేంద్రం కావడానికి జుజ్జూరుకు అన్ని అర్హతలున్న మండల కేంద్రం వీరులపాడుకు తరలిపోయిందని, గత 40 సంవత్సరాలుగా పోరాడుతూనే ఉన్నా, ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా తమను ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. మండల కేంద్రం తరలింపుకు పరిపాలనా కార్యాలయాల ఏర్పాటుకు అన్ని రాజకీయ పార్టీలు తమవంతు సహకారాలు అందించాలని మండల సాధన కమిటీ సభ్యులు కోరారు. అంతేగాక పరిపాలన విభాగాలు తరలింపుకు గ్రామంలో వసతుల కల్పనకు తక్షణమే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి మండల కేంద్ర ఏర్పాటుకు అవసరమైన సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి కోటేరు శ్రీలక్ష్మి, సర్పంచ్ రమావత్ కోటి, సొసైటీ అధ్యక్షుడు పూల రాంబాబు, ఉపసర్పంచ్ పసుపులేటి సాయిబాబు, షేక్ కార్పోరేషన్ డైరెక్టర్ షేక్ షహనాజ్ బేగం, కానూరు వెంకట్ రమావత్ రాము, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేవరకొండ శ్రీనివాసరావు, స్థానిక బిసి నాయకుడు తమ్మిశెట్టి ఏడుకొడలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# సర్పంచ్ పీఠంపై గద్దె వెంకటేశ్వర్లు

**వీరులపాడు, ఆగష్టు 19, ప్రభాత'వార్త' :**

మండలంలోని దాచవరం గ్రామంలో సర్పంచ్ పదవికి జరిగిన ఉత్కంఠ పోరులో వైకాపా బలపరచిన అభ్యర్థి గద్దె వెంకటేశ్వర్లు విజయం సాధించారు. గత ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందిన గద్దె కోటేశ్వరరావు అకాల మరణంతో ఏకగ్రీవానికి స్థానిక ఎమ్మెల్యే ప్రయత్నించినప్పటికి టిడిపి సానుభూతి పరుడైన తోట రవి అంగీకరించకపోవడంతో ఎన్నిక అనివార్య మైంది. వైకాపా



బలపరచిన అభ్యర్థి తన సమీప ప్రత్యర్థి టిడిపి అభ్యర్థిపై 30 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.


వార్త VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

FOR SALE

★ జూపూడి గ్రామంలో కొండపల్లి ఖిల్లా రోడ్‌లో నిమ్రా ఇంజనీరింగ్ కాలేజీ ప్రక్కన 9 సెంట్స్ స్థలము అమ్మకమునకు కలదు. ఆసక్తికలవారు 9393368011 సంప్రదించండి.

(Ro.No.22382)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# సచివాలయ ప్రార్థనామందిరాల ప్రారంభానికి ముహూర్తం ఖరారు

### 25న ప్రారంభించనున్న సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 19:** తెలంగాణ పాత సచివాలయ ప్రాంగణాల్లో ఉన్న ప్రార్థనా మందిరాలను రాష్ట్ర ప్రభుత్వం పునఃనిర్మించింది. గతంలో ఆ ప్రాంగణంలో నల్లపోచమ్మ అమ్మవారి ఆలయం, రెండు మసీదులు, చర్చ్ ఉండేవి. పాత బిల్డింగ్ కూల్చివేతల సమయంలో ప్రార్థనా మందిరాలకు నష్టం జరగడంతో ప్రభుత్వ ఖర్చుతోనే వాటిని పునర్నిర్మిస్తామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రకటించారు. అందుకు అనుగుణంగా సచివాలయ ప్రధాన ప్రాంగణం వెలుపల వాటిని నిర్మించారు. ఈనెల 25న సచివాలయ ప్రార్థనా మందిరాల ప్రారంభోత్సవం జరగనుంది. సచివాలయానికి నైరుతి మూలన నల్లపోచమ్మ అమ్మవారి ఆలయాన్ని విశాలంగా నిర్మించారు. ప్రధాన ఆలయంలో భాగంగా గర్భగుడి,మహా మండపం నిర్మించారు. నల్లపోచమ్మ ఆలయంతో పాటు శివాలయం,ఆంజనేయస్వామి ఆలయం.గణపతి ఆలయం,సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్మాణం కూడా జరిగింది. పాత సచివాలయ ప్రాంగణం దేవాలయంలో ఉన్న నల్లపోచమ్మ అమ్మవారి విగ్రహాన్ని చిక్కడపల్లిలోని ఓ ఆలయంలో ఉంచి ఇంతవరకు పూజలు నిర్వహిస్తున్నారు. ప్రారంభోత్సవ సమయానికి కొత్త ఆలయంలోకి తీసుకొచ్చి పునఃప్రతిష్ట చేస్తారు. ఇతర ఆలయాల విగ్రహాలను తిరుపతిలో తయారు చేయించారు. హిందూ సాంప్రదయాలను అనుసరించి పూజారుల సమక్షంలో 25న నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన చేసి దేవాలయాన్ని సిఎం కెసిఆర్ పునఃప్రారంభిస్తారు. గతంలో ఉన్న స్థలంలోనే రెండు మసీదులను నిర్మించారు. మసీద్-ఎ-మోతెమది,మసీద్-ఏ-హాష్మీతో పాటు ఇమామ్ నివాసాన్ని నిర్మించారు. మసీదులు,ఇమామ్ నివాసం సచివాలయానికి పశ్చిమ భాగాన ఉన్నాయి. మసీదుల సమీపంలోనే చర్చ్‌ను నిర్మించారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల చర్చ్ నిర్మాణం కూడా పూర్తయింది. ఈనెల 25వ తేదీనే మసీదులు,చర్చ్ ప్రారంభోత్సవం కూడా జరగనుంది. ఇస్లాం, క్రిస్టియన్ మతాల సాంప్రదాయాలను అనుసరించి ఆయా మత పెద్దల ఆధ్వర్యంలో సిఎం కెసిఆర్ ప్రారంభిస్తారు. ప్రార్థనా మందిరాలకు నిర్వహణా కార్యవర్గాలు కూడా ఏర్పాటయ్యాయి. ఆలయ కమిటీకి చైర్మన్‌గా సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్‌రావు,అధ్యక్షునిగా కె.శ్రీనివాస్‌రావు వ్యవహరించనున్నారు. మసీదులకు గౌరవ అధ్యక్షుడుగా యూసుఫ్,అధ్యక్షునిగా అయూబ్ ఖాన్ ఉంటారు. చర్చ్ కమిటీకి ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి రాయి రవి చైర్మన్‌గా,జిఏడీ ఎస్ఓ చిట్టిబాబు ఉపాధ్యక్షులుగా,స్వర్ణరాజ్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తారు. గతంలో సిఎం ఇచ్చిన హామీ ప్రకారం సచివాలయ ప్రాంగణంలో ప్రార్థనా మందిరాలు త్వరితిగతిన పునఃప్రారంభించడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

# వ్యవసాయ రుణాలపై ఎస్‌బిఐ దృష్టి

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**రైతాంగాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు ఎస్‌బిఐ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం వ్యవసాయ రుణాలపై ప్రత్యేక దృష్టిసారించింది. ఈ మేరకు వీటికి సంబంధించి ఎస్‌బిఐ చైర్మన్ దినేష్‌ఖారా మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో 2.7 లక్షల కోట్ల రూపాయల మేర రుణాల మంజూరుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఈ ఏడాది 3 లక్షల కోట్ల రూపాయల చొప్పున పంట రుణాలను రైతాంగానికి ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేయనున్నట్లు వివరించారు. మొత్తంగా వ్యవసాయ రుణాల వసూలు శాతం కొంత మేర తగ్గిందని, అయినా రైతులకు ఇబ్బంది కలుగకుండా వ్యవసాయ రుణాలను పెద్ద ఎత్తున మంజూరు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొననఖనరు. బ్యాంకింగ్ కరస్పాండెంట్ల సంఖ్య 67 వేలు ఉండగా, ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో వాటిని లక్షకు పెంచుతున్నట్లు వెల్లడించారు.

# అత్తింటివారిపై అల్లుడు విషప్రయోగం

### ఒకరు మృతి.. మియాపూర్‌లో దారుణం

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), ఆగస్టు 19, ప్రభాతవార్త :** మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. సొంత అల్లుడే అత్తింటి కుటుంబంపై విష ప్రయోగం చేశాడు. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందారు. మిగిలిన కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అత్తింటివారిని అంతం చేయాలనే ఉద్దేశంతోనే బాధిత కుటుంబానికి చెందిన అల్లుడు వారిపై విష ప్రయోగం చేశాడని పోలీసులు తెలిపారు. అత్తింటి వారిని అంతం చేయాలనే పథకం పన్నిన అల్లుడు అజిత్..తన వ్యూహం ప్రకారం అత్తింటి వారు తినే ఆహారంలో విషం కలిపాడు. విషయం తెలియక ఆ విష ఆహారాన్ని తిన్న బాధితుల ఆరోగ్యం క్షీణించటంతో హుటాహుటిన వారిని ఆసుపత్రికి తరలించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నిందితుడు ముప్పవరపు అజిత్ కుమార్ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో ఇప్పటికి ఆరుగురుని అరెస్ట్‌చేసినట్టు పోలీసులు తెలిపారు.శిరీష తల్లి మహేశ్వరి మృతిచెందింది. ఇతర కుటుంబ సభ్యులకు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యులు చికిత్స చేస్తున్నారు. కేసును మియాపూర్ పోలీసులు ఆయా కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# మద్యం దరఖాస్తులతో రూ. 2,629.80 కోట్ల ఆదాయం

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** తెలంగాణలో మద్యం దుకాణాలకు లైసెన్స్ జారీ కోసం ఆహ్వానించిన టెండర్ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. 2620 దుకాణాలకు గాను 1,31,490 దరఖాస్తులు వచ్చాయి. 2,629.80 కోట్ల ఆదాయం లభించింది. సరూర్‌నగరలో 10908 దుకాణాలు శంషాబాద్‌లో 10811 దరఖాస్తులు వచ్చాయి. గతంలో 2021లో 68691 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈనెల 20న కలెక్టర్లు డ్రా తీసి దుకాణాలు కేటాయిస్తారు.

# ముగ్గురు నాన్‌కేడర్ ఎస్పీలకు డిజిపి అభినందన



ఐపిఎస్ హోదా అందుకున్న ముగ్గురు నాన్‌కేడర్ ఎస్పిలు వెంకటేశ్వర్లు, చింతమనేని శ్రీనివాస్, మురళీధర్‌లకు ఐపిఎస్ బ్యాడ్జీలు అలంకరిస్తున్న డిజిపి అంజనీ కుమార్


**హైదరాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో సుధీర్ఘకాలంగా పనిచేస్తూ నాన్ కేడర్ ఎస్పీలుగా వున్న అందుకున్న ముగ్గురు అధికారులను కేంద్రం ప్రక టించిన ఐపిఎస్ హోదాను శనివారం అధికారికంగా అందుకున్నారు. గ్రూప్ వన్ అధికారి అయిన ఆర్.వెంకటేశ్వర్లు, వరంగల్ రేంజి అధికారి అయిన మురళీధర్, హైద రాబాద్ రేంజి అధికారి అయిన చింతమనేని శ్రీనివాస్‌లకు ఇటీవల కేంద్రం ఐపిఎస్ ప్రకటించడం విదితమే. వీరంతా ప్రస్తుతం నాన్ కేడర్ ఎస్పిలుగా తమ తమ జోన్లలో విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఈ ముగ్గురు అధికారు లను డిజిపి అంజనీ కుమార్ తన కార్యాలయానికి పిలిపించి ఐపిఎస్ హోదాకు సంబంధించిన బ్యాడ్జిలను భు జాలకు తొడిగారు. ఈ సందర్భంగా ముగ్గురు అధికారులను డిజిపి అభినందించి భవిష్యత్తులో మరింత కష్టపడి పనిచేయాలని ఆకాంక్షించారు.

# 28 నుంచి దోస్త్ స్పెషల్‌డ్రైవ్ ఫేజ్

- సెప్టెంబర్ 5 వరకు వెబ్‌ఆప్షన్లు
- 9న సీట్ల కేటాయింపు
- 10 నుంచి 15 వరకు కాలేజీల్లో చేరాలి
- విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2023లో మరో అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు జరిగిన దోస్త్ అడ్మిషన్ల వివరాలు.. ఇంకా మిగిలిన సీట్ల వివరాలపై విద్య శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, తెలంగాణ ఉన్నత విద్యా మండలి అధికారులతోపాటు.. డిగ్రీ కోర్సులను అందిస్తున్న 7 యూనివర్సిటీల వీసీలతో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్యార్థులకు మరోసారి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో ఈసారి అవకాశం కల్పించాలని కోరారు. స్పెషల్ డ్రైవ్ ఫేజ్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్లను ఈ నెల 28 నుంచి ప్రారంభించి సెప్టెంబర్ 4 వరకు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 28 నుంచి సెప్టెంబర్ 5 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఈ స్పెషల్ డ్రైవ్ ఫేజ్‌లో వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అనుమతించారు. అలాగే స్పెషల్ డ్రైవ్ ఫేజ్‌లో రిజిస్ట్రేషన్‌ను రూ. 400గా నిర్ణయిం చారు. స్పెషల్ డ్రైవ్ ఫేజ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను సెప్టెంబర్ 4న చేపట్టనున్నారు. సెప్టెంబర్ 9న సీట్ల కేటాయింపు చేస్తారు. సెప్టెంబర్ 10 నుంచి 15 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి అవకాశం ఇవ్వగా .. సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్‌రిపోర్టింగ్ చేసిన వారందరూ సెప్టెంబర్ 11 నుంచి 15 వరకు ఆయా కాలేజీల్లో చేరాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన దోస్త్ అడ్మిషన్ల సందర్భంగా డిగ్రీ కాలేజీల్లో 1,89,046 మంది రిపోర్టు చేసినట్టు తెలిపారు.

# ఏపిపిఎస్‌సి గ్రూప్-1-2023లో శ్రీచైతన్య ఐఎఎస్ అకాడమీ విద్యార్థికి స్టేట్ మొదటి ర్యాంక్



భానుశ్రీలక్ష్మి | బొడెల సుజిత | గోపిశెట్టి మనోహర్ | వెల్లపనేని జ్యోతి | శ్రీసాయి హర్ష | బి. రమ్యకీర్తన

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ఇటీవల ప్రకటించిన 2023 ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు విజయభేరి మ్రోగించారు. స్టేట్ మొదటి ర్యాంక్‌తోపాటు మంచి సెలక్షన్స్ సాధించి శ్రీచైతన్య ఔన్నత్యాన్ని మరోమారు చాటారు. గతంలో శ్రీచైతన్య ఐఎఎస్ అకాడమీలో ఇంటర్, డిగ్రీలో ఇంటిగ్రేటెడ్ కోర్సు చదివిన భానుశ్రీ లక్ష్మీ గ్రూప్-1 మంది ర్యాంక్ కైవసం చేసుకుని డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపి కవ్వగా, బోడెల సుజిత అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ టాక్స్ ఆఫీసర్‌గా, గోపిశెట్టి మనోహర్ ఆర్‌టీ వోగా, వెల్లప నేని జ్యోతి ఎంపీ డీవోగా, శ్రీసాయి హర్ష ఎంపీడీవోగా, బీ రమ్యకీర్తన(స్టాఫ్) మున్సిపల్ కమిషనర్‌గా సెలక్షన్స్ సాధించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమీలో ఇంటర్, డిగ్రీలలో ఇంటిగ్రేటెడ్ కోర్సు చదివిన విద్యార్థులు గ్రూప్-1లోనూ టాపర్స్‌గా నిలిచి వివిధ సర్వీసులకు ఎంపిక కావటం చాలా సంతోషంగా ఉందని తెలుపుతూ విజేతలకు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

## ఎఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలంటూ మోకాళ్లపై నిరసన

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 19, ప్రభాతవార్త:** కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద మోకాళ్ళపై నిల్చుని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్నాకు ముఖ్యఅతిథిగా యూనియన్ నగర అధ్యక్షుడు జె.కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్ట్ పద్దతిలో ఏఎన్‌ఎంలు గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నా వీరిని రెగ్యులర్ చేయడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని అన్నారు. కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి రాత పరీక్షల ద్వారా రెగ్యులర్ ఉద్యోగంలోకి రావాలనడం అన్యాయమని, నోటిఫికేషన్ రద్దు చేసి కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల ను వెంటనే ప్రభుత్వం భేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు అందరు కూడా సమ్మెలోకి వెళ్లిన నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో కూడా అందరూ సమ్మెలో ఉన్నారని, ప్రభుత్వం కార్యక్రమాలు వైద్యఆరోగ్య శాఖలో నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం అనేక శాఖలలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ఆర్టీసి వారిని ప్రభుత్వంలోకి విలీనం చేస్తూ వరాలజల్లు కురిపిస్తోందన్నారు. అదే పద్దతిలో వైద్యఆరోగ్య శాఖలో కూడా రెగ్యులర్ చేయాలని, నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, నగర నాయకులు రాజేశ్వరి, లక్ష్మీ, అమ్మాజి, విజయ, ప్రణయశీల తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బినగర్ బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే సీతక్క

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ పోలీసుల చేతిలో గాయపడిన బాధితురాలు లక్ష్మీ శనివారం ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. ఆమె కుటుంబంకు ఆర్థిక సహాయం చేయాలని ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు గిరిజన మహిళలపై దాడిచేయడం అమానుషమని ఆమె పేర్కొన్నారు. స్వతంత్రదినోత్సవం రోజునే ఇది జరగడం బాధకరమని ఆమె అన్నారు. పోలీసులు బంధించడం వల్ల ఆమె కోల్పోయిన డబ్బులు కూడా ఆమెకు ఇవ్వాలి. ఆమె కూతురు బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. లక్ష్మీకి రక్షణ కల్పించాలి. ఆమెకు న్యాయం చేయాలన్నారు.

# రాహుల్‌గాంధీతోనే నా ప్రయాణం

### తప్పుడు ప్రచారాలు కాంగ్రెస్‌లో టిడిపి కల్చర్ : సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 19,ప్రభాతవార్త:** నా రాజకీయ ప్రయాణం కాంగ్రెస్ అది నాయకుడు రాహుల్‌గాంధీతోనే తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తనపై తప్పుడు వార్తలు రాస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. సామాజిక మాద్యమాల్లో తనపై దుష్ప్రచారం జరుగుతోందని ఈ సాంప్రదాయం బాగోలేదని ఆయన ఆవేదన చెందారు. శనివారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో జగ్గారెడ్డి ఉండద్దా? ఇది ఎవరిదైనా వ్యూహమా? జగ్గారెడ్డి కాంగ్రెస్‌ల ఉండద్దని ఎవరు ప్రచారం చేస్తున్నారు. మా క్యారెక్టర్‌ను ఎందుకు తప్పుగా ప్రచారం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. జగ్గారెడ్డి పార్టీనుంచి పోతుండని ప్రచారం చేసి మీడియాలో పెట్టడానికి ఎవరు డబ్బులు ఇస్తున్నారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. నేను వీటికి సంజాయిషీ చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఆధారాలు లేకుండా సోషల్ మీడియాలో మాట్లాడితే నడిరోడ్డు మీద బట్టలు ఇప్పి నిలబెడుతా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇపుడున్న లీడర్లలో సోషల్ మీడియా ఎక్స్పర్ట్ ఎవరు ఇదంతా టిడిపి కల్చర్. ఇదంతా టిడిపి నుంచి వచ్చిందే. మా పార్టీలోకి ఏ పార్టీవాళ్ళు వచ్చినా కాంగ్రెస్‌వాళ్ళే . ఈ రోజు పిసిసి సమావేశం అది డైరెక్షన్ మీటింగ్ నేను పిఏసి, పిఈసి సమావేశాకు అటెండ్ అవుతున్నా. నామీద అబద్దపు ప్రచారం చేసే మూర్ఖులు దద్దమ్మలు వీటిని బంద్ చేయాలి. 19 సంవత్సరాలకే నేను మునిసిపల్ లీడర్‌ను అయ్యాను. జగ్గారెడ్డి పేరు తగ్గించాలని వార్తలు వేస్తే డ్యామేజి జరుగుతుందని చూస్తున్నారు. బిఆర్‌ఎస్‌లోకి రావద్దని సంగారెడ్డిలో నిరసన తెలుపుతున్న వారంతా నా దగ్గర నుంచి పోయినోళ్లే వాళ్ళను లీడర్‌లుగా మలిచింది నేనే. ముఖ్యమంత్రిని మంత్రులను కలవద్దా వినతి పత్రాలు ఇచ్చి ఫండ్స్ అడుగద్దా ఇదేం సాంప్రదాయం అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీతో సంగారెడ్డికి కార్యక్రమం పెట్టి ఆహ్వానిస్తాను. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం అని 50 సీట్లలో బలమైన అభ్యర్థులు వున్నారని ఆయన తెలిపారు. 30 సీట్లలో సెండ్ పొజిషన్‌లో వున్నామని గట్టి ప్రయత్నం చేస్తే మొదటి స్థానంకు చేరుకోవచ్చని ఆయన అన్నారు.ఒక్కసారి కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని ఆయన కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ బి ఆర్ ఎస్ రెండు మాత్రమే వున్నాయి.ఒకపుడు హరీశ్‌రావు కూడా బి ఫారమ్ అమ్ముకొన్నారని అన్నారు.



సంగీత నృత్యోత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న రమణాచారి, విజయకుమార్, వసుంధర, సుధామాల తదితరులు

# ప్రతిష్టాత్మకంగా 48వ అఖిలభారత సంగీత నృత్య వారోత్సవాలు

### ప్రభుత్వ సలహాదారు కెవి.రమణాచారి

**హైదరాబాద్ (నాంపల్లి), ఆగస్టు 19, ప్రభాతవార్త :** 1958లో ప్రముఖులు వేమరాజు నరసింహారావు చేత ప్రారంభింపబడి వారి పిదప వేమరాజు విజయకుమార్ గత ఆరున్నర దశాబ్దాలుగా ఆయన ఆశయాలను ప్రతిఫలించేరీతిలో కార్యక్రమాలను చేపడుతుండడం అభినందించదగ్గ విషయమని, జాతీయ సమైక్యతను కాపాడుతూ అచల భారత స్థాయిలో సంగీత నృత్య పోటీలు-ప్రదర్శనలు నిర్వహిస్తూ గొప్ప చరిత్ర సృష్టించిన నవ్యనాటక సమితి, ఈ నెల 26 శనివారం నుండి సెప్టెంబరు 2 శనివారం వరకు ప్రతిష్టాత్మకంగా 48వ అచల భారత సంగీత నృత్య పోటీల వారోత్సవాలను నిర్వహిస్తుందని శనివారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి తెలిపారు. ఈ సందర్భంగా డా. కె.వి.రమణాచారి నవ్యనాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, జి.వసుంధర, సుధామాల తదితరులతో కలిసి సంగీత నృత్యోత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించి ప్రసంగిస్తూ 8రోజులపాటు 3 విభాగాలుగా సంగీతంలో కర్ణాటక, హిందూస్థానీ; నృత్యాల్లో భరతనాట్యం, కూచిపూడి, ఆంధ్రనాట్యం, కథక్‌లలో జరిగే ఈ సంగీత నృత్య పోటీలకుగాను జాతీయస్థాయిలో 4వందలకుపైగా దరఖాస్తులు రావడం ఒక రికార్డ్ అని, అకిల భారత స్థాయిలో ఉభయ తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలతోపాటు న్యూఢిల్లీ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, చత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుండి కళాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ ఉత్సవాలు ఈ నెల 26న ఉదయం 10గంటలకు తిలక్‌రోడ్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవుల పల్లి రామానుజరావు కళామందిరంలో ప్రఖ్యాత కూచిపూడి నృత్యకళాకారిణి, పద్మభూషణ్ డా. స్వప్నసుందరి (న్యూఢిల్లీ) ప్రారంభి స్తారని, నృత్య కార్యక్రమాలు ఇక్కడ, సంగీత కార్యక్రమాలు సుల్తాన్‌బజార్, కోఠిలోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలో జరుగుతాయని వివరించారు. సెప్టెంబరు 2 రవీంద్రభారతిలో 48వ అఖిల భారత సంగీత నృత్యోత్సవాల ముగింపు సమావేశాలు జరుగుతాయని డా. కె.వి.రమణాచారి తెలిపారు.

# హకీంపేట స్పోర్ట్సు స్కూల్ గేట్ వద్ద విద్యార్థుల ఆందోళన

- లైంగిక వేధింపులపై త్వరగా నిజానిజాలు నిగ్గు తేల్చాలి
- బయటకు వెళ్లటానికి యత్నించిన విద్యార్థులను అడ్డుకున్న పోలీసులు
- గంటల తరబడి లోపలే బైఠాయించిన విద్యార్థులు



హకీంపేట తెలంగాణ స్పోర్ట్సు స్కూల్ మెయిన్‌గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులను బయటకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

**శామీర్‌పేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్సు స్కూల్ మెయిన్ గేట్ వద్ద ఆ స్కూల్ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కొంత సేపు ఆ స్కూల్ ప్రాంగణం వద్ద ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. విద్యార్థులను రాజీవ్‌రహదారి వద్దకు వెళ్లకుండానే ముందస్తుగా స్పందించి పోలీసులు అడ్డుకుని వారిని గేట్‌లోపలికి పంపటంతో కొంత వరకు పరిస్థితి అదుపులోకి వచ్చింది. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్సు స్కూల్ విద్యార్థులు ఒకేసారి మూకుమ్మడిగా విద్యార్థులు స్కూల్ నుంచి బయటకు విచ్చేసి మెయిర్‌గేట్‌కు చేరుకుని గేట్‌ను తోసేసి రాజీవ్‌రహదారిన బైఠాయించే ప్రయత్నం చేయగ గేట్ బయటనే వెంటనే పోలీసులు చేరుకుని అడ్డుకున్నారు. పోలీసులు అడ్డుకుని గేట్‌లోపలికి వారిని పంపటంతో గేట్‌లోపల విద్యార్థులు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్సు స్కూల్‌లో విద్యార్థిని లైంగిక వేధింపుల విషయంపై ఓఎస్‌డి హరికృష్ణపై ఆరోపణలు రావటం, ఆ వెంటనే ప్రభుత్వం స్పందించి ఆయనను సస్పెండ్ చేసి విచారణకు కమిటీ వేసిన సంగతి తెలిసిందే. అయితే విచారణ కమిటీ విచారణలు జరపటంలో కాలయాపన చేస్తుందని, దీంతో హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్సు స్కూల్‌కు, విద్యార్థులకు చెడ్డ పేరు వస్తుందని, వాస్తవంగ సస్పెండ్‌కు గురైన ఓఎస్‌డి హరికృష్ణ ఎలాంటి వేధింపులకు పాల్పడలేదని, కక్షపూరితంగ ఆయనపై ఆరోపణలు చేశారని, మాసార్ మాకు కావాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. విద్యార్థుల పేరెంట్స్ కూడ నియమితులైన విచారణ కమిటీ వెంటనే స్పందించి విచారణ జరిపి అసలైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఓఎస్‌డిపై ఆరోపణలు చేసిన వారిని విచారించి వెంటనే అసలు నిజాలు, వాస్తవాలు తేల్చాలని, విచారణను వేగవంతం చేయాలని విద్యార్థులు, పలువురు పేరెంట్స్‌కూడ డిమాండ్ చేశారు. అయితే విచారణ చేయటంలో నిర్లక్ష్యం జరుగుతుందని, స్పోర్ట్సు స్కూల్ పేరు, విద్యార్థులకు మచ్చ ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, విచారణలో కాలయాపన చేయవద్దని, హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్సు స్కూల్‌పై నమ్మకం పోతుందని, అంతర్జాతీయ, జాతీయ,రాష్ట్ర స్థాయిలలో మంచి పేరు గుర్తింపు ఉన్న ఈ స్కూల్‌ను కాపాడుకోవటానికి ప్రభుత్వం వెంటనే విచారణ పూర్తి చేసి నివేధికను సమర్పించి విద్యార్థులకు, పేరెంట్స్‌కు న్యాయం చేయాలని కోరారు. అయితే ప్రస్తుత విధులు నిర్వహిస్తున్న ఆ స్కూల్ ఓఎస్‌డి సుధాకర్‌ను కలిసి మాట్లాడటం జరిగిందని, ఈ విషయంపై ప్రభుత్వం విచారణకు కమిటీ వేసిందని విచారణ చేపడుతుందన్నారు. ఓఎస్‌డిగా ఉన్న హరికృష్ణను సస్పెండ్ చేస్తే తనను ఈ స్కూల్ ఓఎస్‌డిగా పనిచేయటం జరుగుతుందని సుధాకర్ పేర్కొంటున్నారని, విచారణను త్వరగా పూర్తి చేసేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరటం జరిగిందని విద్యార్థుల పేరెంట్స్ పేర్కొన్నారు. తాను ప్రభుత్వం నియమిస్తే ఓఎస్‌డిగా రావటం జరిగిందని, కమిటీ విచారణ జరుపుతుందని ఆయన అంటున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థుల కొందరు పేరెంట్స్ ఓఎస్‌డితో మాట్లాడుతున్న సమయంలో విద్యార్థులంత మూకుమ్మడిగా స్కూల్ బయటకు విచ్చేసి నిరసనలకు దిగారు. ప్రభుత్వం స్పందించాలని విచారణకు పూర్తి చేయించాలని వారు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు వెంటనే రంగంలోకి దిగి విద్యార్థులను అడ్డుకుని గేట్‌లోపలికి తిరిగి పంపించారు. కొంత సేపు ఆ స్కూల్ గేట్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.

# గాంధీభవన్‌లో ఆదివాసీ ధర్నా

### సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

**హైదరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** హైదరాబాద్ ఎల్బీనగర్‌లో ఆగస్టు 15 అర్ధరాత్రి గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి అటేంప్ట్ మర్డర్,నిర్భయ కేసు నమోదు చేసి శిక్షించాలని ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్రవైస్ చైర్మన్ భరత్ చౌహాన్, ధన్‌రాజ్, శివరాథోడ్, బల్లు, చవాన్ లక్ష్మీలు డిమాండ్ చేశారు. శనివారం గాంధీభవన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్ఠబొమ్మను దగ్ధం చేశారు. బాధితురాలు లక్ష్మీకి రూ. 25లక్షల నష్టపరహారం డబుల్ బెడ్ ఇల్లు, ఇంట్లో ఒకరికి జీవనోపాధి ప్రభుత్వం కలిపించాలని వారు డిమాండ్ చేశారు. ఎల్‌బినగర్ పోలీసుస్టేషన్‌లో మహిళను అర్ధరాత్రి వుంచడమే కాకుండా మూడు గంటలు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని వారు ఆవేదనచెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీ బాధ వర్ణనాతీతం అని వారు పేర్కొన్నారు.

## బాల్య వివాహనికి సహకరించిన వారి రిమాండ్

**మెదక్, చిన్నశంకరంపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా చిన్న శంక రంపేట మండలం జంగరాయి తండాకు చెందిన బాలికను అదే తండాకు చెందిన మాలోత్ మోహన్ నాలుగు రోజుల క్రితం వివాహం చేసుకున్నాడు. బాలిక తండ్రి ఫిర్యాదు చేయగా స్థానిక ఎస్ఐ నారాయణ గౌడ్ విచారణ చేపట్టారు. ఈ మేరకు మాలోత్ మోహన్‌తో పాటు వివాహనికి సహకరించిన మాలోత్ బిక్యా,మాలోత్ శాంతి, మాలోత్ బుజ్జిలను అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి శనివారం తెలిపారు. ఎవరైన బాల్య చేపట్టినా, వారికి సహకరించినా చట్టపరమైన చర్యలు తిసుకుంటామని తెలిపారు.



# బూజు రాకుండా జాగ్రత్తలు

**వర్షా కాలంలో తడిదనం, గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల వంటింట్లో ఉండే కొన్ని రకాల పదార్థాలు, స్నాక్స్, వంటివి బూజు పడుతుంటాయి. ఇలా జరగకూడదంటే వాటిని నిల్వ చేసే విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం .**

◆ బయటి నుంచి కొని తెచ్చుకున్న స్నాక్స్ చాలా వరకు ప్యాకెట్లలో నిల్వ చేస్తారు. అయితే వీటిని ఒక్కసారి తెరిచాక. వాటిని అలాగే వదిలేస్తే.. అవి మెత్తగా అయిపోతాయి. కొన్ని కొన్ని స్నాక్ ఐటమ్స్ బూజు పడతాయి కూడా! కాబట్టి స్నాక్స్ ఇంట్లో చేసినా, బయటి నుంచి తెచ్చుకున్నా గాలి చొరబడని గాజు జార్లలో నిల్వ చేయడం మంచిది. ◆ వంటింట్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండడం, తడిదనం వల్ల ఆ వాతావరణం ఎప్పుడూ తేమగా ఉంటుంది. తద్వారా క్రిములు, ఫంగస్.. వంటివి వృద్ధి చెందే ప్రమాదం ఉంది. కాబట్టి నిల్వ చేసే పదార్థాలు, నిత్యావసర సరుకుల్ని తేమ లేని చోట భద్రపరచాలి. అలాగే తేమ చేరకుండా మధ్యమధ్యలో, కప్‌బోర్డ్ మూలల్లో సిలికాజెల్ ప్యాకెట్లను ఉంచాలి.

◆ తేమకు ఉప్పు, చక్కెర.. వంటివి గడ్డ కడతాయి. కాబట్టి ఈ రెండూ కలగలిసిన స్నాక్స్‌ని ఒకే బార్‌లో నిల్వ చేయ కుండా విడి విడిగా భద్రపరచడం వల్ల రుచి కోల్పో కుండా, మెత్తబడకుండా జాగ్రత్త పడచ్చు.

◆ పప్పులు, ధాన్యాలు, మసాలాలు, వంటి ఫుడ్ ఐటమ్స్‌ని ఇంటికి తెచ్చాక బాగా ఆరబెట్టి లేదంటే ఎండలో పెట్టి నిల్వ చేయడం కొంతమందికి అలవాటు ! అయితే ఈ సీజన్‌లో వాతావరణంలోని తమ ఆ పదార్థాలు పైకి చేరి అవి మరింత మెత్తబడే అవకాశం ఉంటుంది. ఫలితంగా అవి త్వరలో పాడవుతాయి. కాబట్టి దీనికి ప్రత్యామ్నా యంగా వాటిని బాగా వేయించడం, ఆవెన్‌లో వేడి చేసి చల్లారాక గాలి చొరబడని గాజు జార్లలో భద్రపరచడం మంచిది.◆ తినగా మిగిలిన చపాతీలు, వేపుళ్లను అల్యూమినియం ఫాయిల్స్‌లో ప్యాక్ చేసి నిల్వ చేయడం వల్ల వాటి రుచి కోల్పోకుండా జాగ్రత్తపడచ్చు. ◆ గోధుమ పిండి, శెనగపిండి.. వంటివి తేమ తగిలితే పాడవుతాయి. కాబట్టి వాటిని గాలి చొరబడని గాజు సీసాలో భద్రపరచి.. అందులో కొన్ని బిరియానీ ఆకుల్ని వేయాలి. తద్వారా ఈ ఆకులు ఏమాత్రం తేమ ఉన్నా పీల్చేసుకుంటాయి. ◆ బియ్యం, గోధుమలు, ఇతర ధాన్యాల్ని కూడా గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ చేయాల్సి ఉంటుంది. అలాగే వాటిలో కొన్ని వేపాకులు వేయడం వల్ల తేమ చేరకుండా ఉండడంతో పాటు పురుగులు పట్టకుండా కాపాడుకోవచ్చు.◆ డ్రైఫ్రూట్స్, నట్స్‌ని గాలి చొరబడని, పొడిగా ఉండే గాజు జార్లలో నిల్వ చేయాలి. ❑

# తరగనిది విద్య, విజ్ఞానాలే..

**ఎంత పంచినా తరిగిపోని విద్య, విజ్ఞానాలే..రాధిక అత్త ఆమెకు పెళ్లైన రోజు నుంచి నూరిపోసిన విషయమిది. ఆ మాటలు ఆమెను ప్రభావితం చేయడమే కాదు. కరమ్ ట్రస్ట్ స్థాపనకు కారణమయ్యాయి. ఇదేం అంత సులువుగా జరగలేదు. ఒక ఘటన దానికి కారణం అంటున్నారు రాధికా భరత్‌రామ్. ఆ ఘటనేంటో అదిఆమె జీవితాన్ని ఎలా మలుపు తిప్పిందో తెలుసుకుందాం..**

**కరోనా..** పేరు తలచుకున్నా అప్పటి పరిస్థితులన్నీ కళ్ల ముందు కదులుతుంటాయి. ముఖ్యంగా ఎన్జీఓలు మహమ్మారి కారణంగా కార్పొరేట్ సంస్థలు ఇచ్చే ఫండింగ్ ఆగిపోయి నానా కష్టాలు పడ్డాయి. అనాథ, అంధ, దివ్యాంగులకు సరైన భోజన సదుపాయాలు కూడా కల్పించలేని పరిస్థితినీ ఎదుర్కొన్నాయి. ఆ బాధలే కరమ్ ట్రస్ట్ స్థాపించడానికి కారణం. మాది ఢిల్లీ, వ్యాపారవేత్తల కుటుంబం. దేనికీ లోటూ లేకుండా పెరిగాను. మెట్టినిట్లూ ఆ కోవకు చెందినదే. కానీ మా అత్త కోరిక, ఆశయం పేదవారికీ విద్య చేరాలని. అందుకోసం ఆమె చేయని ప్రయత్నాలు లేవు. ఆమె తర్వాతి తరంగా నేను ఆ బాధ్యతలు చేపట్టాలని కోరుకున్నారు. మొదట 'ఊ'కొట్టినా, అప్పటికి నా చుట్టూ ఉన్న వాతావరణం అందుకు సహకరించలేదు. కానీ సందర్భం వచ్చిన ప్రతిసారి ఆమె ఈ విషయాన్ని ప్రస్తావించేవారు.

శ్రీరామ్ స్కూల్స్‌కి వైస్‌ఛైర్‌పర్సన్‌గా,అనంత అస్పెన్ సెంటర్‌ట్రస్టీగా, సిఐఐ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కో-ఛైర్‌గా పనులతో సతమతమవుతున్న రోజులవి. ఇవి సరిపోవన్నట్టు కాన్సర్ అవగాహనా కార్యక్రమాలు, హస్తకళలను కాపాడే సంస్థలో వాలంటీర్‌ని కూడా. సమాజానికి నావంతు బాధ్యతగా ఇవన్నీ నిర్వహిస్తున్నా చాలనుకున్నాను. కొవిడ్ నా అభిప్రాయాన్ని మార్చింది. ఆ సమయంలో సీఎస్ఆర్ నిధులు ఆగిపోయాయి. అన్నీ కరోనా రిలీఫ్ ఫండ్స్‌కు తరలించారు. ఎన్జీఓలను పట్టించుకునే వారే లేకపోయారు. పరిస్థితులు తెలిసొచ్చాయి. ఈ ఫండ్స్ పేరుతో మా ఆదాయంలో, నా జీతంలో చాలా మొత్తం డొనేషన్లుగా ఇచ్చేవాళ్లం. అదే డబ్బును విద్య, నైపుణ్యాలను అందించడానికి వాడి ఉంటే ఇప్పుడు వీళ్ల పరిస్థితి ఇలా అయ్యుండేది కాదు కదా అనిపించింది.



**ఫెలోషిప్ కోసం....** అత్తగారి మాటలు గుర్తొచ్చాయి. ఎప్పటి నుంచో ఆమె ఏర్పాటు చేయాలనుకుంటున్న ట్రస్ట్ నా భర్త సహాయంతో అప్పుడు చేశాను. పేద, మధ్యతరగతి ఆడపిల్లల్ని చేరదీశాం. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫెలోషిప్ ప్రకటించాం. చదువుకోవాలని ఆసక్తి ఉండి ఆర్థిక కారణాల రీత్యా విద్యకు దూరమైన ఆడపిల్లల్ని చేరదీశాం. 40 మందికిపైగా యువతులు దీనిలో శిక్షణ పొందుతున్నారు.



**ఆ కోవకు చెందినవారే....** ట్రస్ట్ పిల్లల్లో ఒక్కక్కరిది ఒక్కో కథ. వీరిలో సమాజం వెలివేసిన వారు కొందరు. ఆడపిల్లలంటూ నిరాదరణకు గురైనవారు. రోజు కూలీల పిల్లలు, ఖైదీలకు పుట్టారన్న కారణంతో ఆదరణకు నోచుకోని వారు, ఇలాంటి భిన్న సామాజిక నేపథ్యాల వారే ఎక్కువ. వీరందరిని కలిపింది ఒకే విషయం చదువుకోవాలనే కోరిక. ఇలాంటి వారికి సహాపడుతూ ఒక కొత్త తరాన్ని రూపొందిస్తున్నా అన్న సంతృప్తి నాకు దక్కింది. ఈ సేవలు ఇంకా విస్తృతం చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నా. ❑

# తోటపనితో మానసిక ఒత్తిడి దూరం



తోటపని మానసికా రోగ్యాన్ని పెంపొందిస్తుందని ఓ అధ్యయనం తేల్చింది. మొక్కల పెంపకమే అలవాటు లేని వారిని ఎంపిక చేసిమరీ చేపట్టారీ పరిశోధన. దీని వల్ల వీరంతా ఒత్తిడికి దూరమైనట్లు గుర్తించారు. ఫ్లోరిడా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ అధ్యయనంలో ఏం తేలిందంటే.. తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్నవారు. పలు రకాల సవాళ్లను ఎదుర్కొన్న వారిపై చేసిన ఈ అధ్యయనంలో తోటపనితో వారిలో ఆందోళన, ఒత్తిడి దూరమయ్యాయని గుర్తించారు. ఈ సారి తోటపనివైపు అసలు కన్నెత్తని 26-49 వయోవర్గం నుంచి కొందరిని ఎంపిక చేశారు. వీరంతా పొగాకు. మత్తుపదార్థాల వినియోగం, ఆందోళన, ఒత్తిడి వంటి వాటికి చికిత్సలు పొందుతున్నారు. మానసికపరమైన చికిత్సలు అందుకుంటున్న వీరిని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక గ్రూపును తోటపని నేర్చుకోవడానికి, మిగతా వారిని ఆర్ట్‌లో శిక్షణకు కేటాయించారు. ఈ శిక్షణా తరగతుల్లో వీరందరినీ కొత్త ఆలోచనలను చెప్పడం, సృజనాత్మకతను ప్రదర్శించడం నుంచి ప్రణాళికాబద్ధంగా పని చేసేలా ప్రోత్సహించారు. వారానికి రెండుసార్లుగా, నాలుగు వారాల పాటు ఈ మహిళలందరూ తరగతులకు హాజరయ్యారు వీరి ప్రవర్తనను కూలంకషంగా పరిశీలించడమే కాకుండా వైద్య పరీక్షల ఆధారం గా కూడా వీరి మానసికస్థితిని అంచనా వేశారు.

**తగ్గింది..** తోటపనిలో ఉన్నవారు ఆయా మొక్క బట్టి పెంచే విధానం, విత్తనాలు నాటడం, రెండు రకాల మొక్కలను అంటుకట్టడం, తినదగ్గ మొక్కలను రుచి చూడటం వంటివాటిలో ఉత్సాహంగా కనిపించారు. ఆసక్తి ఉన్న మహిళలు పేపర్, ప్రింట్ మేకింగ్, చిత్రలేఖనం వంటి కళల్లో నైపుణ్యాల ను నేర్చుకున్నారు.శిక్షణ ముగిసిన తర్వాత వీరందరిలో ఆందోళన, కుంగుబాటు, ఒత్తిడి, మానసిక స్థితిని పరిశీలించగా, ఇందులో కళలను సాధన చేసిన వారి కన్నా తోట పని చేసిన వారిలో ఒత్తిడి, ఆందోళన వంటివి బాగా తగ్గినట్టు గుర్తించారు. తోటపనిలో మానసికారోగ్యం పెంపొందుతుందని, దీన్నే 'థెరప్యూటిక్ హార్టికల్చర్'గా 19వ శతాబ్దం నుంచి పిలుస్తున్నారని అధ్యయనవేత్తలు చెబుతున్నారు. అంతేకాదు. ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొన్న వారంతా ఇకపై తాము తోట పెంపకాన్ని ప్రారంభించన్నూమని, దీన్నే తమ మనసుకు చికిత్సగా భావిస్తామని చెప్పడం విశేషం. ❑

## చెలి చిట్కా

ఇంగువను శుభ్రమైన వస్త్రంలో మూటకట్టి.. వడియాల డబ్బాలో వేయాలి. ఇలా చేస్తే వేయించినప్పుడు అవి మంచి వాసన వస్తాయి.

# కాకర రుచులు



ముదురాకుపచ్చ రంగులో నొక్కులు నొక్కులుగా ఉండే కాకరకాయని చూస్తేనే ముచ్చటేస్తుంది కదూ! చేదుగా ఉంటుందని కొందరు నాలుక చప్పరిస్తారు కానీ నిజానాకి కాకరతో ఘుమఘుమలాడే వంటలు చేసి మనసులు దోచుకోవచ్చు. ఆ రుచీ పరిమళాలూ ఎంత ఆమోఘంగా ఉంటాయంటే.. మనకు తెలియకుండానే నాలుగు ముద్దలు ఎక్కువ తినేస్తాం. చిన్న చిట్కాలు పాటిస్తే సరి. చేదంతా విరిగిపోయి కమ్మటి రుచి వస్తుంది మరి. నోరూరించే కూర, మది దోచే ఇగురు, పసందైన స్వీటు, ఇడ్లీ దోశల్లోకి కారం, ఇవన్నీ కాకరకాయలతో అద్భుతంగా చేయొచ్చు. వీటిని ప్రయత్నించారంటే ఇంకా ఇంకా కావాలని అడిగి మరీ తినేస్తారు చూడండి. కాకర రుచికరమే కాదు ఆరోగ్యపరంగా ఔషధం కూడా.

## కాకర కారం



కావలసిన పదార్థాలు : కాకరకాయలు-అరకిలో, ఉప్పు-తగినంత, మినపప్పు, శనగపప్పు, ధనియాలు-2 చెంచాలు చొప్పున, జీలకర్ర, నువ్వులు-చెంచా చొప్పున, చింతపండు నిమ్మకాయంత, వెల్లుల్లి రెబ్బలు-8, కరివేపాకు-నాలుగు రెబ్బలు మిరపకాయలు-20, నూనె-2 గరిటెలు.

**తయారీ :** కాకర కాయలను కడిగి, తడి లేకుండా తుడిచి, తొడిమలు తీసి తురమాలి. అందులో ఉప్పువేసి కాసేపు పక్కనపెడితే నీరు దిగుతుంది. బాణలిలో గరిటెడు నూనె వేసి పచ్చి శనగపప్పును సన్నసెగ మీద వేయించాలి. కాస్త వేగిన తర్వాత మినపప్పు. అది రైడా వూగార ధనియాలు వేయాలి. మూడూ వేగాక జీలకర్ర, చింతపండు, వెల్లుల్లి రెబ్బలు వేసి వేయించాలి. తర్వాత నువ్వులు, కరిపేపాకు, మిరపకాయలు వేసి కొన్ని క్షణాలు వేగనిచ్చి, ఈ దినుసులన్నీ ఒక పాత్రలోకి తీసి చల్లారనివ్వాలి. అదే బాణలిలో నూనె వేసి నీళ్ల లేకుండా తీసిన కాకరకాయ తురుమును పావుగంట సేపు చెమ్మంతా పోయి పొడిపొడిలాడేలా చక్కగా వేయించి దించాలి. దినుసులన్నీ జార్‌లో వేసి గ్రైండ్ చేసి అందులో ఉప్పు, వేయించిన కాకర తురుము కలిపితే సరి.. ఘుమఘుమలాడే కాకరకాయ కారం సిద్ధం. ఇడ్లీ, అట్టు, అన్నం.. ఎందులోకైనా బాగుంటుంది.

## కాకర పచ్చడి..



కావలసిన పదార్థాలు : కాకర కాయలు- అరకిలో, ఇంగువ, కొద్దిగా, జీకలర్ర, మెంతులు, ఆవాలు-2 చెంచాల చొప్పున, ఉప్పు, కారం-3 స్పూన్ల చొప్పున, పసుపు-చెంచా, నిమ్మకాయలు-2, ఆవనూనె- కప్పు.

**తయారీ :** పొట్టిగా వెడల్పుగా ఉండే వాటికి బదులు పొడుగ్గా సన్నగా ఉండే తాజా కాకరకాయలను ఎంచి తెచ్చుకోవాలి. బాగా కడిగి తడి లేకుండా ఆరబెట్టాలి. మొదలు, చివర తీసేసి గుండ్రటి ముక్కలుగా తరిగి, పొడి పాత్రలో వేసి చెంచా ఉప్పు వేయాలి. కాసేపటికి అందులోంచి నీళ్లు దిగుతాయి. ఆ నీటిని తీసేసి, ఐదు నిమిషాలు ఉడకబెట్టాలి. నీళ్లలోంచి ముక్కలను తీసి రెండు మూడు గంటలు ఎండలో శుభ్రమైన వస్త్రం మీద ఆరబెట్టాలి. జీలకర్ర, మెంతులు, ఆవాలు, ఇంగువలను గోధుమ రంగు వచ్చేవరకూ వేయించి పొడి చేసుకోవాలి. ఎండిన ముక్కలను తడి లేని జాడీలో వేసి, గ్రైండ్ చేసిన పొడి, ఉప్పు, కారం, పసుపు, నిమ్మరసం వేసి కలిపి మూత పెట్టాలి. మూడో రోజున మూత తీసి కలిపితే పచ్చడి సిద్ధమైపోతుంది. ఇది దోశలు, అన్నం ఎందులోకైనా రుచిగా ఉంటుంది.

## వేపుడు



**కావలసిన పదార్థాలు:** కాకర కాయలు-పావుకిలో, నూనె, ఒకటిన్నర టేబుల్ స్పూన్, ఉప్పు, కారం, తగినంత, కొబ్బరికోరు- చెంచాలు, పసుపు-పావు చెంచా, కరివేపాకు-2 రెబ్బలు, పంచదార-2 చెంచాలు, ధనియాల పొడి-చెంచా, నెయ్యి-చెంచా, తాలింపుకోసం- ఆవాలు, మినప్పప్పు-జీలకర్ర, ఇంగువ.

**తయారీ :** బాణలిలోనూనె వేసి తాలింపు దినుసులు, వెల్లుల్లి వేగిన తర్వాత కరివేపాకు, ఇంగువ వేసి తరిగిన కాకరకాయ ముక్కలు వేయాలి. కాస్త వేగిన తర్వాత ఉప్పు, పసుపు వేసి తిప్పి మూత పెట్టి సన్నటి సెగ మీద మగ్గనివ్వాలి. ధనియాల పొడి, కారం పంచదార వేసి అడుగంటకుండా మధ్యలో కలియ తిప్పుతుండాలి. చివర్లో కొబ్బరికోరు వేసికాస్త వేయించి నెయ్యి వేసి దించేస్తే సరి. ఘుమ ఘుమలాడే కాకరకాయ వేపుడు సిద్ధం.

## కాకర స్వీట్ ..



**కావాలసిన పదార్థాలు :** కాకరకాయలు-పావుకిలో, నెయ్యి-4 చెంచాలు, పంచదార- కప్పు, కోవా-100 గ్రాములు, ఇలాచీ పొడి-పావుస్పూన్, జీడిపప్పు-15, కొబ్బరిపాలు- కప్పు.

**తయారీ :** కాకరకాయల్లో గింజలను తీసేసి బరకగా గ్రైండ్‌చేసి బౌల్‌లోకి తీసుకోవాలి. పాన్‌లో నెయ్యివేసికరిగాక జీడిపప్పు వేయించి పక్కకు తీసిపెట్టుకోవాలి. అందులోనే కాకర తురుము వేసి 8 నిమిషాలు వేయించాలి. తర్వాత పంచదార, ఇలాచీ పొడి, తురిమిన కోవా వేసికొద్దిసేపు కొబ్బరిపాలు, వేయించిన జీడిపప్పు వేసి రెండు నిమిషాలు సన్న సెగ మీద మగ్గనిస్తే సరి.. తీయని కాకరకాయ స్వీట్ సిద్ధం.

## కాకర టొమాటోతో పులుసు..

**కావలసిన పదార్థాలు :** కాకరకాయలు-పావుకిలో, టొమాటోలు-పావు, ఉల్లిపాయలు-2, నూనె-ఒకటిన్నర టేబుల్ స్పూన్, ఉప్పు, కారం। తగినంత, నువ్వులపొడి।4 చెంచాలు, పసుపు-పావు చెంచా, చింతపండు-కొద్దిగా, కరివేపాకు-2 రెబ్బలు।తాలింపుకోసం-ఆవాలు, మినపప్పు, జీలకర్ర, ఇంగువ.

**తయారీ :** కాకరకాయలు కాస్త పెద్ద ముక్కలుగా కోసి కొద్దిగా రాళ్ల ఉప్పు, కాస్త పసుపు, చింతపండు వేసి నాలుగు నిమిషాల పాటు ఉడికిస్తే చేదు విరుగుతుంది. ఆ నీళ్ల పారబోసి చింతపండు రెబ్బలు తీసేయాలి. మూకట్లో తాలింపు వేసి ఉల్లిపాయ ముక్కలు దొరగా వేగాక.. టొమాటో ముక్కలు వేయాలి. అవి కాస్త మగ్గిన తర్వాత కాకరకాయ ముక్కలు వేసి కొంతసేపు వేగనివ్వాలి. కొంచెం ఎసరు వేసి మరికాసేపు సన్నసెగలో ఉంచి నువ్వులపొడి, ఉప్పు, కారం వేసి నిమిషం తర్వాత దించేస్తే సరిపోతుంది. ❑



# నటించే భక్తిజీవితం వద్దు..

అంతర్వాణి

'ఇప్పుడు **నేను** మనుష్యుల దయను సంపాదించుకొన జూచుచున్నానా దేవుని దయను సంపాదించుకొన చూచుచున్నానా? నేను మనుష్యులను సంతోషపెట్టగోరుచున్నానా? నేనిప్పటికిని మనుష్యులను సంతోష పెట్టువాడనైతే క్రీస్తుదాసుడను కాకయేపోవుదును' (గలతీ 1:10). ఇది అపొస్తలుడైన పౌలు సాక్ష్యం. నిజమే మనం ఏదీ చేస్తున్నా దేవుడు చూస్తున్నాడు అనే స్పృహతో చేయాలి. కానీ చాలాసార్లు ఈ విషయంలో తప్పి పోతుంటాం. ఆఫీసుల్లో పని చేస్తున్నప్పుడు దేవుడు చూస్తున్నాడు అనేవిధానంలో కాక, మన పైఅధికారులు చూస్తున్నారని భావిస్తూ నటించేలా పని చేస్తుంటాం. వారు ఉన్నప్పుడు ఒకవిధంగా లేనప్పుడు మరోవిధంగా ఉంటాం. అలాగే ఇంట్లో, సంఘాల్లో కూడా ఇలాగే చేస్తుంటాం. ఒకవిధంగా చెప్పాలంటే విశ్వాసుల్లో అసలైన జీవితం ఒకలా ఉంటుంది, రహస్యమైన జీవితం మరోలా ఉంటుంది. ఆదివారం మన ప్రవర్తన ఒకలా ఉంటే సోమవారం నుంచి శనివారం వరకు మరోలా ఉంటుంది. దేవుడిని సంతోషపెట్టేందుకు బదులుగా అధికారులను, సేవకులను, తోటివిశ్వాసులను, ఇంట్లో వారిని సంతోషపెట్టేందుకు అనేక విషయాల్లో రాజీధోరణితో జీవిస్తుంటాం. కానీ పౌలు చెప్పుకున్నట్లుగా కొందరు విశ్వాసులు, సేవకులు మాత్రమే చెప్పుకోగలరు. తాము దేవుడిని సంతోషపెడుతున్నామని, మనుష్యులను కాదని, అవును మన రహస్యజీవితం ఏ విధంగా ఉంటుందో అది ముఖ్యం. మనం ఒంటరిగా ఉన్నప్పుడు మన ఆలోచనలు ఏవిధంగా ఉంటాయి, సెల్‌ఫోన్లు, టీవీల్లో వేటిని చూస్తున్నాం అనేవి చాలాముఖ్యం. 'నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును నాకు తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సు గ్రహించుచున్నావు. నా నడకను నా పడకను నీవు పరిశీలన చేసియున్నావు, నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలిసికొనియున్నావు' (కీర్తన 139:2,3). అందుకే ప్రతిరోజు మనకు దేవుడి వాక్యాన్ని చదువుకునే అలవాటు ఉండాలి. అప్పుడే మనం చేస్తున్న తప్పులను దేవుడి వాక్యం ద్వారా గద్దించబడి, సరిచేసుకుని, క్షమాపణ వేడుకుని, దేవుడి సహవాసంలో అన్యోన్నంగా ముందుకు సాగిపోగలం. ప్రార్థన, పరిశుద్ధులతో సహవాసం తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే మన అనుదిన జీవితంలో చేస్తున్న పొరపాట్లను సరిచూసుకుంటూ, సరిచేసుకుంటూ ఉండగలం. పరిశుద్ధంగా జీవించగలం. ఒక్కొక్క సంవత్సరం గడిచేకొద్ది దేవుడి నీతి, పరిశుద్ధత, విశ్వాసంలో బలపడుతూ ముందుకు సాగిపోగలం. కాబట్టి మన గురి ఎప్పుడూ దేవుడిని సంతోషపెట్టేలా ఉండాలి. మనుష్యులు ఏం అనుకున్నా పర్వాలేదు, కానీ దేవుడి ఎదుట మన జీవితం సరిగ్గా ఉంటే చాలు అనుకునే ధోరణిలో ముందుకు సాగిపోదాం.



-పి.వాణిపుష్ప

# స్వీట్ తినాలనిపిస్తే?

ఒత్తిడి, అలసట, నిద్రలేమి.. తీపి తినాలనిపించటానికి ప్రధాన కారణాలు. శక్తి తగ్గినప్పుడు శరీరానికి తక్షణ శక్తి అందించటం కోసం తీపి మీదకు మనసు మళ్లుతుంది. ఈ ఫీలింగ్ రాగానే తీపి పదార్థాలు కోసం వెతకండి. ఒకసారి తీపి తినటం మొదలుపెడితే అది అలాగే అలవాటు అవుతుంది. కాబట్టి స్వీట్ల జోలికి వెళ్లకుండా మూల కారణాల్ని సరిదిద్దటం మీద మనసు పెట్టండి.

◗ స్వీట్ల మీద ఇష్టం పెరగటానికి వ్యాయామం లేకపోవటం మరో కారణం. శరీరం చురుగ్గా లేనప్పుడు బద్ధకం చేయడం తప్పని సరి. ◗ షుగర్ క్రేవింగ్‌కు డీహైడ్రేషన్ మరో కారణం. శరీరంలో నీటి శాతం తగ్గినప్పుడు చక్కెర పదార్థాలు తినాలని పిస్తుంది. ఈ కోరిక కలగకూడదంటే వెంటనే నీళ్లు తాగాలి. ❑



## ఫ్యాన్స్‌కు పండుగే!

బ్యూటీక్వీన్ కియారా అద్వానీ...తెలుగులో 'భరత్ అనే నేను' , వినయ విధేయ రామ చిత్రాల్లో నటించి అందరి మెప్పి పొందింది.. ప్రస్తుతం రామ్‌చరణ్ సరసన గేమ్ ఛేంజర్‌లో నటిస్తోంది. హీరోయిన్‌గా బిజీగా ఉన్న తరుణంలోనే ఆమె వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రియుడు బాలీవుడ్ స్టార్ సిద్ధార్థ్ మల్హోత్రాను ఈ ఏడాది ఫిబ్రవరిలో పెళ్లాడింది.. కాగా పెళ్లయిన వెంటనే ఇద్దరూ షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. విశేషం ఏంటంటే వీరిద్దరూ కలిసి మీడియా ఎదుట ప్రత్యక్షమయ్యారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొనటం కెమెరా ముందు కలిసి కన్పించటం అభిమానులకు పండుగే అయ్యింది. వీరి ఫొటోలో ఇపుడు వైరల్ అవుతున్నాయి..

# జెంటిల్‌మన్-2 ప్రారంభం

## 'ఆస్కార్' విజేత ఎంఎం కీరవాణికి సత్కారం

మెగాప్రొడ్యూసర్ కెటి కుంజుమోహన్ జెంటిల్‌మన్-2 సినిమా లాంచింగ్ ఈవెంట్, ఆస్కార్ విజేత సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి సన్మాన కార్యక్రమం చెన్నైలోని ఎగ్మోర్‌లోని రాజా ముత్తయ్య హాల్‌లో ఘనంగా జరిగింది. సినీ పరిశ్రమకు చెందిన లీడింగ్ ఫిల్మ్ మేకర్స్, నిర్మాతలు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. సమాచార, ప్రసార, మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, మంత్రిత్వ శాఖ రాష్ట్ర మంత్రి ఎల్ మురుగన్, జపాన్ కాన్సులేట్ జనరల్ శ్రీ టాగా మసయుకి, పీపుల్ ఆఫ్ రిపబ్లిక్ ఆఫ్ బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ డిప్యూటీ హెడ్ ఆఫ్ మిషన్ ఎండి అరిపుర్ రెహమాన్, సౌత్ ఇండియన్ ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడు రవి కొట్టారా కారా, ఐరిస్ కుంజుమోహన్ జ్యోతి ప్రజ్వలన చేశారు. జెంటిల్‌మన్2 చిత్రాన్ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. అనంతరం ఆస్కార్ విజేత సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణిని చిత్రబృందం, తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఘనంగా సత్కరించారు.



# ఫుల్ మూన్ మీడియా 'సౌండ్ పార్టీ' టీజర్

బిగ్‌బాస్ తెలుగు 5 టైటిల్ విన్నర్ వీజే సన్నీ హీరోగా, ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం1గా రూపొందుతున్న చిత్రం సౌండ్ పార్టీ.. హ్రితిక శ్రీనివాస్ హీరోయిన్, రవి పోలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీశ్యామ్ గజేంద్ర, నిర్మాతలు.. జయశంకర్ సమర్పిస్తున్నారు. సంజయ్ శేరి దర్శకత్వం వహిస్తున్నారు. ఈచిత్రం అన్ని పనులు పూర్తిచేసుకుని సెప్టెంబర్‌లో విడుదల కానుంది.. ఈసందర్భంగా శనివారం ప్రసాద్ ల్యాబ్స్‌లో డైరెక్టర్ సంపత్ నంది చేతులమీదుగా టీజర్‌ను విడుదల చేశారు.. సంపత్ నంది మాట్లాడుతూ, నేను కూడ గతంలో కొన్ని చిత్రాలకు సమర్పకుడిగా ఉన్నానని, అదే బాటలో జయశంకర్ ఈచిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. టీజర్ చాలా బాగుందన్నారు. వీజే సన్నీకి ఇదో మంచి సినిమా అవుతుందన్నారు. ఈచిత్రం అందరికీ నచ్చుతుందని, మంచి పేరు తీసుకురావాలని



కోరుకుంటున్నానని అన్నారు. కార్యక్రమంలో నిర్మాత రవి పోలిశెట్టి, సంగీత దర్శకుడు మోహిత్ రెహమానిక్, సమర్పకుడు జయశంకర్, దర్శకుడు సంజయ్ శేరి, నటుడు శివన్నారాయణ, సింగర్ శ్రీరామ్‌చంద్ర, హీరో వీజే సన్నీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ భువన్ సాలూరు తదితరులు మాట్లాడారు.

# ఇది ఒక క్రేజీ ఫిల్మ్: 'బాయ్స్‌హాస్టల్' ట్రైలర్ లాంచ్‌లో అతిథులు

అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్‌బిస్కెట్ ఫిల్మ్స్ కలిసి కన్నడ బ్లాక్‌బస్టర్ హాస్టల్ హుడుగారు బేకగిద్దరేను తెలుగులో బాయ్స్ హాస్టల్ పేరుతో విడుదల చేస్తున్నారు. నితిన్ కృష్ణమూర్తి ఈచిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రజ్వల్ బిపి, మంజునాథ్ నాయక, రాకేష్ రాజ్‌కుమార్, శ్రీవత్స, తేజస్ తదితరులు నటిస్తున్నారు. ఈచిత్రం ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. నితిన్ కృష్ణ మూర్తి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు



వారం రోజుల్లోనే కన్ఫర్మ్ అయ్యిందన్నారు. షూటింగ్ కూడ అంతే ఫాస్ట్‌గా అయ్యిందన్నారు. యూత్‌కు బాగా కనెక్ట్ అవుతుందన్నారు. కొత్త ప్రతిభను ఆదరించటంలో తెలుగు ప్రేక్షకులు ఎపుడూ ముందు ఉంటారన్నారు.. ఈసినిమాకు పెద్ద విజయం అందిస్తారని కోరకుంటున్నానని అన్నారు. సుప్రియ మాట్లాడూత, చాయ్‌బిస్కెట్ అనురాగ్‌గారు ట్రైలర్‌ను చూపించారని, చాలా ఫన్, ఎనర్జిటిక్‌గా ఉందన్నారు. అపుడే ఈసినిమాను తెలుగులో విడుదల చేయాలని భావించామని అన్నారు. కార్యక్రమంలో శరత్, అనురాగ్‌రెడ్డి, రష్మీగౌతమ్, కార్తీక్ రత్నం, ప్రజ్వల్, ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, విరాజ్ అశ్విన్, ఎస్కేయెన్ తదితరులు మాట్లాడారు.

# హీరో సుహాస్ బర్త్‌డే స్పెషల్



హిట్ చిత్రాలతో మంచి ప్రతిభగల హీరోగా పేరు తెచ్చుకున్నారు సుహాస్.. ఆయన హీరోగా నటిస్తున్న కొత్త సినిమా అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్... ఈచిత్రాన్ని జీఎ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.. యశ్వంత్ కటికినేని దర్శకత్వం వహిస్తున్నారు.. శనివారం సుహాస్ బర్త్‌డే సందర్భంగా ఈ సినిమా నుంచి బర్త్‌డే స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. కామెడీ డ్రామా కథతో తెరకెక్కుతున్న ఈసినిమాలో మ్యారేజ్ బ్యాండ్ లీడర్ మల్లి క్యారెక్టర్‌లో సుహాస్ కన్పించ నున్నారు. చిత్రీకరణ తుదిదశలో ఉంది.. ఈచిత్రం టీజర్‌ను త్వరలో రిలీజ్ చేస్తామని మేకర్స్ తెలిపారు.



## 'చిత్రం' చెప్పిన కబుర్లు

బాలీవుడ్ బ్యూటీ ఆలియాభట్, కరీనాకపూర్ ఒకే ఫ్రేమ్‌లో ఉన్న ఫొటో ఒకటి ఇపుడు సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది.. ఆ ఫొటోని ఉద్దేశించి 'ఇది మరింత మెరుగుపడుతుందా? అని ఆలియాభట్-కరీనా కపూర్‌తో చెవిలో గుసగుస లాడింది.. దీంతో వీళ్ల సాన్నిహిత్యాన్ని గమనించిన దర్శక, నిర్మాత, ఇద్దరికీ కామన్ ఫ్రెండ్ అయిన కరణ్‌జోహార్.. ' ఈ తారాగణంతో మాకు ఒక చిత్రం కావాలి' అని పోస్ట్‌చేశారు. దీనికి అర్జున్ కపూర్ పూ స్క్వేర్ అని రాశారు. ఈచిత్రాన్ని పంచుకుంటూ ఇలా ఆలియా .. దయచేసి ఎవరైనా మమ్మల్ని ఓ చిత్రంలో నటింపజేయాలి.. అని కోరింది.. ఇలా ఆ ముగ్గురి మధ్య సంభాషణ కొనసాగింది. దీంతో కొందరు నిర్మాతలు తప్పకుండా చాన్స్ ఇస్తామంటూ స్పందించారు.

# 'జిలేబి'కి అద్భుతమైన స్పందన

ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన మోస్ట్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ కె.విజయ భాస్కర్ చాలా విరామం తర్వాత చేసిన యూత్ ఫుల్ ఫన్ థ్రిల్లర్ మూవీ జిలేబి.. ప్రముఖ పారిశ్రామికవేత్త గుంటూరు రామకృష్ణ, ఎస్ఆర్కే ఆర్ట్స్ బ్యానర్‌పై ఈచిత్రాన్ని నిర్మించారు.. అంజు అశ్రాని ప్రజెంట్ చేశారు.. విజయభాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా పరిచయమైన ఈచిత్రంలో శివాని రాజశేఖర్ హీరోయిన్‌గా నటించారు. రాజేంద్రప్రసాద్ కీలకపాత్రలో నటించారు. ఆగస్టు

**డైరెక్టర్ కె.విజయ భాస్కర్**



18న విడుదలైన మంచి విజయం అందుకుంది.. ఈనేపథ్యంలో సక్సెస్‌మీట్ నిర్వహించారు. విజయభాస్కర్ మాట్లాడు తూ, ఇంత మంచి ఎంటర్‌టైనర్‌ను ఎంచుకుని రాజీపడకుండా పెద్దసినిమాగా నిర్మించిన నిర్మాతలకు ధన్యవాదాలు అన్నారు. సినిమాపై ఉన్న నమ్మకంతో సొంతంగా రిలీజ్ చేశారని అన్నారు. ఈచిత్రం చదువుకునే రోజులు, హాస్టల్ డేస్‌ను మళ్లీ గుర్తుచేసిందన్నారు.. మణిశర్మ చక్కటి సంగీతం అందించారన్నారు. హీరో శ్రీకమల్ మాట్లాడుతూ, ఈచిత్రాన్ని వస్తున్న స్పందన చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నిర్మాత గుంటూరు రామకృష్ణ, నిర్మాత అంజు అశ్రాని, అంకిత్ కొయ్య, సన్నీ, సాయికుమార్ బబ్లూ తదితరులు మాట్లాడారు

# మహిళల గొప్పతనం చాటే. సత్య

సమాజం పట్ల బాధ్యత ఉన్న హీరోల్లో సుప్రీమ్ హీరో సాయిధరమ్‌తేజ్ ఒకరు.. ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తేజ్‌కు మహిళల పట్ల అమితమైన గౌరవం ఉటుంది.. ఇప్పటి వరకు ఆయన నటించిన సినిమాల్లో అది స్పష్టంగా కన్పిస్తుంది.. అందుకే ఆడవాళ్లు లేకుంటే ప్రపంచంలో ఎవరికి మనుగడ ఉండదు అనే దాన్ని బలంగా ఈచిత్రంతో తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో షెడ్యూల్ ఎంత బిజీగా ఉన్నప్పటికీ సత్య అనే సినిమాలో నటించారు.. సీనియర్ నటుడు నరేష్ కుమారుడు హీరో నవీన్ విజయకృష్ణ ఈ షార్ట్‌ఫిల్మ్‌కు దర్శకత్వం వహించారు.. కలర్స్ స్వాతి ఫిమేల్ లీడ్‌గా సాయిధరమ్ తేజ్‌కు జోడీగా నటించింది. దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హర్షిత్, హన్షిత నిర్మించారు. మన కోసం దేశ సరిహద్దుల్లో ప్రాణాలను అర్పిస్తున్న సైనికులకు, వారి వెనుకున్న ఎందరో తల్లులు, భార్యలు, అక్కలు, చెల్లెళ్లకు నివాళిగా మంచి కాన్సెప్ట్‌తో ఈ షార్ట్‌ఫిల్మ్‌ను రూపొందించారు.. ఇందులో సోల్జర్‌గా సాయి ధరమ్‌తేజ్ కన్పిస్తారు. భార్య,భర్తల మధ్య ఉండే ప్రేమబంధాన్ని ఈ వీడియోలో చక్కగా చూపించారు.



**కళ్యాణం, కమనీయం:** 'హాస్యబ్రహ్మ' బ్రహ్మానందం కుమారుడు సిద్ధార్థ్, ఐశ్వర్యల వివాహ వేడుక శనివారం గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అన్వయ కన్వెన్షన్స్‌లో వైభవంగా జరిగింది. ఇండ్రస్టీ ప్రముఖులు, సిటీ ప్రముఖులు పాల్గొన్నారు.



## ఆ డైలాగ్ స్ఫూర్తితోనే..



యువహీరో కార్తికేయ గుమ్మకొండ, నేహాశెట్టి జంటగా నటించిన చిత్రం బెదరులంక 2012.. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించారు. క్లాక్స్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆగస్టు 25న ఈచిత్రం విడుదల కానుంది. ఈనేపథ్యంలో దర్శకుడు క్లాక్స్ మీడియాతో మాట్లాడారు.

**క్లాక్స్.. ఈపేరు కొత్తగా ఉంది. దాని వెనుక కథ ఏంటి?**

పెద్ద కథ ఏమీ లేదు.. పదో తరగతి అయ్యాక ఇంగ్లీషు నేర్చుకునేటపుడు కొన్ని పదాలు పలకటం రాకపోతే ఒక సౌండ్ చేస్తాం కదా.. అలా క్లాక్స్ అనటం మొదలైంది.. నేను ఆ వర్డ్ ఎక్కువ చేస్తున్నానని టీజ్ చేసేవాళ్లు.. అది ఏదో బావుందని అన్పించింది.. యాహూ మెస్సెంజర్ స్టార్ట్ అయిన కొత్తల్లో ఆ పేరు మీద అకౌంట్ ఓపెన్ చేశా.. స్లోగా అలా పిలవటం మొదలైంది.. ఆ తర్వాత క్లాక్స్అ ంటే నథింగ్ అని తెలిసింది. నా అసలు పేరు ఉద్దరాజు వెంకట కృష్ణ పాండురంగ రాజు

**బెదురులంక కథను కార్తికేయకు ఎపుడు చెప్పారు?**

రామ్‌గోపాల్ వర్మ గారి వద్ద పనిచేసినపుడు నాకు అజయ్ భూపతి పరిచయం అయ్యారు. ఆయన కిల్లింగ్ వీరప్పన్‌కు పనిచేశారు.. నేను కథలు చెప్పటం మొదలు పెట్టినపుడు ఆర్ఎక్స్ 100 షూటింగ్ జరుగుతుంది.. కార్తికేయ పరిచయం కావటంతో నేనే కథ చెప్పాను. మరో సారి చెప్పాక ఓకే అన్నారు. లాక్‌డౌన్ రావటం్త ప్రయత్నాలు బ్రేక్ పడింది.

**మళ్లీ ఎపుడు స్టార్ట్ చేశారు?**

లాక్‌డౌన్ తర్వాత సూపర్ ఓవర్ కోసం హైదరాబాద్ వచ్చాం.. ఆ చిత్ర దర్శకుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. ఆయనతోపాటు నాకు గాయాలయ్యాయి. ఆ సమయంలో సుధీర్‌వర్మ తమ్ముడు ఫణి ద్వారా బెన్నీ ముప్పానేని పరిచయం అయ్యారు. ఆయనకు స్టోరీ చెప్పాను. హ్యాపీగా ఫీలయ్యారు. ఆయనతో సినిమా ఓకే అయ్యింది.

**టైటిల్ వెనుక ఉన్న కథ ఏంటి?**

సినిమా అంతా ఫిక్షనల్ ఐలాండ్‌లో జరుగుతుంది.. మేం ఎదరులం అని ఓ ఊరిలో షూటింగ్ చేశాం.. బోర్డులపై బెదరులంక అని రాశారు. ఎందుకంటే కథలో ఓ ఫియర్ ఉంటుంది.. దాన్ని కంటిన్యూ చేసేలా ఆ పేరు పెట్టాం. అందరం కలిసి బెదురులంక టైటిల్‌ను ఓకే చేశాం.

**సినిమాను ఎవరికి చూపించారు?**

ప్రస్తుతానికి సెన్సార్ సభ్యులు మాత్రమే చూశారు..వాళ్లు బాగా ఎంజాయ్ చేశారు. హ్యాపీగా అన్పించింది.. ఆడియెన్స్ రియాక్షన్ కోసం వెయిట్ చేస్తున్నా.

## కొవిడ్ తర్వాత యువతలో ఆకస్మిక మరణాలెందుకు?

# కారణాలపై ఐసిఎంఆర్ అన్వేషణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** భారత్‌తో పాటు పలు దేశాల్ని తీవ్రంగా కుదిపేసిన కొవిడ్ మహమ్మారి ప్రభావం బాగా తగ్గినా ఇంకా మరణాలు మాత్రం ఆగడం లేదు. ముఖ్యంగా యువతలో పెరుగుతున్న ఆకస్మిక మరణాలు కలవరపెడుతున్నాయి. గతంలో కొవిడ్ బారినపడి కోలుకున్న యువతలో ఆకస్మికంగా మరణాలు చోటు చేసుకోవడం వారి కుటుంబాల్లో విషాదం నింపుతోంది. అలాగే దేశంలో అలాంటి కేసులు కూడా పెరుగుతుండడంతో కేంద్రం దీనిపై దృష్టిసారిస్తోంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) భారత్‌లో కొవిడ్ తర్వాత యువకుల ఆకస్మిక మరణాలకు కారణాన్ని అర్థం చేసుకోవడానికి రెండు అధ్యయనాలను నిర్వహిస్తోంది. ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహ్ల్ 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తుల్లో చోటు చేసుకుంటున్న మరణాలను పరిశీలిస్తున్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన డబ్ల్యూహెచ్ఓ సదస్సులో మాట్లాడుతూ ఎలాంటి కారణాలు లేకుండా మరణాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎలాంటి తక్షణ కరణాలులేకుండా దేశంలోని యువతలో చోటు చేసుకుంటున్న మరణాలపై ఐసీఎంఆర్ రెండు అధ్యయనాలు చేస్తుంది. ఈ అధ్యయనం కొవిడ్-19 వ్యాప్తి పరిణామాలను అర్థం చేసుకోవడంలో సహాయపడుతుందని ఐసీఎంఆర్ చెబుతోంది. ఈ కారణాలు తెలిస్తే రాబోయే మరణాలను నిరోధించే అవకాశం ఉంటుందని ఐసీఎంఆర్ చెబుతోంది. ఎలాంటి ఇతర తీవ్ర వ్యాధులు లేకుండా చోటు చేసుకుంటున్న ఆకస్మిక మరణాలపైనే ఈ అధ్యయనాలు సాగుతున్నాయి. ప్రస్తుతం ఐసీఎంఆర్ ఢిల్లీ ఎయిమ్స్‌లోని 50 ఇలా మరణించిన మృతదేహాలపై అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం 100 మృతదేహాలపై ఈ అధ్యయనాలు చేయాలని ఐసీఎంఆర్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ శవాల పోస్టుమార్టం రిపోర్టులను, కొవిడ్ తర్వాత పరిస్థితులతో పోల్చి చూడడం ద్వారా కారణాలు తెలుసుకుంటున్నట్లు ఐసీఎంఆర్ చెబుతోంది. కొవిడ్ తర్వాత యువతలో ఆకస్మిక మరణాలకు మానవ శరీరాల్లో చోటు చేసుకున్న మార్పుల్ని తెలుసుకుంటోంది. మరో అధ్యయనంలో గత యేడాదిలో 18 నుంచి 45 సంవత్సరాల వయస్సులో ఆకస్మిక మరణాల డేటాను తీసుకుని, వారు ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యాక ఏం జరిగిందో తెలుసుకుంటున్నారు.

## రతన్ టాటాకు 'ఉద్యోగరత్న' పురస్కారం



**ముంబయి, ఆగస్టు 19:** టాటాగ్రూప్‌ఛైర్మన్‌రతన్ టాటాకు మహారాష్ట్ర ప్రభుత్వంలో ఉద్యోగరత్న పురస్కారంప్రదానంచేసింది. ముంబయిలోని ఆయన నివాసంలోనే ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేసారు. ఈ కార్య క్రమంలో ముఖ్య మంత్రి ఏక్‌నాథ్‌షిండే, డిప్యూటీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్‌లుపాల్గొని రతన్ టాటా సేవలను కొని యాడారు. ఈ ఏడాది మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ఉద్యోగ్‌రత్న అవార్డును టాటాగ్రూప్‌ఛైర్మన్‌కే అందించాలనినిర్ణయించినట్లు సీఎం తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును మహారాష్ట్రప్రభుత్వం ఈ ఏడాదే ప్రవేశపెట్టింది. మొట్టమొదటి పురస్కార గ్రహీత రతన్‌టాటా కావడం అదృష్టం అని అన్నారు. ఈపురస్కారం కింద ఒక షాల్, ప్రశంసాపత్రం, మహారాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిసంస్థపరిధిలో ఒక మెమొంటోను అందచేస్తారు. పారిశ్రామిక పితామహుడు రతన్‌టాటా ఆయన స్థాపించిన టాటాగ్రూప్‌తో దేశానికి ఎనలేని సేవలు అందించారని సీఎం ఏక్‌నాథ్‌షిండే పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని స్వీకరించినందుకు ఆయనకు మహారాష్ట్రప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అస్వస్థత కారణంగా ఆదివారం జరిగే ఈ పురస్కారప్రధాన కార్యక్రమానికి రతన్ టాటా హాజరుకాలేనని స్పష్టంచేసారు. అందువల్లనే ఈ పురస్కారాన్ని శనివారం ఆయన నివాసానికి వెళ్లి అందచేసారు. ఉప్పునుంచి ఉక్కువరకూ అన్ని రంగాల్లోను పరిశ్రమలు స్థాపించి సుమారు వందకుపైగా దేశాల్లో టాటాగ్రూప్ విస్తరించింది.

2021-22లో టాటా కంపెనీల సమిష్టి రాబడులు 128 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

## ఎన్నికలకు ముందే ఇంధన ధరలు తగ్గిస్తున్నామనడం అపోహ

### కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరి



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందే ప్రభుత్వం ఇంధన ధరలను తగ్గిస్తుందనడం అపోహ మాత్రమేనని కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరి అన్నారు. శనివారం న్యూఢిల్లీలో జరిగిన ఆజ్‌తక్ జీ20 సమ్మిట్‌లో పూరి ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందు ఇంధన ధరలను తగ్గిస్తారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఆ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. అదంతా మీడియా చేసిన ప్రచారమే అన్నారు. ఇంధన ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, కానీ అంతర్జాతీయ ముడిచమురు ధరలు పెరగడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. అంతర్జాతీయ చమురు ధరలు, రవాణా ఖర్చులు, రిఫైనింగ్ వ్యయం, పన్నులు వంటి అనేక అంశాలు ఇంధన ధరలను నిర్దేశిస్తాయన్నారు. ఇలాంటి అంశాలను ప్రభుత్వం ఎలా నిర్వహిస్తుందనే దానిపైనే ఇంధన ధరలు ఆధారపడి ఉంటాయన్నారు. మహమ్మారి అనంతరం 2022లో చమురు ధరలు పెరిగిన సమయంలో ధరలు తగ్గించాలని చమురు సరఫరా చేసే దేశాలను కోరడానికి బదులుగా, ఎక్సైజ్ పన్ను తగ్గించి వినియోగదారులకు ఉపశమనం కల్పించామన్నారు. అంతేకాకుండా బిజెపి పాలిత రాష్ట్రాల్లోప్రభుత్వం ఇంధనంపై వ్యాట్‌ను తగ్గించిందన్నారు. త ద్వారా ధరలు రూ.8 నుండి రూ.11కు తగ్గాయన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రతిపక్ష కూటమి ఇండియాలో ఎందుకు భాగస్వామి అయ్యారో చెప్పాలని నిలదీశారు.

## జమ్ముకాశ్మీర్‌నుంచి కన్యాకుమారికి ఎక్స్‌ప్రెస్‌వే

### నాలుగు సొరంగాలు నిర్మాణం

### కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ

**శ్రీనగర్, ఆగస్టు 19:** కాశ్మీర్‌నుంచి కన్యాకుమారి వరకూ నిర్మించనున్న ఎక్స్‌ప్రెస్ హైవేరోడ్డు భారత్ కల అని 2024 సంవత్సరానికల్లా పూర్తిచేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లుకేంద్ర హైవే రవాణా మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. వచ్చే ఏడాదిప్రారంభం లోనే ఈ భారీ హైవే ప్రారంభం అవుతుందన్నారు. అలాగే రోహతంగ్‌నుంచి లడక్‌కు నాలుగు సొరంగాలనుకూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. లేహ్‌నుంచి కార్గిల్‌వరకూ నేరుగా వచ్చి జోజిలా, జడ్‌మార్చ్ సొరంగాలకు చేరుకోవచ్చున్నారు. ఈ కొత్త రోడ్డువల్లఢిల్లీనుంచి చెన్నై మధ్యదూరాన్నిఇ 1312 కిలోమీటర్లు తగ్గిస్తుందన్నారు. రోడ్డురవాణా హైవేలపై పార్లమెంటరీ సంప్రదింపులకమిటీ రరెండోసమావేశం లో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగానే తన మంత్రిత్వశాఖపరిధిలోజరిగే ప్రాజెక్టులను ఆయన వివరించారు. 2014లో బిజెపి ప్రభుత్వం వచ్చిందని, జమ్ముకాశ్మీర్‌లో మౌలికవసరుల కల్పనకు తాము రోడ్‌మాప్ రూపొందించా మన్నారు. అప్పటినుంచి ఇప్పటి వరకూ 1.25 లక్షలకోట్ల పనులను జమ్ముకాశ్మీర్ లోచేపట్టామని, ఈప్రాజెక్టు లన్నీ పూర్తి అయితే జమ్ముకాశ్మీర్‌కు పర్యాటకులు నాలుగురెట్లు ఎరుగుతారన్నారు. స్విట్జర్లాండ్‌కువెళ్లే పర్యాటకు లంతా ఇక జమ్ముకాశ్మీర్‌కే వస్తారన్నారు. జమ్ముకాశ్మీర్‌ప్రభుత్వం రోడ్డుపక్కన టూరిస్టు సౌకర్యాలకోసం 13 ఎకరాల భూమిని ఎంపికచేసిందన్నారు.

## అమెరికాలో ఆగిన తైవాన్ ఉపాధ్యక్షుడు, రెచ్చిపోయిన చైనా



**బీజింగ్, ఆగస్టు 19:** చైనా, తైవాన్ మధ్య మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ద్వీపం చుట్టూ బీజింగ్ శనివారం సైనిక డ్రిల్స్‌ను ప్రారంభించింది. తైవాన్ ఉపాధ్యక్షుడు విలియం లాయ్ చెంగ్ తె అమెరికాలో ఆగడమే ఇందుక్కారణం. వేర్పాటు వాదులు, విదేశీ శక్తుల కవ్వింపు చర్యలపై హెచ్చరికగానే ఈ డ్రిల్స్ చేపట్టినట్లు చైనా రక్షణ మంత్రి వెల్లడించారు. శాశ్వత స్వతంత్ర దేశంగా ప్రకటించుకునేందుకు ప్రయత్నిస్తున్న తైవాన్ పశ్చిమదేశాలతో తమ దౌత్యబంధాన్ని బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. ఇందులో భాగంగానే ఇటీవల పరాగ్వే పర్యటనకు వెళ్లిన తైవాన్ ఉపాధ్యక్షుడు విలియం లాయ్ మధ్యలో శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్క్ నగరాల్లో ఆగారు. అంతేగాక అమెరికా మీడియా సంస్థ బ్లూమ్‌బర్గ్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో తైవాన్ స్వతంత్ర దేశం అని లాయ్ పేర్కొన్నారు. ఇక పర్వాగ్వేలోనూ అమెరికా అధికారులతో ఆయన చర్చలు జరిపారు. అయితే ఈ ద్వీపం తమ దేశంలోని భాగమని చెబుతున్న చైనా లాయ్ పర్యటనపై గుర్రుమంది. ఇది పూర్తిగా అమెరికా, తైవాన్ అధికారిక డెమోక్రటిక్ ప్రోగ్రేసివ్ పార్టీ కలిసి చేస్తున్న రెచ్చగొట్టే చర్యే అని బీజింగ్ మండిపడింది. తమ భూభాగంలోని ప్రాంతాలకు విదేశాలతో సంబంధాలు నెరిపే హక్కు లేదని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే తైవాన్ చుట్టూ సైనిక విన్యాసాలను ప్రారంభించింది. సైనిక బోట్లు, విమానాలను మోహరించింది. సైనికులతో డ్రిల్స్ చేపట్టింది. క్షిపణులను మోసే బోట్లు, యుద్ధ విమానాలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నట్లు బీజింగ్ మీడియా వర్గాలు వెల్లడించాయి.

## అటక్ జైలులో నా భర్తకు ప్రాణహాని ఉంది

### ఇమ్రాన్ భార్య బుస్రాబీబీ




**ఇస్లామాబాద్, ఆగస్టు 19:** తోషాఖానా కేసులో దోషిగా తేలిన పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ప్రస్తుతం పంజాబ్‌ప్రావెన్స్‌లోని అటక్ జైలులో ఖైదీగా ఉన్నారు. లయితే తన భర్త ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని ఆయనపై విషప్రయోగం జరగవచ్చని ఇమ్రాన్ భార్య బుస్రా బీబీ ఆందోళన వ్యక్తంచేసారు. ఆయన్ను మెరుగైన వసతులున్న జైలుకు తరలించాలని డిమాండ్‌చేస్తూ పంజాబ్ హోంశాఖకార్యదర్శికి లేఖరాసారు. ఇమ్రాన్‌ను అటక్‌జైలునుంచి రావల్పిండిలోని ఆదియాలాకు తరలించాలని సంబంధిత అధికారులను కోర్టు ఆదేశించిన అంశాన్ని కూడా ఆమెగుర్తుచేసారు. సరైన కారణాలు లేకుండా నాభర్తను అటక్‌జైలులో బంధించారని, చట్టప్రకారం ఆయన్ను ఆదియాలా జైలుకు తరలించాలి. ఆయన సామాజిక రాజకీయ హోదా దృష్ట్యా జైలులో బిక్లాస్ సౌకర్యాలు కల్పించాలని, ఇమ్రాన్‌పై గతంలో రెండుసార్లు హత్యప్రయత్నంజరిగిన అంశాన్ని కూడా ఆమె గుర్తుచేసారు. వాటితో సంబంధం ఉన్నవారిని ఇంకా అరెస్టుచేయలేదని ఆయనప్రాణాలకు ఇప్పటికీ ప్రమాదం ఉందని ఆమె అన్నారు. అటక్‌జైలులో ఆయనపై విషప్రయోగంజరిగే అవకాశం ఉందని బుష్రాబీబీ తన లేఖలో ఆందోళన వ్యక్తంచేసారు. ఈనేపథ్యంలో ఇంట్లోమాత్రమే వండిన ఆహారం తినేందుకు ఇమ్రాన్‌కు అనుమతి ఇవ్వాలనికోరారు. జైలు నిబంధనలప్రకారం తన భర్తకు 48 గంటల్లోగా అన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉందని అయితే వాటి ఊసేలేదని ఆమె తన లేఖలో ఆరోపించారు. ఆయనకు మెరుగైన సౌకర్యాలు ఎందుకు నిరాకరించారనేదానిపై విచారణ జరిపించాలని డిమాండ్‌చేసారు. ఇదిలా ఉండగా జైలులో ఉన్న ఇమ్రాన్‌ను బుష్రాబీబీ ఇటీవలే కలుసుకున్నారు. అనంతరం ఆమెమాట్లాడుతూ దారుణమైన పరిస్థితులమధ్య తనభర్తను ఉంచారని, సిక్లాస్ జైలు సౌకర్యాలు కల్పించారని విమర్శించారు. మరోవైపు ఇమ్రాన్‌ఖాన్‌కు విధించిన శిక్షను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈనెల 22న డివిజన్‌బెంచ్ విచారణ చేయనున్నది.

## అమెరికాలో ఫ్లోరిడా, కాలిఫోర్నియాకు హరికేన్ ముప్పు!

### వారాంతంలో భారీ వర్షాలు

**వాషింగ్టన్, ఆగస్టు 19:** అమెరికాకు ఈ వారాంతం హరికేన్ల ముప్పు పొంచి ఉంది. ముఖ్యంగా కాలిఫోర్నియాతో పాటు దక్షిణ ఫ్లోరిడా ప్రాంతాలకు ఈ వారాంతంలో హరికేన్ల కారణంగా భారీ వర్షాలు ముంచెత్తే ప్రమాదం పొంచి ఉందని జాతీయ హరికేన్ సెంటర్ తాజాగా ప్రకటించింది. దీంతో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని హెచ్చరికలు చేస్తున్నారు. వాస్తవానికి సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఇక్కడ హరికేన్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కానీ వాతావరణ మార్పు కారణంగా ముందే ఈ ప్రభావం కనిపిస్తోంది. అట్లాంటిక్ మహాసముద్రం గుండా కదులుతున్న నాలుగు ఉష్ణమండల వ్యవస్థలు క్రమంగా బలపడుతూ ఉన్నాయి. గల్ఫ్ ఆఫ్ మెక్సికోలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న ఈ వ్యవస్థల కారణంగా దక్షిణ ఫ్లోరిడాలో భారీ వర్షాలు తప్పవని నేషనల్ హరికేన్ సెంటర్ తెలిపింది. మయామి-డేడ్, బ్రోవార్డ్‌తో సహా ఫ్లోరిడా కీస్, సౌత్ ఫ్లోరిడా, కొన్ని ప్రాంతాలలో 10 నుంచి 15 మైళ్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. గత నెలలో వీచిన హరికేన్ల కారణంగా ఎదురైన వరద పరిస్థితులు తిరిగి పునరావృతం కావొచ్చని అధికారులు హెచ్చరికలు జారీచేస్తున్నారు. వాస్తవానికి అట్లాంటిక్ హరికేన్ సీజన్ సెప్టెంబర్ 10 కల్లా టాప్‌లో ఉంటుంది. వీటి రాక ఆగస్టు మధ్య, అక్టోబర్ మధ్య ఉంటుంది. కాబో వెర్డే దీవులకు పశ్చిమాన కొన్ని వందల మైళ్ల దూరంలో తూర్పు ఉష్ణమండల అట్లాంటిక్‌లో అల్పపీడన ప్రాంతం జల్లులు, ఉరుములతో కూడిన గాలి వానల సంకేతాలను ఇస్తోంది. ఈ వారాంతంలో సౌత్ ఫ్లోరిడా మీదుగా కదిలే ఉష్ణమండల వ్యవస్థ పైకి



ప్రయాణిస్తున్నందున అధిక వర్షపాతానికి కారణమవుతుందని అంచనా వేస్తున్నారు. కానీ అది వచ్చే వారం అభివృద్ధి చెందితే మాత్రం రాష్ట్రం దాటి పశ్చిమ గల్ఫ్ ఆఫ్ మెక్సికో తీర ప్రాంతంలోకి వెళ్లిపోతుందని అంచనా. నేషనల్ హరికేవ్ సెంటర్ మధ్య, తూర్పు అట్లాంటిక్, గల్ఫ్ ఆఫ్ మెక్సికో అంతా అనేక ఉష్ణమండల వ్యవస్థలను ట్రాక్ చేస్తోంది.



## ఆయుష్మాన్ భారత్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసలు

**గాంధీనగర్, ఆగస్టు 19:** గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన జీ20 సదస్సు ఆరోగ్య శాఖ మంత్రుల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ డా.టెడ్రోస్ అధనం ఘెబ్రేయేసుస్ భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కొనియాడారు. జీ20 సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సును ఇంతటి స్థాయిలో నిర్వహిస్తున్నందుకు ముందుగా భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్యం విషయంలో భారతదేశం అనుసరిస్తోన్న విధానాలను కొనియాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకంపై ప్రశంసలు కురిపించారు. నేనొక హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌కి వెళ్లాను. అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కనీసం వెయ్యి గృహాల వరకు సేవలందిస్తుండడం చూసి ఆశ్చర్యపోయాను. గుజరాత్‌లోని టెలి మెడిసిన్ సౌకర్యం కూడా చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది., వైద్య రంగంలో డిజిటల్ సేవలు ఒక విప్లవాత్మక మార్పని చెబుతూ జీ20 సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారత్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖమంత్రి మన్సుఖ్ మండవియా మాట్లాడుతూ ఈ సమావేశాలకు సుమారు 70 దేశాల నుంచి ఆరోగ్యశాఖ మంత్రులు, ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. జీ20 ప్రెసిడెన్సీ సదస్సు ద్వారా భారతదేశంలో మేము అవలంబిస్తున్న ఆరోగ్య విధానాల గురించి ప్రజలకు తెలియచేశామని మోడీ ప్రభుత్వం ఆరోగ్యానికి ఏ స్థాయిలో ప్రాధా న్యత నిచ్చిందో చెప్పే ప్రయత్నంచేశారు. ఆగస్టు 17న మొదలైన ఈ సమావేశాలు ఆగస్టు 19 వరకు విజయవంతంగా జరిగాయి. ఈ సమావేశం ప్రధానంగా మూడు అంశాలపై ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. అత్యవసర ఆరోగ్య సమస్యల నివారణ, యాంటీ మైక్రో బయాల్ రెసిస్టెన్స్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిస్థి తులకు తగ్గట్టుగా స్పందించి సిద్ధపడడం, సురక్షితమైన, ప్రభావవంతమైన, నాణ్యమైన సేవలందించే విధంగా ఫార్మసీరంగాన్ని బలోపేతంచేయడం గురించి ప్రస్తావించినట్లు తెలిపారు.



## ప్రొఫెషనల్ బైక్ రేసర్ అవతారంలో రాహుల్‌గాంధీ

**లేహ్, ఆగస్టు 19:** కాంగ్రెస్ ఎంపి, పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బైక్ రేసర్ అవతారం ఎత్తారు. లడఖ్ పర్యటనలో ఉన్న ఆయన బైక్‌పై భారత్,చైనా సరిహద్దులోని పాంగాంగ్ సరస్సుకు బయల్దేరారు. ఓ ప్రొఫెషనల్ బైకర్ ఎలాంటి దుస్తులు, ఉపకరణాలు ధరిస్తారో రాహుల్ అవన్నీ ధరించి బైక్ రైడింగ్ చేశారు. హిమాలయ పర్వతశ్రేణుల్లో రాహుల్ బైక్ విహారం అందరినీ విపరీతంగా ఆకర్షించింది. ఆగస్టు 20వ తేదీ దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి. తన తండ్రి జయంతిని రాహుల్ గాంధీ పాంగాంగ్ సరస్సు వద్ద నిర్వహించనున్నారు. ఇక్కడి పర్యాటక శిబిరంలో రాహుల్ నేడు బస చేయనున్నారు. బైక్ రైడింగ్‌కు ముందు రాహుల్ మీడియాతో మాట్లాడుతూ పాంగాంగ్ సరస్సు రమణీయత గురించి తన తండ్రి చెబుతుండగా విన్నానని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ బైక్ రైడింగ్ చేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని చెప్పారు. శనివారం రాత్రికి పాంగాంగ్ సరస్సు వద్ద ఉన్న టూరిస్టు క్యాంప్‌లో బస చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఆగస్టు 20న తన తండ్రి మాజీ ప్రధాన ఇరాజీవ్‌గాంధీ జయంతిని రాహుల్ ఈసరస్సు వద్దనే చేసుకుంటారు. గత గురువారం రాహుల్ లేహ్ పర్యటనకు వచ్చారు. తొలుత రెండు రోజులపాటు అక్కడే ఉండాలనిభావించినా ఈనెల 25 వరకూ తన పర్యటనను పొడిగించుకున్నారు. 2019లో 370వ అధికరణం రద్దుచేసిన తర్వాత రాహుల్ లఢక్‌కు రావడం ఇదే తొలిసారి. అంతకుముందు ఆయన లేహ్‌లోని యువతతో ముచ్చటించారు. సెప్టెంబరు 10న లడాక్ ఆటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కార్గిల్‌ప్రాంతంలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ స్థానిక నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీతో పొత్తుపెట్టు కుంది. ఈ క్రమంలో రాహుల్ లేహ్‌పర్యటనకు రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పర్యటనలో భాగంగా ఆయన స్థానిక కాంగ్రెస్‌నేతలతో సమావేశాలు నిర్వహిస్తారు.

## ఉక్రెయిన్ యుద్ధం ఆగాలంటే

### ఆ దేశ ప్రాంతాలు రష్యా ఆధీనంలో ఉండాలి



**అమెరికా అధ్యక్ష అభ్యర్థి వివేక్ రామస్వామి**

**వాషింగ్టన్, ఆగస్టు 19:** రష్యా, ఉక్రెయిన్ మధ్య నెలకొన్న తీవ్రస్థాయి ప్రతిష్టంభనకు ముగింపు పలికేలా తన ప్రణాళికను రిపబ్లికన్ నేత వివేక్ రామస్వామి ప్రతిపాదించారు. అందుకోసం రష్యా ఓడిపోకుండా, అమెరికా రిపబ్లికన్ నేత వివేక్ రామస్వామి ప్రతిపాదించారు. అందుకోసం రష్యా ఓడిపోకుండా అమెరికా గెలిచేలా తమ లక్ష్యం ఉండాలని సూచించారు. వివేక్ అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న భారత సంతతి వ్యక్తి. వివేక్ రామస్వామితో జరిగిన ఇంటర్వ్యూను ఓ పాత్రికేయుడు పోస్టు చేశాడు. అలాగే ఆయన చెప్పిన మాటలను రాసుకొచ్చారు. ఇంటర్వ్యూలో భాగంగా రామస్వామి మాట్లాడుతూ ఉక్రెయిన్‌కు చెందిన ప్రాంతాలు రష్యా ఆధీనంలో ఉండటానికి అనుమతిస్తానని, నాటోలో ఉక్రెయిన్ చేరకుండా నిరోధిస్తానంటూ తన వైఖరి స్పష్టం చేశారు. అలాగే మాస్కోలో పుతిన్‌ను కలుసుకుంటానని చెప్పారు అని పాత్రికేయుడు వెల్లడించారు. దీనికి వివేక్ స్పందిస్తూ ఈ నిబంధనల కింద నేను ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తాను. చైనాతో ఉన్న సైనిక పొత్తు నుంచి పుతిన్ బయటకు రావాల్సి ఉంటుంది. అలాగే రష్యా ఓడిపోయేలా కాకుండా అమెరికా గెలిచేలా మన లక్ష్యం ఉండాలి అని రామస్వామి ఆ పోస్టుకు బదులిచ్చాడు. అలాగే రామస్వామి మాట్లాడుతూ రష్యా,చైనా సైనిక కూటమి ప్రస్తుతం అమెరికా ఎదుర్కొంటున్న ఏకైక సైనిక ముప్పు అమెరికా, చైనా కంటే హైపర్‌సోనిక్ అణ్వస్త్ర సామర్థ్యంలో రష్యా ఎంతో ముందుంది. నావికా దళం సామర్థ్యంలో మనకంటే చైనా ముందు వరుసలో ఉంది. దీని గురించి ఎవరూ మాట్లాడటం లేదు. అన్నింటికంటే దారుణ విషయం ఏమిటంటే ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తోన్న సహకారం రష్యాను చైనాకు దగ్గర చేస్తోంది అని బైడెన్ ప్రభుత్వ విధానాలపై విరుచుకుపడ్డారు. అలాగే ఒకవేళ అధ్యక్షుడినైతే మాస్కోలో పర్యటిస్తానని, చైనాతో సైనిక భాగస్వామ్యం నుంచి రష్యాను బయటకు తీసుకువస్తానని చెప్పారు.

## వాషింగ్టన్ వైపు దూసుకొస్తున్న కార్చిచ్చు!



**వాషింగ్టన్, ఆగస్టు 19:** ఉత్తర అమెరికా దేశాలను కార్చిచ్చు వణికిస్తోంది. బలమైన గాలుల కారణంగా వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే హవాయి ద్వీపంలో భీభత్సం సృష్టించిన ఈ కార్చిచ్చు ఇప్పుడు అగ్రదేశం అమెరికా రాజధాని వాషింగ్టన్ వైపు దూసుకొస్తోంది. దీంతో వెంటనే ఖాళీ చేయాలని పలు ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వాషింగ్టన్‌లోని స్పోకాన్ కౌంటీ సమీపంలో మొదలైన ఈ కార్చిచ్చు కొన్ని గంటల వ్యవధిలోనే 500 నుంచి 3వేల ఎకరాలను విస్తరించింది. బలమైన గాలులే అందుకు కారణమయ్యాయని వాషింగ్టన్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ నేచురల్ రిసోర్సెస్ వెల్లడించాఇంది. దీనివల్ల ఇప్పటికే కొన్ని ఇళ్లు కాలిపోయి ఆస్తినష్టం కూడా సంభవించినట్లు తెలిపింది. దాంతో కౌంటీలోని మెడికల్ లేక్ పట్టణ ప్రజలకు లెవెల్ 3 అలర్ట్ జారీ అయింది. వెంటనే ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని దీని అర్థం. ఈ కార్చిచ్చు దూసుకొస్తుండడంతో మెడికల్ లేక్‌లోని ఓ ఆసుపత్రిలో వైద్యులు, రోగులను తరలించేందుకు ప్రభుత్వం నేషనల్ గార్డ్ ట్రూప్స్‌ను రంగంలోకి దింపింది. ఫోర్ లేక్స్ పట్టణానికి కూడా లెవెల్ 3 ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే స్పోకాన్ కౌంటీలోని 13వేల మంది ప్రజలున్న చెనెయ్ నగరానికి లెవెల్ 2 అలర్ట్ ఇచ్చారు. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లడానికి సిద్ధంగా ఉండాలని దీనర్థం.

భారీగా నమోదైన ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులు, బలమైన గాలులు అగ్నికీలల వ్యాప్తికి కారణమవుతాయని జాతీయ వాతావరణ విభాగం తెలిపింది. కెనడాలో అత్యంత వేగంగా వ్యాపిస్తున్న కార్చిచ్చులు వేలాది మంది ఇతర ప్రాంతాలకు తరలిపోయేట్టు చేస్తున్నారు.

ఈ దేశంలోని నార్త్‌వెస్ట్ టెరిటరీస్‌లో 200పైగా కార్చిచ్చులు రాజుకున్నాయి.

## బిజెపికోసం ఆరెస్సెస్ తన వ్యక్తులను ప్రతిసంస్థలో చేరుస్తోంది: రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లడఖ్ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ రోజు ఆయన అక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆరెస్సెస్ తీవ్ర విమర్శలు చేశారు. దేశంలోని ప్రతి సంస్థలో తన మనుషులను ఆరెస్సెస్ చొప్పిస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని బిజెపికి మాతృసంస్థ ఆరెస్సెస్సేనని చెప్పారు. బిజెపి కోసం ఆరెస్సెస్ అన్ని వ్యవస్థల్లో తన మనుషులను పెడుతోందని అన్నారు. కేంద్ర మంత్రులెవరూ వారి శాఖలను నడపడం లేదని, ఆయా శాఖల్లో ఆరెస్సెస్ నియమించిన వాళ్లు వాటిని నడుపుతున్నారని చెప్పారు. వారు సూచించిన విధంగానే శాఖలు నడుస్తున్నాయని అన్నారు. శాఖల్లో ఏం జరగాలనేది వారే సూచిస్తారని ఈ విషయాన్ని మంత్రులను అడిగినా చెపుతారని వ్యాఖ్యానించారు.

## సోషల్‌మీడియా పోస్టులకు వారే బాధ్యత వహించాలి

### తమిళనాడు మాజీ ఎమ్మెల్యే పోస్టుపై అప్పీల్ తిరస్కరించిన సుప్రీం



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** సోషల్‌మీడియాలోపోస్టులు పెడితే వాటి తీవ్రత, రీచ్ పరంగా జాగ్రత్తలు తీసుకోవాలని సుప్రీంకోర్టుహెచ్చరించింది. ఎదురయ్యే పర్యవసానాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టంచేసింది. 2018లతో మహిళా జర్నలిస్టులను కించపరిచేలా నటుడు తమిళనాడుకు చరెందిన మాజీ ఎమ్మెల్యే ఎస్వీశేఖర్ ఫేస్‌బుక్‌లోపెట్టినపోస్టుపై పోలీసులు కేసునమోదుచేసారు. ఈ కేసును కొట్టివేయాలనికోరుతూ ఆయనవేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు జులై 14న తిరస్కరించింది. దీనితో ఆయన సుప్రీంను ఆశ్రయించాడు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ పికెమి శ్రాల ధర్మాసనం విచారణచేపట్టి ఆయన అభ్యర్థనను తోసిపుచ్చింది. అదేసమయంలో సోషల్‌మీడియా చందాదారులకు కీలకసూచనలుచేసింది. ఎవరైనా సోషల్‌మీడియాను ఉపయోగిస్తే దాని ప్రభావం రీచ్‌గురించి జాగ్రత్తగా ఉండాలని పిటిషనర్ న్యాయవాదికి సూచించింది. తన క్లయంట్‌కంటి అనారోగ్యానికి మందులు వేసుకోవడం వల్ల ఆరోజున చేసిన పోస్ట్‌లోని విషయాలు చదవలేకపోయాడని మాజీ ఎమ్మెల్యే తరపు లాయర్ వాదించారు. ధర్మాసనం తీవ్రంగాపరిగణించి సోషల్‌మీడియా ఉపయోగించేటపుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. 2018లో మహిళా జర్నలిస్టులను కించపరిచేలా అభ్యంతరకరపోస్ట్‌పెట్టినట్లు హైకోర్టుతన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ పోస్ట్‌పై మహిళా జర్నలిస్టులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ తమిళనాడులోని పలుప్రాంతాల్లోపోలీసులకు ఫిర్యాదుచేసారు. అయితే పోస్టుచేసిన కొన్ని గంటల్లోనే మాజీ ఎమ్మెల్యే ఫేస్‌బుక్‌నుంచి తొలగించారు. దీనిపై హైకోర్టు క్షమాపణలుచెపుతూ అఫిడవిట్ దాఖలుచేయాలని ఆదేశించింది. ఫేస్‌బుక్‌పోస్టు చదవితే మహిళా జర్నలిస్టులను కించపరిచేవిగా ఉన్నాయని, ఇవిచాలా నీచమైన పదాలని అన్నాడు. తమిళనాడులో మొత్తం పత్రికలకు వ్యతిరేకంగా కంటెంట్ అవమానకరంగా ఉందన్నాడు. ప్రస్తుతం మనం సోషల్‌మీడియా యుగంలో ఉన్నామని ప్రపంచంలోని ప్రతి వ్యక్తి జీవితాన్ని ప్రభావితంచేస్తోందని సోషల్‌మీడియాలోపెట్టే ఏ సందేశం అయినా ప్రపంచం నలుమూలలకు క్షణాల్లో చేరుతున్నదని పెట్టే పోస్టులు, ప్రకటనలపరంగా బాధ్యతాయుతంగా ఉండాలనిమద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది.

## లండన్ ఆసుపత్రిలో పసికందులను చంపేస్తున్న నర్సును పట్టిచ్చిన భారత వైద్యుడు

**లండన్, ఆగస్టు 19:** ఆసుపత్రిలో పసికందుల ప్రాణాలు తీస్తున్న నర్సును లండన్ కోర్టు నిందితురాలిగా నిర్ధారించింది. మొత్తం ఏడుగురు చిన్నారుల హత్యలో దోషిగా తేల్చింది. మరో ఆరుగురు పసికందులపై హత్యాయత్నంచేసినట్లు కోర్టు పేర్కొంది. నిందితురాలికి ఈ నెల 21న శిక్ష ఖరారు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ కేసులో హంతకురాలిగా న్యాయస్థానం ముందు దోషిగా నిలబెట్టడంలో భారత సంతతి వైద్యుడు డాక్టర్ రవి జయరాం వాంగ్మూలం కీలకంగా మారింది. లండన్‌లోని చెస్టర్ సిటిలో ఉన్న చెస్టర్ ఆసుపత్రిలో ఈ ఘోరం చోటు చేసుకుంది. 2015లో ఆసుపత్రిలో జన్మించిన ముగ్గురు పసికందులు చనిపోయారు.

# 2500 కి.మీ మైలురాయి చేరుకున్న 'యువగళం'


శనివారం ప్రకాశం బ్యారేజ్‌కు చేరుకున్న పాదయాత్రలో అభివాదం చేస్తున్న నారా లోకేష్

### - మంగళగిరిలో 20 వేల ఇళ్ల నిర్మాణానికి శిలాఫలకం
### - కృష్ణాజిల్లాలోకి ప్రవేశించిన పాదయాత్ర
### - లోకేష్‌కు నేతల ఘనస్వాగతం

**అమరావతి, ఆగస్టు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన' యువగళం' పాదయాత్ర 188 రోజైన శనివారం 2500 కిలోమీటర్ల మైలురాయికి చేరుకుంది.. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో ఈ మైలురాయికి చేరుకోవటం సంతోషంగా ఉందని లోకేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ఇళ్లులేని 20 వేల మంది నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తామని హామీనిస్తూ శిలాఫలకంను ఆవిష్కరించారు.. దీంతోపాటు అసైన్డ్, కొండవాగు, అటవీ, రైల్వే ఇతర భూముల్లో నివసిస్తున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించి పట్టాలు అందజేస్తానని లోకేష్ హామీనిచ్చారు. కొండవీటి వాగు వద్ద బోట్ అసోసియేషన్ ప్రతినిధుల ఘనస్వాగతం కొండవీటివాగు వద్ద లోకేష్‌కు బోట్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. వైకాపా ప్రభుత్వంలో తాము నష్టపోయిన తీరును వివరించారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చి తమకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పూర్తయిన యువగళం పాదయాత్ర శనివారం ప్రకాశం బ్యారేజ్ వద్ద వీడ్కోలు పలికారు.. పసుపు, ఎరుపు రంగు బెలూన్లతో కృష్ణాజిల్లా నాయకులు స్వాగతం పలికారు. భారీగా తరలివచ్చిన జనంతో జనసంద్రంగా ప్రకాశం బ్యారేజ్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

# కుప్పం నుండి గెలిపించి చంద్రబాబును మరలా ముఖ్యమంత్రి చేస్తాం

### - అక్రమాలకు పాల్పడిన వైఎస్సార్సీ నేతలను వదిలిపెట్టం !!
### - ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త** తెదేపా అధినేత చంద్రబాబునాయుడును కుప్పంనుంచి ఈసారి లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించి మరలా రాష్ట్రానికి ముఖ్యమం త్రిని చేస్తామని ఎమ్మెల్సీ, తెదేపా సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మల్లానూరులో జరిగిన సైకిల్ యాత్ర సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో మరలా తెలుగుదేశం పార్టీ ప్రభంజనం మొదలైందని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైందన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడు వైపు చూస్తున్నారన్నారు. దేశానికి, రాష్ట్రానికి మహోన్నతమైన సేవలు అందిస్తున్న తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు ఓట్లు వేసి గెలిపించడం కుప్పం ప్రజల అదృష్టమన్నారు. నాలుగున్నర ఏళ్ల వైకాపా పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ రాలేదన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు తెదేపా పాలనలో 12వేల కోట్లు ఖర్చు చేస్తే సిఎం జగన్‌రెడ్డి కేవలం 2800 కోట్లు ఖర్చు చేశారన్నారు. కుప్పంలో 90శాతం పూర్తయిన హంద్రీ-నీవా పూర్తి చేయలేదన్నారు. అభివృద్ధి గురించి వైకాపా నేతల మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. కుప్పంలో గ్రానైట్, ఇసుక, గ్రావెల్ దోచుకుంటోంది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. మల్లానూరులో సైతం ఓ వైకాపా నాయకుడు దోచుకుంటున్నాడని పేర్కొన్నారు. తెదేపా మద్దతుదారుల షాపులు కూల్చారన్నారు. మరో ఆర్నెల్లలో తెదేపా అధికారంలో రావడం ఖాయమన్నారు. అన్యాయాలకు పాల్పడిన వైకాపా నేతలను వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్ బాబు మాట్లాడుతూ కుప్పంలో తెదేపా అధినేత చంద్రబాబు ఉంటే వైకాపా నాయకుల ఆటలు సాగవని ఇక్కడ నుంచి ఓడించాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కుప్పంకు చంద్రబాబు చేసింది ఏమీ లేదనే అబద్దాలు చెబుతున్నారన్నారు. కుప్పంలో ప్రజలను బెదిరించి భయపెట్టడం చేస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కోఆర్డినేటర్ సత్యేంద్రశేఖర్, సంక్షేమ విభాగం కన్వీనర్ త్రిలోక్, యూనిట్ ఇన్‌చార్జ్ రామచంద్ర, మాజీ ఎంపిపిలు సాంబశివం, డా॥ వెంకటేష్, నేతలు సంజీవి, కన్నన్, విభూషణ్, మోహన్, రాష్ట్ర తెలుగుయువత సభ్యుడు మణి, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, మండల యువత అధ్యక్షుడు సుబ్బు, బిసి సెల్ అధ్యక్షుడు మురళి, స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాస్ కృషి విజ్ఞాన కేంద్రానికి ప్రశంసా పత్రాలు

**రేణిగుంట, ఆగస్టు 19 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రానికి భారతీయ వ్యవసాయ సాంకేతిక పరిశోధనా, వినియోగ సంస్థ(ఐసీఏఆర్, ఏటీఏఆర్ఐ) 2022-23 సంవత్సరానికి వివిధ విభాగాల్లో 6 ప్రశంసా పత్రాలు వచ్చాయని కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త




అవార్డులు అందుకుంటున్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రం

హెడ్ డా. ఎస్.శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు తమిళనాడు వ్యవసాయ విశ్వ విద్యాలయం, కోయంబత్తూరులో జరిగిన జోన్- 10(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి) కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్ సమావేశంలో డా. గీతాలక్ష్మి, ఉప కులపతి, తమిళనాడు వ్యవసాయ విశ్వ విద్యాలయం, డా. షేక్ ఎన్.మీర, డైరెక్టర్ ఐసీఏఆర్ ఆటారి, హైదరాబాద్, డా. వెంకట సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ ఐసీఏఆర్ ఆటారి, జోన్-11, నాలుగు రాష్ట్రాల వ్యవసాయ విశ్వ విద్యాలయాల విస్తరణ సంచాలకులు, ఆటారి శాస్త్రవేత్తలు నాలుగు రాష్ట్రాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. మూడు రోజుల సమావేశంలో ఆంధ్ర, తెలంగాణ, పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల కేవీకేలు 2022-23 సంవత్సరంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలప్రగతిని వివరించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం తయారు చేసిన కేవీకే దత్తత రైతుల విజయగాథలు, టామోటాలోప్లాస్టిక్ మల్చింగ్ ప్రచురణలను సమావేశంలో విడుదల చేశారు.

కార్యక్రమం ముగింపు సమావేశంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లాలో భూసార పరీక్ష ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి రైతులు అవలంభించే విధంగా కృషి చేసినందుకు ఉత్తమ భూసార పరీక్ష కేంద్రం, నూనె గింజలు అపరాల పంటల్లో రైతుల ఆదాయం పెంచే దిశగా కార్యక్రమాలు చేపట్టినందుకు ఉత్తమ సామూహిక మొదటి తరహా ప్రదర్శనా క్షేత్రాలు, వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించి జిల్లాలో ఎక్కువ మంది రైతులు వినియోగించుకునేలా చేసినందుకు ఉత్తమ వ్యవసాయ డ్రోన్ ప్రాజెక్టు, ఉత్తమ రైతు చిత్రం, ఉత్తమ రైతుల సలహాలుకు సంబంధించి మొత్తం ఆరు ప్రశంసా ప్రతాలను డా. షేక్, ఎన్.మీర డైరెక్టర్ఐసీఏఆర్ ఆటారి, హైదరాబాద్ డా.గీతాలక్ష్మి, తమిళనాడు వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉపకులపతి, విస్తరణ సంచాలకులు చేతుల మీదుగా అందుకున్నట్లు డా. శ్రీనివాసులు తెలిపారు. కృషి చేసిన విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను సిబ్బందిని రాస్ జనరల్ సెక్రటరీ, ఎస్.వెంకటరత్నం అభినందించారు.

# ఎపిపిఎస్‌సి గ్రూప్-1 2023లో శ్రీచైతన్య ఐఎఎస్ అకాడమీ విద్యార్థికి స్టేట్ మొదటి ర్యాంక్


భానుశ్రీలక్ష్మి బొడెల సుజిత గోపిశెట్టి మనోహర్ వెల్లపనేని జ్యోతి శ్రీసాయి హర్ష బి. రమ్యకీర్తన

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ఇటీవల ప్రకటించిన 2023 ఏపీపీఎస్‌సీ గ్రూప్-1 ఫలితాల్లో శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు విజయభేరి మ్రోగించారు. స్టేట్ మొదటి ర్యాంక్‌తోపాటు మంచి సెలక్షన్స్ సాధించి శ్రీచైతన్య ఔన్నత్యాన్ని మరోమారు చాటారు. గతంలో శ్రీచైతన్య ఐఎఎస్ అకాడమీలో ఇంటర్, డిగ్రీలో ఇంటిగ్రేటెడ్ కోర్సు చదివిన భానుశ్రీ లక్ష్మీ గ్రూప్-1 మంది ర్యాంక్ కైవసం చేసుకుని డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపి కవ్వగా, బోడెల సుజిత అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ టాక్స్ ఆఫీసర్‌గా, గోపిశెట్టి మనోహర్ ఆర్‌టీ వోగా, వెల్లప నేని జ్యోతి ఎంపీ డీవోగా, శ్రీసాయి హర్ష ఎంపీడీవోగా, బీ రమ్యకీర్తన(స్టాఫ్) మున్సిపల్ కమిషనర్‌గా సెలక్షన్స్ సాధించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమీలో ఇంటర్, డిగ్రీలలో ఇంటిగ్రేటెడ్ కోర్సు చదివిన విద్యార్థులు గ్రూప్-1లోనూ టాపర్స్‌గా నిలిచి వివిధ సర్వీసులకు ఎంపిక కావటం చాలా సంతోషంగా ఉందని తెలుపుతూ విజేతలకు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

# ఆర్గానిక్ ఆహారం, మానవ సంబంధాలతో హాయిగా జీవించండి : ప్రకృతివనం ప్రసాద్



**పుత్తూరురూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆర్గానిక్ ఆహారం తీసుకోవడం, మానవ సంబంధాలను పెంచుకోవడం ద్వారా హాయిగా జీవితం సాగించాలని ప్రకృతి ఆహార నిపుణులు ప్రకృతివనం ప్రసాద్ సూచించారు. పుత్తూరు ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పుత్తూరులోని అసోసియేషన్ కార్యాలయంలో ప్రకృతి ఆహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రసాద్ మాట్లాడుతూ అవసరమైన వారికి సహాయం చేయడం, మనసుకు నచ్చిన పనులు చేయడం వల్ల హ్యాపి హార్మోన్స్ ఉత్పత్తి అవుతాయని, ఇవి మాసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో దోహదంచేస్తాయని చెప్పారు. పంటల సాగుకు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం కోల్పోయిందని, ఈ ఉత్పత్తుల్లో పోషకాలు ఉండవని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల ద్వారా సహజ సిద్ధంగా పండించిన పంట ఉత్పత్తుల్లోపోషకాలు మెండుగా ఉంటాయన్నారు. మంచి ఆరోగ్యానికి ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. సిరి ధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, అరికెలు, సామలు, కొర్రలు, ఊదలతో ఆహారం తీసుకోవాలన్నారు. గూట్లో దీపం- నోట్లో ముద్ద అన్న చందంగా సాయంత్రం 6 గంటల కల్లా రాత్రి భోజనం పూర్తి చేయాలన్నారు. ఆయా కాలాలకు సంబంధించి సీజనల్ ఫలాలు తీసుకోవాలని, వర్షపు నీటిని ఆల్కలైన్ వాటర్‌గా తయారు చేసుకుని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నైకి చెందిన పారిశ్రామికవేత్త శోభారాజ, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు, కార్యదర్శి పి.కుప్పయ్య, పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ చైర్మన్ కె.శ్రీనివాసరావు, కార్యదర్శి డి.చంద్రమోహన్, ఈసీ సభ్యులు, ఆర్.సి.కె.రాజు, అసోసియేషన్ నాయకులు గుణశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రాజు పాల్గొన్నారు.

# పెన్నహోబిళ క్షేత్రంలో ఉచిత సామూహిక వివాహాలు


శ్రీవారి ఆలయ గోపురంవద్ద నూతన వధూవరులు

### -పైలా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కటైన 42 జంటలు
### జంటలకు కుట్టుమిషన్ల పంపిణీ,
### - హాజరైన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

**ఉరవకొండ, ఆగస్టు 19 ప్రభాతవార్త** అనంతపురం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి సన్నిధిలో స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సరం శ్రావణ తదియ శనివారం ఉచిత సామూహిక వివాహాల సందడి నెలకొంది. పైలా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రమాదేవి దంపతులు నిర్వహించిన ఉచిత సామూహిక వివాహాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 42 జంటలు వేదమంత్రాల సాక్షిగా ఒక్కటయ్యాయి. ప్రధాన ఆలయంవద్ద జరిగిన వివాహ వేడుకలో నిర్వహకులైన పైలా నరసింహయ్య దంపతులు ఫౌండేషన తరపున స్థానిక మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి చేతుల మీదుగా బంగారు తాలిబొట్లు మెట్టెలు, పెళ్లి బట్టలు వధూవరులకు అందించగా వేద పండితుల మంత్రోశ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ వివాహ ఘట్టం పూర్తి అయింది. అనంతరం ప్రతి జంటకు భోగాపురంలోని అల్ట్రాటెక్ సిమెంటు కంపెనీ సౌజన్యంతో కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. పెళ్లిళ్లకు హాజరైన వధూవరుల కుటుంబీకులు, బంధువులకు స్థానిక టీటీడీ కళ్యాణ మండటంలో పెళ్లి భోజనాలు ఏర్పాటు చేశారు. నూతన వధూవరులను ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, అనంతపురం అర్బన్, రాప్తాడు, గుంతకల్లు, శింగనమల ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉర్దూ అకాడమీ ఛైర్మెన్ నదీమ్ అహమ్మద్, రజక కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మెన్ మీసాల రంగన్న, అనంతపురం నగర మేయర్ వసీం. వైసీపీ యువజన విభాగం జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి తదితరులు తరలివచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఉచిత వివాహాల నిర్వాహకులు పైలా నరసింహయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతో సామూహిక వివాహాల కార్యక్రమం నిర్వహించామని ఇక్కడ ఒక్కటైన జంటలు అన్యోన్యంగా జీవిస్తూ ఆనందంగా ఉండాలని లక్ష్మినరసింహస్వామిని ప్రార్థిస్తున్నానన్నారు. ఇతర వక్తలు మాట్లాడుతూ పైలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పైలా నరసింహయ్య బృహత్తరమైన ఎంతో పుణ్యకార్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారని ఆయన సేవా ట్రస్టు ద్వారా చేపట్టే కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మినరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, వైసీపీ ముఖ్య నాయకులు వెన్నపూస రవీంద్రరెడ్డి, రమేష్‌రెడ్డి, వి.ఆర్.రామిరెడ్డి, పామిడి వీరాంజినేయులు, ఎగ్గుల శ్రీనివాసులు, పెన్నోబిళేసు, ధనుంజయ యాదవ్, కృష్ణవేణి, శ్రీదేవి, శోభాబాయి ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# డ్రాపవుట్స్ పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు

### - విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు గుంటూరు కలెక్టర్ ఆదేశం



ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించిన గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

**గుంటూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు జిల్లాలో పాఠశాలల నుంచి డ్రాప్ అవుట్స్ అయిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమష్టిగా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు.. శనివారం ఆయన పాఠశాలల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జిఈఆర్), మధ్యాహ్నభోజనం, నాడు-నేడు పనుల పురోగతిపై ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలలో జీఈఆర్ నూరుశాతం ఉండేలా ప్రధానోపాధ్యాయులు ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నత పాఠశాల్లోని విద్యార్థుల్లో ఎక్కువ మంది రక్తహీనతతో ఉన్నట్టు వైద్యారోగ్యశాఖ నిర్వహిస్తున్న వైద్యపరీక్షల్లో గుర్తించారరని, పాఠశాలల్లో ప్రతిరోజు మధ్యాహ్నం అందించే జగనన్న గోరుముద్ద పౌష్టికాహారం విద్యార్థులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా మంజూరుచేసిన విద్యుత్, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్లు , అదనపు తరగతి గదుల నిర్మాణం పెండింగ్ పనులు వెంటనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తయిన పనులకు నిధుల మంజూరు కోసం బిల్లులను పెండింగ్ లేకుండా ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి శైలజ, ఎపిసి సమగ్ర శిక్ష ఎపిసి జి విజయలక్ష్మి, డిప్యూటీ డిసిఓలు వెంకటేశ్వరరావు, నిర్మాలాదేవి, సమగ్ర శిక్ష ఇఇ నాగజ్యోతి, ఏఇ శ్రీనివాసరావు, ఎంఇఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాహూల్‌గాంధీతోనే నా ప్రయాణం

### తప్పుడు ప్రచారాలు కాంగ్రెస్‌లో టిడిపి కల్చర్ : సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 19,ప్రభాతవార్త:** నా రాజకీయ ప్రయాణం కాంగ్రెస్ అది నాయకుడు రాహూల్‌గాంధీతోనే తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తనపై తప్పుడు వార్తలు రాస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో తనపై దుష్ప్రచారం జరుగుతోందని ఈ సాంప్రదాయం బాగోలేదని ఆయన ఆవేదన చెందారు. శనివారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో జగ్గారెడ్డి ఉండద్దా? ఇది ఎవరిదైనా వ్యూహమా? జగ్గారెడ్డి కాంగ్రెస్‌ల ఉండద్దని ఎవరు ప్రచారం చేస్తున్నారు. మా క్యారెక్టర్‌ను ఎందుకు తప్పుగా ప్రచారం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. జగ్గారెడ్డి పార్టీనుంచి పోతుండని ప్రచారం చేసి మీడియాలో పెట్టడానికి ఎవరు డబ్బులు ఇస్తున్నారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. నేను వీటికి సంజాయిషీ చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఆధారాలు లేకుండా సోషల్ మీడియాలో మాట్లాడితే నడిరోడ్డు మీద బట్టలు ఇప్పి నిలబెడుతా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇపుడున్న లీడర్లలో సోషల్ మీడియా ఎక్స్పర్ట్ ఎవరు ఇదంతా టిడిపి కల్చర్. ఇదంతా టిడిపి నుంచి వచ్చిందే. మా పార్టీలోకి ఏ పార్టీవాళ్ళు వచ్చినా కాంగ్రెస్‌వాళ్ళే . ఈ రోజు పిసిసి సమావేశం అది డైరెక్షన్ మీటింగ్ నేను పిఎసి, పిఈసి సమావేశాకు అటెండ్ అవుతున్నా. నామీద అబద్దపు ప్రచారం చేసే మూర్ఖులు దద్దమ్మలు వీటిని బంద్ చేయాలి. 19 సంవత్సరాలకే నేను మునిసిపల్ లీడర్‌ను అయ్యాను. జగ్గారెడ్డి పేరు తగ్గించాలని వార్తలు వేస్తే డ్యామేజి జరుగుతుందని చూస్తున్నారు. బిఆర్ఎస్‌లోకి రావద్దని సంగారెడ్డిలో నిరసన తెలుపుతున్న వారంతా నా దగ్గర నుంచి పోయినోళ్లే వాళ్ళను లీడర్‌లుగా మలిచింది నేనే. ముఖ్యమంత్రిని మంత్రులను కలవద్దా వినతి పత్రాలు ఇచ్చి ఫండ్స్ అడుగద్దా ఇదేం సాంప్రదాయం అని ఆయన అన్నారు. రాహూల్ గాంధీతో సంగారెడ్డికి కార్యక్రమం పెట్టి ఆహ్వానిస్తాను. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం అని 50 సీట్లలో బలమైన అభ్యర్థులు వున్నారని ఆయన తెలిపారు. 30 సీట్లలో సెండ్ పొజిషన్‌లో వున్నామని గట్టి ప్రయత్నం చేస్తే మొదటి స్థానంకు చేరుకోవచ్చని ఆయన అన్నారు. ఒక్కసారి కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని ఆయన కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ బి ఆర్ ఎస్ రెండు మాత్రమే వున్నాయి. ఒకపుడు హరీశ్‌రావు కూడా బి ఫారమ్ అమ్ముకొన్నారని అన్నారు.

# ప్రతిష్టాత్మకంగా 48వ అఖిలభారత సంగీత నృత్య వారోత్సవాలు ప్రభుత్వ సలహాదారు కెవి.రమణాచారి

**హైదరాబాద్ (నాంపల్లి), ఆగస్టు 19, ప్రభాతవార్త :** 1958లో ప్రముఖులు వేమరాజు నరసింహారావు చేత ప్రారంభింపబడి వారి పిదప వేమరాజు విజయకుమార్ గత ఆరున్నర దశాబ్దాలుగా ఆయన ఆశయాలను ప్రతిఫలించేరీతిలో కార్యక్రమాలను చేపడుతుండడం అభినందించదగ్గ విషయమని, జాతీయ సమైక్యతను కాపాడుతూ అచల భారత స్థాయిలో సంగీత నృత్య పోటీలు-ప్రదర్శనలు నిర్వహిస్తూ గొప్ప చరిత్ర సృష్టించిన నవ్యనాటక సమితి, ఈ నెల 26 శనివారం నుండి సెప్టెంబరు 2 శనివారం వరకు ప్రతిష్టాత్మకంగా 48వ అచల భారత సంగీత నృత్య పోటీల వారోత్సవాలను నిర్వహిస్తుందని శనివారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి తెలిపారు. ఈ సందర్భంగా డా. కె.వి.రమణాచారి నవ్యనాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, జి.వసుంధర, సుధామాల తదితరులతో కలిసి సంగీత నృత్యోత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించి ప్రసంగిస్తూ 8రోజులపాటు 3 విభాగాలుగా సంగీతంలో కర్ణాటక, హిందూస్థానీ; నృత్యాల్లో భరతనాట్యం, కూచిపూడి, ఆంధ్రనాట్యం, కథక్‌లలో జరిగే ఈ సంగీత నృత్య పోటీలకుగాను జాతీయస్థాయిలో 4వందలకుపైగా దరఖాస్తులు రావడం ఒక రికార్డ్ అని, అకిల భారత స్థాయిలో ఉభయ తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలతోపాటు న్యూఢిల్లీ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, చత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుండి కళాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ ఉత్సవాలు ఈ నెల 26న ఉదయం 10గంటలకు తిలక్‌రోడ్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవుల పల్లి రామానుజరావు కళామందిరంలో ప్రఖ్యాత కూచిపూడి నృత్యకళాకారిణి, పద్మభూషణ్ డా. స్వప్నసుందరి (న్యూఢిల్లీ) ప్రారంభి స్తారని, నృత్య కార్యక్రమాలు ఇక్కడ, సంగీత కార్యక్రమాలు సుల్తాన్‌బజార్, కోఠిలోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలో జరుగుతాయని వివరించారు. సెప్టెంబరు 2 రవీంద్రభారతిలో 48వ అఖిల భారత సంగీత నృత్యోత్సవాల ముగింపు సమావేశాలు జరుగుతాయని డా. కె.వి.రమణాచారి తెలిపారు.

# కమీషన్ ఇచ్చిన వారికే బిఆర్ఎస్ పథకాలు



డబుల్‌బెడ్ ఇళ్ల నిరసన ధర్నాలో ప్రసంగిస్తున్న ఎంపి కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు శ్రీవాణి, చేతన తదితరులు

- ఎంపి, ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్

**హైదరాబాద్ (ఉప్పల్), ఆగస్టు 19, ప్రభాతవార్త :** ఎన్నికల సమయంలోనే సిఎం కెసిఆర్‌కు ప్రజలు గుర్తుకు వస్తారని, సాధ్యం కాని హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని బిజెపి రాజ్యసభ సభ్యుడు, ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రామంతాపూర్‌లో అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల నిరసన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్, మంత్రి కేటిఆర్ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ఎన్నికల పేరుతో వస్తున్నారని, గతంలో ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీయాలని కోరారు. గృహలక్ష్మి, బిసి,దళితబంధు పథకాలు ప్రతి నియోజకవర్గంలో పది మందికి కూడా ఇవ్వలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిపొందాలంటే బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు 30 శాతం కమీషన్ ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా బిజెపి పోరాటం చేస్తుందన్నారు. కుల వృత్తులను గతంలో పట్టించుకోలేదని, కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు.

సిఎం కెసిఆర్‌ను ప్రజా కోర్టులో దోషిగా నిలబెడుతామన్నారు. మంత్రులను ఘెరావ్ చేస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం లంచం ఇచ్చిన వారికే పథకాలు ఇస్తున్నారని, బిఆర్ఎస్‌లో ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెప్పడం తగదన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన,అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, చింతోజు శ్రీనివాసాచారి, డివిజన్ అధ్యక్షులు బండారు వెంకట్రావ్, కక్కిరేణి హరీష్, మహంకాళి లక్ష్మణ్, రెవల్లి రాజు, మార్నెని ఫణీందర్, ఆర్. దేవేందర్‌రెడ్డి, గోనె శ్రీకాంత్, మల్క ప్రకాష్, సీనియర్ నాయకులు బొంగు రమేష్‌గౌడ్, ఎంపాల పద్మారెడ్డి, సింగారం కార్తీక్, జాజుల నగేష్‌గౌడ్, చెల్లోజు ఎల్లాచారి, కుమారస్వామి, నారాయణదాసు, నాథం, రమేష్‌యాదవ్, వినోద్, పి.గోపాల్‌గౌడ్, రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## సినిమా చూపించేది నాయకులు కాదు.. ప్రజలు

### ఎన్నికలు వచ్చినప్పుడు జనమే చూపిస్తారు

### ఎమ్మెల్యే ఈటల రాజేందర్



శనివారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** సినిమా చూపించేది నాయకులు కాదు ప్రజలు అని, రేపు ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజలు చూపిస్తారని బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. కెసిఆర్ ఏలుబడిలో గిరిజన, దళిత మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అన్ని రంగాలలో తెలంగాణ నెంబర్ వన్ అంటూ కెసిఆర్ బుకాయిస్తున్నాడన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసు స్టేషన్‌లు భయపెట్టిస్తున్నాయి. గిరిజన మహిళపై జరిగిన దాడి చూసి తెలంగాణ సమాజం సిగ్గుతో తలదించుకుంటుందన్నారు. షీ టీమ్స్ పెట్టినం అన్ని చెప్తున్నారు. అర్ధరాత్రి కూడా స్వేచ్ఛగా తిరగవచ్చు అనిన చెప్పారు. కానీ ఎల్‌బినగర్‌లో కూతురు పెళ్లి కోసం వెళ్తున్న మహిళను పోలీసులే తీసుకుని వెళ్లి చిత్రహింసలు పెట్టారని, క్యారెక్టర్ లేని మహిళగా చిత్రీకరిస్తున్నారన్నారు. ఆమెను కొట్టిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిఎం కెసిఆర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలపై సమాధానం చెప్పాలన్నారు. చెప్పరాని చోట్ల కొట్టిన తీరుపై స్పందించాలన్నారు. ఉద్యోగుల మీద చర్యలు తీసుకొని చేతులు దులుపుకుంటే సరిపోదన్నారు. మరియమ్మ అనే దళిత మహిళలను యాదాద్రి భువనగిరి పోలీసులు కొట్టి చంపారన్నారు. దళిత, గిరిజన మహిళలపై జరుగుతున్న సంఘటనలపై న్యాయ విచారణ జరిపించాలన్నారు. పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, ప్రభుత్వం భేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. సిఎం సొంత జిల్లా గజ్వేల్‌లో దళితబంధు, డబుల్‌బెడ్‌రూం ఇండ్ల కోసం రోడ్డు ఎక్కుతున్నారన్నారు. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులను పెట్టి అరెస్టు చేయించారన్నారు. పోలీసులతో ఎన్నాళ్లు రాజ్యం నడిపిస్తాని ప్రశ్నించారు. ఈసమావేశంలో సీనియర్ నేతలు ప్రకాష్‌రెడ్డి, కప్పర ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## వచ్చే నెల షాద్‌నగర్‌లో బిసి గర్జన

### బిసిలకు జనాభా ప్రాతిపదికన సీట్లు ఇవ్వాలి

### రేవంత్‌కు ఏం జరిగినా ప్రభుత్వమే మూల్యం చెల్లించుకోవాలి: మాజీ ఎంపి విహెచ్

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త :** తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో బిసిలకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని మాజీ ఎంపి మాజి పిసిసి అధ్యక్షుడు వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో శనివారం విలేఖరులతో హన్మంత రావు మాట్లాడుతూ సెప్టెంబర్‌లో షాద్‌నగర్‌లో బిసిగర్జన బహిరంగసభ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. కర్నాటక సిఎం సిద్దరామయ్య హాజరుకాబోయే ఈ బహిరంగసభకు మూడు లక్షల పైచిలుకు జనసమీకరణ చేయబోతున్నామని ఆయన తెలిపారు. బిసి జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయింపు ఉంటుంది అని గతంలో రాహూల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే మాట ఇచ్చారు. తెలంగాణ లో బిసిలు 54శాతం ఉన్నారు. సెప్టెంబర్ 6 లేదా 9వ తేదీల్లో ఈ బహిరంగ సభను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సభవల్ల కాంగ్రెస్‌కు అత్యంత లాభకరంగా వుండబోతుంది. ఎన్నికలు వస్తుండటతో ఎక్కడ చూసినా నల్లాలు తవ్వేశారు. టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి సెక్యూరిటీ బిఆర్ఎస్ ప్రభుత్వం తొలగించడం దారుణం. ఆయనకు ఏం నష్టంజరిగినా రాష్ట్రప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వుంటుందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి ప్రజల మధ్య తిరుగతారు లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తితే ప్రభుత్వందే బాధ్యతల. బిఆర్ఎస్ బిజెపి రెండూ ఒకటేనని ఆయన తెలిపారు.

## పిడిఎస్ రీసైక్లింగ్‌పై ఉక్కుపాదం

### సిఎంఆర్‌లో పిడిఎస్ పట్టుబడితే కఠినచర్యలు

### జిల్లా అధికారుల సమీక్షలో చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** జిల్లాలో పిడిఎస్ రైస్ అక్రమ దందాను అరికట్టాలని, సిఎంఆర్ డెలివరిలో రీసైక్లింగ్ చేసిన మిల్లర్లపై క్రమినల్ కేసులు నమోదు చేయాలని పౌరసరఫరాల శాఖ చైర్మన్ సర్ధార్‌రవీందర్‌సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ములుగు, మంచిర్యాల, ఆసిఫాబాద్, జగిత్యాల జిల్లా అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. సిఎంఆర్ కోసం రైస్ మిల్లర్లకు పౌరసరఫరాల సంస్థ కేటాయించిన ధాన్యాన్ని పలువురు మిల్లరు అమ్ముకున్నా, ఎవరైనా కొనుగోలుచేసిన నేరేమేనని అన్నారు. అమ్మిన, కొనుగోలు చేసిన ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయా లన్నారు. రైస్ మిల్లర్ల నుంచి కస్టమ్స్ మిల్లింగ్ రైస్ సేకరణలో రీ సైక్లింగ్‌లో పాల్పడిన మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. నాణ్యత విషయంలో మిక్స్ ఇండికేటర్ టెస్ట్ తప్పరిసరి చేయాలని, ప్రతి కన్‌సైన్‌మెంట్‌లో 580 బ్యాగులు సాంపిల్ డ్రా చేసి నాణ్యత పరీక్షలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో అదే స్థాయిలో మంచి నాణ్యమైన బియ్యం పంపిణీలో కూడా అంతే ప్రాధాన్యతను ప్రదర్శించాలన్నారు.

## రుణమాఫీతో రైతన్న మోములో చిరునవ్వు

- రైతు బాంధవుడు సిఎం కెసిఆర్
- ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



రైతులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**అచ్చంపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రైతన్న మోములో చిరునవ్వును చూసేందుకు బ్యాంక్‌లో పట్టా పాసు పుస్తకాలు తాకట్టు పెట్టి వ్యవసాయ సాగు కోసం తెచ్చుకున్న రుణాలను ఏకకాలంలో లక్ష వరకు రుణమాఫీ చేసి రైతన్నకిచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబాంధవుడని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కొనియాడారు. శనివారం వంగూరు మండల కేంద్రంలోని ఐఓబీ బ్యాంక్‌ను సందర్శించి రుణాలు మాఫీ అయ్యాయా కాలేదా అని తెలుసుకోవడానికి బ్యాంక్‌కు వచ్చిన మండల రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా రైతులు సీఎం సార్ రుణమాఫీ చేసి మమ్మల్ని ఆదుకున్న దేవుడని ఎమ్మెల్యే గువ్వలతో రైతులు చెప్పారు. రానున్న రోజుల్లో కూడా కేసీఆరే ముఖ్యమంత్రి కావాలని, ఆయన ఉంటేనే మాలాంటి పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ నాగరమేష్‌తో గువ్వల నేటివరకు ఎంత బడ్జెట్ వచ్చిందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. శనివారం వరకు రూ.8కోట్ల రుణమాఫీ అయ్యాయన్నారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బ్యాంక్ మేనేజర్‌ను రైతులతో కలిసి సన్మానించారు. గువ్వల బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, రైతన్న మోములో చిరునవ్వు చూసేందుకు ప్రతినిత్యం రైతు బిడ్డకు సిఎం కేసీఆర్ రైతులకు ఎలాంటి కష్టాలు లేకుండా నేరవేర్చేందుకు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసమే అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమమ్మ, పీఎసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు హామీద్, కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మందా రాజేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### 'దళిత బంధు' కోసం రూ.17,700 కోట్లు

**హైదరాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీల సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. వారిని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోంది. ఎస్సీ కులాలను సామిజక వివక్ష నుండి దూరం చేయడంతో పాటు, వారి ఆర్థిక స్వావలంబనను కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఒక ప్రకటనలో వీటి వివరాలను తెలిపింది. దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోంది. తిరిగి చెల్లించనవసరం లేకుండా ఎటువంటి హామీలు లేకుండా ప్రభుత్వమే 10 లక్షల రూపాయల గ్రాంటును ఉచితంగా అందచేస్తోంది. అర్హత కలిగిన 38,323 మంది దళితులను గుర్తించి 3,832.30 కోట్ల రూపాయలను అందించింది. ఈ పథకానికి ఈ ఆర్థిక సంవత్సరంలో 17,700 కోట్ల రూపాయలను కేటాయించింది. ఏదైనా



అనుకోని సందర్భాల్లో లబ్దిదారులు నష్టాలకు గురిఅయితే వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం తరపున 10 వేల రూపాయల కంట్రిబ్యూషన్‌తో రక్షణ నిధిని ఏర్పాటు చేసింది. అలాగే ఎస్సీ ప్రత్యేక ప్రగతి నిధి కింద ఎస్సీ, ఎస్టీ జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపునకు చట్టబద్ధత కల్పించింది. ఈ పథకం కింద 2014 నుండి ఇప్పటి వరకూ 92,640.41 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. ఇక ఆర్థిక చేయూత కింద లక్ష రూపాయల నుండి 12 లక్షల రూపాయల వరకూ రుణంన్ని 60 నుండి 80 శాతం వరకూ రాయితీని ప్రభుత్వం కల్పిస్తోంది. ఇందుకు ఈ తొమ్మిదేళ్లలో 1,62,444 మందికి 2,029.78 కోట్ల రూపాయలను సబ్సిడీగా అందించింది. ఎస్సీ హాస్టళ్లలో 6,11,716 మంది విద్యార్థుల నిర్వహణ కోసం 2014 నుండి ఇంత వరకూ 1,976.91 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కింద దళిత, గిరిజన విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువుల నిమిత్తం 20 లక్షల రూపాయల సహాయాన్ని అందిస్తోంది. 9 ఏళ్లలో 1,031 మందికి 179.92 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. ఎస్సీల వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు గాను 21,653 మందికి 91.83 కోట్లను వ్యయం చేసింది. భూమిలేని దళిత మహిళలకు 3 ఎకరాల చొప్పున 17,097.09 ఎకరాలు 6,998 మందికి 769.17 కోట్ల రూపాయల ఖర్చుతో పంపిణీ చేసింది. అలాగే 1,60,914 మంది ఎస్సీలకు ఉపాధి కల్పించే నిమిత్తం 2,013.64 కోట్ల రూపాయల రాయితీలు కల్పించి వారిని పారిశ్రామిక వేత్తలుగా చేసింది. మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు అమలు చేస్తోంది. టిఎస్ ప్రైడ్ కింద పారిశ్రామిక రంగంలో మౌలిక వసతుల కల్పనకు 60,904 మందికి 2,747 కోట్ల రూపాయల మేర పెట్టుబడి రాయితీలను అందించింది. ఇక ప్రతీ దళితుని ఇంటికి 101 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఈ విధంగా ఇంత వరకూ 22,23,475 దళిత గృహాలకు 284.13 కోట్ల రూపాయల ఖర్చు చేస్తోంది. ఎస్సీల విద్యుత నిమిత్తం ప్రత్యేక గురుకులాలు, రెస్సిడిన్షియల్ స్కూళ్లు, కాలేజీలు, డిగ్రీ కాలేజీలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసింది. 26,68,397 మంది ఎస్సీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ కింద ఇంత వరకూ 3,762.22 కోట్ల రూపాయలు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 5,78,417 మందికి 368.06 కోట్ల రూపాయలను పంపిణీ చేసింది. అంతేకాకుండా స్టడీ సర్కిళ్ల ద్వారా వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా సంక్షేమ విద్యార్థులు తమ సత్తా చాటుతున్నారు. ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థలో 10వ తరగతి ఉత్తీర్ణతా శాతం 95.50 శాతం, ఇంటర్‌లో 89.04 శాతంతో అగ్రస్థానంలో ఉన్నాయి. మరోపక్క రాష్ట్రంలో అంబేద్కర్ భవనాలు, విగ్రహాలను ఏర్పాటు చేస్తోంది. 2014 నుండి ఇప్పటి వరకూ రాష్ట్రంలో 140 కోట్ల రూపాయల ఖర్చుతో 910 ఎస్సీ కమ్యూనిటీ హాళ్లను నిర్మించింది. భవన్‌లు, విగ్రహాల ఏర్పాటుకు అమోదం తెలుపుతూ 368.27 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. వీటిలో 96 పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. 40 కోట్ల రూపాయలతో చేపట్టిన మరో 319 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా 11.6 ఎకరాల్లో 146.50 కోట్ల రూపాయలు ఖర్చు చేసి దేశంలోనే అతి పెద్దదైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. అలాగే అంబేద్కర్ పేరును రాష్ట్ర సచివాలయానికి పెట్టడం ద్వారా పాలనలో దేశానికి ప్రేరణగా నిలుస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ భావించారు.

## అమ్మకానికి 25 లక్షల టన్నుల ధాన్యం

### దాదాపు రూ.5 వేల కోట్ల రెవెన్యూ

### సర్కార్‌కు ఉన్నతాధికారుల కమిటీ ప్రతిపాదన

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** యాసంగి ధాన్యం విక్రయించేందుకు తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకోనుంది. యాసంగి సీజనులో రైతుల నుండి సేకరించిన ధాన్యంలో 25 లక్షల టన్నులను వేలం వేసేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు గ్లోబల్ టెండర్లను అహ్వానించడం ద్వారా ధాన్యాన్ని విక్రయించనుంది. తద్వారా దాదాపు 5 వేల కోట్ల రూపాయల వరకూ ప్రభుత్వానికి ఆదాయం సమకూరనున్నట్లు అంచనా. ఈ మేరకు నియమించిన ఉన్నతాధికారుల కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ధాన్యం అమ్మే విషయంలో ప్రభుత్వం ఇటీవల ఒక కమిటీని వేసింది. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్ఐఐసీ ఎండి ఇవి నర్సింహారెడ్డి, పౌరసరఫరాల కమిషనర్ అనిల్‌కుమార్ ఉన్నారు. ఈ కమిటీ చేసిన ప్రతిపాదనలు ఇప్పటికే ఆర్థిక శాఖకు చేరాయి. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం నుండి పరిపాలన అనుమతులు త్వరలో రానున్నట్లు సమాచారం. కాగా ప్రభుత్వం సేకరించిన ధాన్యంలో అత్యధికంగా రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో 66.85 లక్షల టన్నులు మిల్లర్ల వద్ద నిల్వ ఉన్నాయి. అలాగే నిజామాబాద్ జిల్లాలో 6.35 లక్షల టన్నులు, జగిత్యాల జిల్లాలో 4.21 లక్షల టన్నులు, కొత్తగూడెం జిల్లాలో 4.12 లక్షల టన్నుల మేర ధాన్యం నిల్వలు ఉన్నట్లు అంచనా.

## కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- సిఎం కెసిఆర్‌కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని సీపీఐఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకి సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు తమ సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని 2023 ఆగస్టు 15 నుంచి సుమారు 6 వేల మంది సమ్మె చేస్తున్నారని అన్నారు. వైద్యరంగంలో కేంద్ర, రాష్ట్రస్కీమ్‌లను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో శిశు మరణాలను తగ్గించడంలో కేసీఆర్ కిట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడం, ఇమ్యూనైజేషన్, ఫ్యామిలీ ప్లానింగ్ వంటి పనుల్లో వారి కృషి ఉన్నదని.. వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని లేఖలో కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 1520 ఎంపిహెచ్ఎ(ఎఫ్) పోస్టులను రాతపరీక్ష ద్వారా భర్తీ చేస్తున్నట్టు 2-2023 నోటిఫికేషన్‌ను ఇచ్చింది. ఇప్పటికే కాంట్రాక్ట్ సర్వీసెస్‌లో పనిచేస్తున్న వారిక సర్వీస్ వెయిటేజీ క్రింద 20 మార్కులిస్తామని, మిగతా మార్కుల కోసం పరీక్ష నిర్వహిస్తామని, వయస్సు పరిమితి 44 సంవత్సరాలతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితరులకు 5 ఏళ్ల సడలింపు ఇస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని గుర్తు చేశారు. గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న 49 సంవత్సరాలు నిండి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 2వ ఏఎన్ ఎంలు ఈసీ ఏఎన్ఎం, అర్బన్‌హెల్త్ సెంటర్స్ ఏఎన్ఎం, హెచ్ఆర్‌డీ ఏఎన్ఎం, 104 ఏఎన్ఎంలుగా ఉన్న సుమారు 6వేల మందిలో అత్యధికులు నష్టపోతున్నారని వీరంతా డీఎస్‌సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపికై సేవలందిస్తున్నారని తెలిపారు. వీరికి తిరిగి పరీక్ష నిర్వహించడం సరైంది కాదని తమ్మినేని సీఎంకి రాసిన లేఖలో పేర్కొన్నారు. వారందరినీ యథావిధిగా రెగ్యులరైజ్ చేయాలని లేఖలో కోరారు. ఇప్పటికే కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్లను మెరిట్ ఆధారంగా వెయిటేజీ ఇచ్చి రెగ్యులరైజ్ చేశారని గుర్తు చేశారు. వివిధ శాఖల్లోనూ 5వేలకుపైగా కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేశారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ 20-2023ను రద్దు చేసి 20 ఏళ్లుగా సేవలంధిస్తున్న కాంట్రాక్ట్ ఎంపీ హెచ్ఏ(ఫిమేల్) లను రెగ్యులరైజ్ చేయాలని సీఎంకి రాసిన లేఖలో తమ్మినేని వీరభద్రం కోరారు.

## నా మాటలను వక్రీకరించారు

### బిజెపి సీనియర్ నేత మురళీధర్‌రావు



**హైదరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** సిఎం కెసిఆర్‌పై తాను చేసిన మాటలను వక్రీకరించారని బిజెపి సీనియర్ నేత మురళీధర్ రావు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లా డారు. యువకులు కెసిఆర్ ప్రభు త్వంపై తీవ్రస్థాయిలో అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. బిజెపి యువత మీద దృష్టి పెట్టాలని సూచించారు. యువకులే కెసిఆర్ ప్రభుత్వాన్ని ఓడించేది అన్నారు. కెసిఆర్ వైఫల్యాలపై దృషిపెడితే కెసిఆర్‌ను ఓడించడం ఈజీ అన్నారు. ఇప్పటికే బిజెపి డబుల్ బెడ్ రూం ఇండ్ల సమస్యపై బిజెపి పోరాటం చేస్తుందన్నారు. 2014లో 2018లో కాంగ్రెస్ పార్టీని ప్రతిపక్షం అనుకుని ప్రజలు ఓటు వేశారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన, బిఆర్ఎస్‌కు వేసినట్లే అన్నారు. అందుకే బిఆర్ఎస్‌కు బిజెపి మాత్రమే ప్రత్యామ్యాయ పార్టీ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకుని ఆయా రాష్ట్రాలకు వెళ్లి కెసిఆర్ షో చేశాని వ్యాఖ్యలు చేశారు. జాతీయ స్థాయిలో కెసిఆర్ తిరుగుతున్నప్పుడు కర్ణాటక ఎన్నికలకు జరుగుతున్నప్పుడు ఎందుకు పోలేదని ప్రశ్నించారు. మహారాష్ట్రకు పోతున్నారని, జాతీయ పార్టీగా అవతరించిన తరువాత బిఆర్ఎస్ వైఫల్యం స్పష్టంగా కనపడుతోందన్నారు.

## సిఐడిలో ఎన్‌బిడబ్ల్యు వారెంట్ల అమలు బృందాలకు అభినందన

**హైదరాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** రాష్ట్ర సిఐడి విభాగంలో నాన్ బెయిలబుల్ వారంట్ల అమలు బృందాలను ఆ విభాగం చీఫ్ మహేష్ భగవత్ శనివారం నాడు త న కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు. సిఐడి విభాగం విచారిస్తున్న కేసుల్లో నిందితులుగా వుండి సుదీర్ఘకాలంగా పరారీలో వున్న వారిని పట్టు కునేందుకు గత ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు 88 ఎన్‌బిడబ్ల్యు వారంట్లను సిఐడి అధికారుల బృందాలు పరిశీలన చేశాయి. ఇందు కోసం ఎస్‌పి రాంరెడ్డి నేతృత్వ ంలో ఏడు బృందాలు పనిచేయసాగాయి. ఈ ఏడు బృందాలు దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో పర్యటించి పరారీలో వున్న నిందితులపై జారీ అయిన ఎన్‌బిడబ్ల్యు వా రంట్లను అమలు చేశాయి. ఈ సందర్భంగా 30 ఏళ్ల వరకు పరారీలో వున్న నేరగాళ్ల వరకు మొత్తం 16 మందిని అరెస్టు చేసి జైళ్లకు తరలించగా ఎనిమిది మంది నేర గాళ్లు చనిపోవడంతో వారికి సంబంధించిన మరణ ధృవీకరణ పత్రాలను సేకరించి కోర్టులకు ఇవ్వడం జరిగింది. ఇదే సమయంలో 17 ఏళ్లుగా పరారీలో వున్న ఐదుగు రు నేరగాళ్ల సిఐడి ఎన్‌బిడబ్ల్యు వారంట్ల అమలు బృందాలకు భయపడి కోర్టుల్లో లొంగిపోయారు. కాగా ఎన్‌బిడబ్ల్యు వారంట్ల అమలు బృందాలకు ఇన్‌స్పెక్టర్లు శివరా వు, రాజేశ్వర్, ప్రసాద్, నాగార్జున, మురళీకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, ఏఎస్ఐ యూనిస్ ఖాన్‌లు నేతృత్వం వహించగా వీరికి తోడుగా 27 మంది సిబ్బంది వున్నా రు. కాగా ఎన్ బిడబ్ల్యు వారంట్ల అమలు బృందాలను సిఐడి చీఫ్ మహేష్ భగవత్ అభినందించడంతో పాటు రివార్డులు అందించారు.

## గిరిజన మహిళ లక్ష్మీబాయికి న్యాయం చేయాలి

- బిజెపి ఎమ్మెల్యే రఘునందన్‌రావు

**హైదరాబాద్ (సైదాబాద్), ఆగస్టు 19, ప్రభాతవార్త:** పోలీసుల చేతిలో తీవ్రంగా గాయపడి కర్మన్‌ఘాట్‌లోని ప్రైవేటు ఆసుపత్రితో చికిత్స పొందుతున్న లక్ష్మీబాయిని శనివారం బిజెపి ఎమ్మెల్యే రఘునందన్‌రావు పరామర్శించారు. సంఘటన గురించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనం తరం ఆయన మీడియాతో మాట్లాడుతూ లక్ష్మీబాయి పట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని అన్నారు. ప్రతి చిన్న విషయంపై ట్విట్టర్‌లో స్పందించే కెటిఆర్ ఈ విషయంలో ఎందుకు స్పందిం చడం లేదని ప్రశ్నించారు. బాధితురాలికి బిజెపి అండగా ఉంటుం దన్నారు. మహేశ్వరం నియోజక వర్గానికి చెందిన మహిళ పట్ల అమానుష సంఘటన జరిగినా మంత్రి సబితాఇంద్రారెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జరిగిన అమానుష సంఘటనపై మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్ స్పందించాలన్నారు. మహిళ అని చూడకుండా అర్ధరాత్రి ఎలా అరెస్టు చేస్తారని ఆయన మండిపడ్డారు. రక్షించవలసిన వారే భక్షిస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. గిరిజనులు, మహిళల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు ఇంత వివక్ష అని అన్నారు. గిరిజన మహిళపై అమానుష దాడికి ఇద్దరినే కారకులను చేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. బాధితురాలికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, బాధితురాలి కూతురు పెళ్లికి ప్రభుత్వ సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మహేశ్వరం బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న బిజెపి ఎమ్మెల్యే రఘునందన్‌రావు

**జనసేన నాయకుల పరామర్శ..**

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీబాయిని జనసేన నగర అధ్యక్షుడు రాజలింగం, ఎల్‌బినగర్ ఇన్‌ఛార్జి శిరీషలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన మహిళ లక్ష్మీభాయిపై దాడికి పాల్పడిన పోలీసులను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు.

**బాధితురాలిని పరామర్శించిన విహెచ్..**

కర్మన్‌ఘాట్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన మహిళ లక్ష్మీబాయిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హన్మంతరావు పరామర్శించారు. బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అయినా మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ లేదన్నారు. గిరిజన మహిళను పోలీసులు విచక్షణా రహితంగా కొట్టడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ బాధితురాలికి అండగా ఉంటుందన్నారు. బాధితురాలికి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. విహెచ్ వెంట చల్లా నర్సింహారెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మళ్లీ సన్‌రైజర్స్‌జట్టులోకి కేన్‌విలియమ్సన్

**చెన్నై:** సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలిమ్సన్‌ను మళ్లీ జట్టులోకి తీసుకువస్తున్నారు. 2022 వరకూ సన్‌రైజర్స్‌కు ఆడిన కేన్ విలియమ్సన్‌ను సీజన్‌కుముందు కావ్యమారన్ వదిలేసింది. ఐపిఎల్ 2022 సీజన్‌లో జట్టు వైఫల్యానికి ఆతడిని కారణంగా భావించి సన్‌రైజర్స్ వేటువేసింది. హెడ్‌కోచ్‌బ్రియాన్ ఆలారాపై వేటువేసిన కొత్తకోచ్ న్యూజిలాండ్ దిగ్గజం డేనియల్ వెటోరీని నియమించింది. జట్టులోను, సహాయక సిబ్బందిలోకూడా మార్పులుచేస్తోంది. ఇక ఐపిఎల్ మినీ వేలం కోసం వెటోరీ బ్లూప్రింట్ సిద్ధంచేస్తున్నాడు. ముందు జట్టులోని ఆటగాళ్లను పరిశీలిస్తున్న వెటోరీ వివిధటోర్నీల్లో వారి ఆటతీరుపైనా పరిశీలిస్తున్నాడు. 2023మినీ వేలంలో తక్కువధరకే అందుబాటులో ఉన్నా తీసుకోలేదు. దాంతో గుజరాత్ టైటాన్స్ కేన్ విలిమ్సన్‌ను రెండుకోట్ల కనీసధరకే కొనుగోలుచేసింది. అయితే ఆతడు తొలిమ్యాచ్‌లోనే బౌండరీలైన్‌వద్ద క్యాచ్ అందుకునేక్రమంలో తీవ్రంగా గాయపడ్డాడు. కాలు విరగడంతో ఐపిఎల్‌తోపాటు అంతర్జాతీయ క్రికెట్‌కు దూరం అయ్యాడు. ఇపుడు భారత్‌లోజరిగే వన్డే వరల్డ్‌కప్‌తో రీ ఎంట్రీ ఇస్తున్నాడు.



## రెండో టి20కి బుమ్రా టీమ్ రెడీ

### నేడు ఐర్లాండ్‌వర్సెస్ టీమిండియా మ్యాచ్

**డబ్లిన్:** ఐర్లాండ్‌పర్యటనను తొలి విజయంతోప్రారంభించిన భారత్ మరో ఆసక్తికరపోరుకు సిద్ధం అవుతోంది. ఆదివారం జరిగే రెండో టి20లో ఆతిథ్య ఐర్లాండ్‌తో పోటీపడుతోంది. తొలి టి20 విజయంతో జోరుమీదున్న బుమ్రా టీమ్ అదే పట్టుతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసంచేసుకోవాలనుకుంటోంది. మరోవైపు రెండో మ్యాచ్‌లోనైనా గెలిచి సిరీస్ అవకాశాలు సజీవంగా ఉంచుకోవాలని ఐర్లాండ్ భావిస్తోంది. తొలి టి20కి వర్షం అంతరాయం కలిగించి మ్యాచ్‌ఫలితం డక్‌వర్త్‌లూయిస్ ప్రకారం తేల్చారు. మెరుగైన బౌలింగ్‌ప్రదర్శనతో పాటు ఓపెనర్లు సత్తా చాటడంతో టీమిండియా రెండుపరుగుల తేడాతో విజయంసాధించింది. ఆసియాకప్‌ముందు మెరరగైన ప్రదర్శన చేయాలనుకున్న బ్యాటర్లకు నిరాశే ఎదురయింది. రెండో టి20కి కూడా వర్షసూచన ఉంది. ఇక 11 నెలల సుదీర్ఘ విరామం తర్వాత రీఎంట్రీ ఇచ్చినజస్‌ప్రీత్‌బుమ్రా 2/24తో తన పునరాగమనం ఘనంగా ప్రారంభించాడు. కెప్టెన్‌గా కూడా సత్తా చాటాడు. రెండో టి20లో టీమిండియాకు పెద్దగా మార్పులుచేసే అవకాశంలేదు. అర్ష్ దీప్‌సింగ్ దారుణంగా విఫలం అయినా ఆతడికి మరో ఛాన్స్ ఇవ్వనున్నారు. ముకేష్‌కుమార్, ఆవేశ్‌ఖాన్‌లలో ఒకరు రావచ్చు. తొలి టి20తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చిన రింకూసింగ్‌కు తొలిమ్యాచ్‌లో బ్యాటింగ్‌ఛాన్స్ రాలేదు. మొదటి ఇంటర్నేషనల్ టి20లో ప్రసిద్‌కృష్ణ చెలరేగాడు. గాయంతో జట్టుకు దూరం అయిన ఆతడు ఇదే మ్యాచ్‌తోరీ ఎంట్రీ ఇచ్చి సత్తాచూపించాడు. సంజూశాంసన్, తిలక్‌వర్మ, శివమ్‌దూబే, వాషింగ్టన్‌సుందర్‌లకు మరో ఛాన్స్ రానుంది. స్పెషలిస్టు స్పిన్నర్‌గా రవిబిష్ణోయ్ సత్తాచూపించాడు. ఆతడికి ఢోకాలేదు. ఛాన్స్‌కోసం చూస్తున్న జితేశ్‌శర్మ, షెహబాజ్ అహ్మద్‌మరో మ్యాచ్‌వరకూ నిరీక్షించాల్సిందే. ఇక తుది జట్టుపరంగాయశస్విజైస్వాల్, రుతురాజ్‌గైక్వాడ్, తిక్‌వర్మ, సంజూశాంసన్, శివమ్‌దూబే, రింకూసింగ్, వాషింగ్టన్‌సుందర్, రవిబిష్ణోయ్, జస్‌ప్రీత్‌బుమ్రా, ప్రసిద్‌కృష్ణ, అర్ష్‌దీప్‌సింగ్‌లు ఉంటారని అంచనా.

## ఆసియాకప్‌లో టాప్ శ్రీలంక బౌలరే!

**న్యూఢిల్లీ:** ఆసియాకప్ టోర్నీకోసం పాల్గొనే దేశాలన్నీ రెడీ అవుతున్నాయి. ఈనెలాఖరునుంచి ఈ టోర్నీ మొదలవుతుంది. ఈతరుణంలో ఆసియాకప్ హిస్టరీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల వివరాలపై ఫ్యాన్స్ ఎక్కువ చర్చిస్తున్నారు. వీరిలో శ్రీలంక బౌలర్లే ఎక్కువ ఉన్నారు. శ్రీలంక లెఉజెండ్ మత్తయ్య మురళీధరన్ ఈ జాబితాలో టాప్‌ప్లేస్‌లో ఉన్నాడు. 24 మ్యాచ్‌లు ఆడాడు. వీటిలో 30 వికెట్లు తన ఖాతాలో వేసుకుని ఒకేసారి ఐదు వికెట్ల హాల్‌కూడా తీసుకున్నాడు. అదేవిధంగా రెండో టాప్ వికెట్ టేకర్‌గా లసిత్‌మలింగ నిలిచాడు. ఈ టోర్నీ చరిత్రలో 14 మ్యాచ్‌లు ఆడి 29 వికెట్లుతీసాడు. మూడుసార్లుఐదు వికెట్ల హాల్ అందుకున్నాడు. ఇక అజంతా మెండిస్ ఆసియాకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన మూడో బౌలర్. టోర్నీలో ఎనిమిది మ్యాచ్‌లు ఆడి రెండుసార్లు ఐదు వికెట్ల హాల్ తీసుకున్న మెండిస్ ఓవరాల్‌గా 26 వికెట్లుతీసాడు. ఇక సయీద్ అజ్మల్ పాక్ లెజండరీ స్పిన్నర్‌గాపేరున్న ఈక్రికెటర్‌ఆసియాకప్‌లో 12 మ్యాచ్‌లు ఆడి 25 వికెట్లుపడగొట్టాడు. ఇక ఐదో ప్లేయర్ లంక పేసర్ చమిండా వాస్‌కూడా ఉన్నాడు. 19 మ్యాచ్‌ల్లో 23 వికెట్లుతీసాడు. మొత్తంగాచూస్తే ఆసియాకప్‌లో టాప్ బౌలర్ల జాబితాలో ఐదుగురు శ్రీలంక క్రికెటర్లే ఉన్నారు. ఇక ఆసియాకప్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ బౌలర్‌గా ఇర్ఫాన్‌పఠాన్ ఉన్నారు. ఈటోర్నీలో 12 మ్యాచ్‌లు ఆడినపఠాన్ 22 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు.




## అంతిమ్‌పంగాల్‌కు అండర్20 ఛాంపియన్‌షిప్

**అమ్మాన్‌సిటీ(జోర్డాన్):** భారత యువ మహిళా రెజ్లర్లు కొత్తచరిత్రను రాసారు. తొలిసారి ప్రపంచ అండర్20 ఛాంపియన్‌షిప్‌లో టీమ్ టైటిల్ సొంతంచేసుకున్నారు. హరియానా రెజ్లర్ అంతిమ్ పంఘాల్‌వరుసగా రెండో ఏడాది 53 కిలోల విభాగంలో విశ్వవిజేతగా నిలిచి ఈ ఘనత సాధించిన తొలి భారతీయ రెజ్లర్‌గా గుర్తింపు పొందింది. ఫైనల్‌లో అంతిమ్ 4-0తో మరియా యెఫ్రెమోవా (ఉక్రెయిన్)పై గెలిచింది. ఓకవరాల్‌గా ఈ టోర్నీలో అంతిమ్ తన ప్రనత్యర్థులకు కేవలం రెండు పాయింట్లేకోల్పోయింది. సవితా దలాల్ 62 కిలోల విభాగంలో కూడా ప్రపంచ ఛాంపియన్ అయింది. ఫైనల్‌లో సవిత 10-0తో వెనిజులా రెజ్లర్ చిరినోస్‌పై గెలిచింది. అంతిమ్‌కుందు 65 కిలోల విభాగంలో రజతం సాధించింది. రీనా 57 కిలోల విబాగంలోనూ, అర్జూ 68 కిలోల విభాగంలోనూ, హర్షిత 72 కిలోల విభాగంలోను కాంస్యపతకాలుసాధించారు. గురువారం ప్రియా మాలిక్ 76 కిలోల విభాగంలో స్వర్ణం గెలిచింది. ఓవరాల్‌గా మొత్తం భారత్‌కు ఏడుపతకాలువచ్చాయి. 140 పాయింట్లతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది.




## ఒత్తిడి తట్టుకునేందుకు
# నిప్పులపై నడిచిన క్రికెటర్

### బంగ్లా స్టార్‌పేసర్ నయీామ్ షేక్ విడియో వైరల్

**ఢాకా:** ఆసియాకప్ మరికొన్ని రోజుల్లోనే ప్రారంభం అవుతున్న క్రమంలో బంగ్లాదేశ్‌క్రికెటర్ స్టార్ ఓపెనర్ నయీమ్‌షేక్ చేసిన పని ఇపుడు నెట్టింట హల్‌చల్‌చేస్తోంది. ఆసియాకప్, వరల్డ్‌కప్ టోర్నీల్లో ఒత్తిడికి గురయితే ఓటమి తప్పదు. ఇలా చాలాసార్లే రుజువయింది. ఎవరు ముందుగా ఒత్తిడికి తలొగ్గితే వాళ్లే ఓటమి చవిచూస్తారు. ఒత్తిడిని తట్టుకుని చివరివరకూ పోరాడటాన్ని ఆటగాళ్లు ఆలవాటుచేసుకోవాలి. ఇందుకోసం చాలామందిప్లేయర్లు మైండ్‌ను ప్రిపేర్‌చేసుకుంటున్నారు. నయీమ్‌షేక్‌కూడా అదే పనిచేసాడు.

బ్రెయిన్ ఒత్తిడికి తట్టుకునేందుకుగాను ఆతడు నిప్పులపై నడిచాడు. ఇందుకు సంబంధించిన విడియో ఇపుడు వైరల్ అవుతోంది. తన ట్రైనర్‌తోకలిసి ఉన్న నయీమ్ చెప్పులు విప్పేసి ప్యాంటుపైకిమడుచుకుని రెడీగా కనిపిస్తున్నాడు. ఒకఫుట్‌బాల్‌మైదానంలో ఈఏర్పాట్లుచేసినట్లు కనిపిస్తోంది. నెమ్మదిగా నిప్పులపై నడిచిన నయీమ్ ఆవలివైపు నేలపై వేసి ఉన్న గోనెసంచిమీదకు వెళ్లాడు. అక్కడ ఆతని కాళ్లపై నీళ్లుచల్లినట్లు తెలుస్తోంది. ఈ విడియోచూసిన నెటిజన్లు నోరెళ్లబెడుతున్నారు. కాగా హైబ్రిడ్‌మోడల్‌లోజరిగే ఆసియాకప్ ఈనెల 30న పాకిస్థాన్ నేపాల్‌మధ్య మ్యాచ్‌తోప్రారంభం అవుతుంది. పాక్ గడ్డపై నాలుగుమ్యాచ్‌లు జరిగినతర్వాత టోర్నీ పూర్తిగా శ్రీలంక మారుతుంది. అక్కడే భారత్ సహా మిగిలిన దేశాల మ్యాచ్‌లు జరుగుతాయి. వచ్చేనెల 17న కొలంబోవేదికగా ఫైనల్ మ్యాచ్‌తో టోర్నీ ముగుస్తుంది.





## ముంబయి ఇండియన్స్ బౌలింగ్‌కోచ్‌గా లసిత్‌మలింగా

**ముంబయి:** ఐపిఎల్ 2024 సీజన్ నేపథ్యంలో ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ బౌలింగ్‌కోచ్‌గా శ్రీలంక దిగ్గజ పేసర్‌ముంబయి ఇండియన్స్ మాజీ బౌలర్ లసిత్‌మలింగాను నియమించింది. అయితే అధికారికంగాప్రకటించాలి. ముంబయి ఇండియన్స్ ఈమార్పులుచేస్తోందని ప్రముఖ క్రికెట్ వెబ్‌సైట్ వెల్లడించింది. గతంలోముంబయి ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన లసిత్‌మలింగా 2021లో ఫ్రాంచైజీ క్రికెట్‌కు వీడ్కోలుపలికాడు. ఐపిఎల్ 2022 సీజన్‌నుంచి రాజస్థాన్ రాయల్స్ బౌలింగ్‌కోచ్‌గా ఉన్నాడు. 2018లో ముంబయి ఇండియన్స్ మెంటార్‌గా మలింగా పనిచేసాడు. ఆ తర్వాత మైదానంలోకి రీ ఎంట్రి ఇచ్చిన మలింగడా జస్‌ప్రీత్‌బుమ్రాతోకలిసిముంబయి ఇండియన్స్ పేస్ బాధ్యతలుపంచుకున్నాడు. 2019లో ముంబయి ఇండియన్స్ టైటిల్ గెలవడంలో కీకంగా ఉన్నాడబు. ముంబయి ఇండియన్స్ నాలుగు ఐపిఎల్ టైటిల్స్ 2013, 2015, 2017, 2019 సంవత్సరాల్లో గెలిచింది. ఈ విజయంలో మలింగా కూడా భాగస్వామి. ఛాంపియన్స్ లీగ్‌జట్టులోను మలింగా ఉన్నాడు. ముంబయి ఇండియన్స్ తరపున 139 మ్యాచ్‌లు ఆడిన మలింగా 7.12 ఎకానమితో 195 వికెట్లుతీసాడు. ఐపిఎల్‌లో 170 వికెట్లు తీసాడు. 2015లో ముంబయి ఇండియన్స్ జట్టుతోకలిసి షేన్‌బాండ్, గతసీజన్‌వరకూ బౌలింగ్‌కోచ్గఆ సేవలందించాడు. ఈ ఏడాది ఐపిఎల్ టి20 లీగ్‌లోముంబయి ఇండియన్స్ ఎమిరేట్స్ టీమ్‌కు ఆతడు హెడ్‌కోచ్‌గా వ్యవహరించాడు.

## ఆంక్షల ఎత్తివేతకు భారత్‌పై అమెరికా ఒత్తిడి

**వాషింగ్టన్, ఆగస్టు 19:** ఆపిల్, ఇంటెల్, గూగుల్, లెనోవో, డెల్ టెక్నాలజీస్, హెచ్‌పి వంటి గ్లోబల్ ఐటి, ఎలక్ట్రానిక్స్ తయారీ మేజర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్‌లు, వ్యక్తిగత దిగుమతిపై కొత్తగా విధించిన పరిమితిని పునఃపరిశీలించాల్సిందిగా భారత్ పరిపాలనను కోరాలని అమెరికా ప్రభుత్వాన్ని ఆశ్రయించాయి. కంప్యూటర్లు, అల్ట్రా-స్మాల్ ఫారమ్ ఫ్యాక్టర్ కంప్యూటర్లు, సర్వర్లు దిగుమతిపై భారత్ పరిమితులు విధించింది. ఐటి దిగ్గజాలు జో బైడెన్ అందుబాటులో ఉన్న ప్రతి ఫోరమ్‌ను ఉపయోగించాలని, భారతదేశాన్ని ఆదేశాన్ని పునఃపరిశీలించమని కోరినట్లు శనివారం ఒక నివేదిక వెల్లడించింది. కన్స్యూమర్ టెక్నాలజీ అసోసియేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇండస్ట్రీ కౌన్సిల్, సెమీ కండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్, యునైటెడ్ స్టేట్స్ కౌన్సిల్ ఫర్ ఇంటర్నేషనల్ బిజినెస్‌తో సహా అమెరికాకు చెందిన ఎనిమిది వాణిజ్య సంస్థలు ఒక లేఖలో యుఎస్ ట్రేడ్ ప్రతినిధి, యుఎస్ సెక్రటరీ ఆఫ్ కామర్స్‌ను కోరినట్లు నివేదిక పేర్కొంది. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూ నికేషన్స్ టెక్నాలజీ (ఐసిటి) రంగంలో దాని చర్యలు భారతదేశఅంతర్జాతీయ వాణిజ్య బాధ్యతలు, కట్టుబాట్లకు అనుగుణంగా ఉన్నాయని నిర్ధారించుకోవడానికి భారత ప్రభుత్వంతో అందుబాటులో ఉన్న ప్రతి చర్చా వేదికను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ నెల ప్రారంభంలో ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు, కంప్యూటర్‌ల దిగుమతిపై కేంద్రం తక్షణమే ఆంక్షలు విధించింది. పరిమితి విధించిన దిగుమతుల కోసం చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌పై దిగుమతి అనుమ తించవని పేర్కొంది. భారత ప్రభుత్వం లైసెన్సింగ్ చర్యలను అనుసరించడం వల్ల వాణిజ్యం, సరఫరా గొలుసు భాగస్వామిగా భారత్ విశ్వసనీయత గురించి ఆందోళనలు తలెత్తాయని అమెరికా వాణిజ్య సంస్థలు పేర్కొన్నాయి. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక ఆర్థికసంబంధాన్ని మరింతగా పెంచుకోవాలనే భాగస్వామ్య లక్ష్యాన్ని ఇటీవలి అడ్డంకులు బలహీనపరిచాయని కంపెనీలు పేర్కొన్నాయి. అయితే తన నిర్ణయాన్ని భారత ప్రభుత్వం సమర్థించుకుంది.



## ‘బ్లాక్’ ఫీచర్‌కు మస్క్ గుడ్‌బై!

**వాషింగ్టన్, ఆగస్టు 19:** ‘ఎక్స్’ అధినేత ఎలాన్‌మస్క్ తన యూజర్లకు మరో షాక్ ఇచ్చారు. ‘ఎక్స్’ ప్లాట్‌ఫాంలో అకౌంట్లను బ్లాక్ చేసే ఫీచర్‌కు స్వస్తి పలుకుతున్నట్లు ప్రకటించారు. ఆ ఆప్షన్ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, అందుకనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సమర్థించుకున్నారు. భద్రతా పరమైన ఫీచర్లలో ముఖ్యమైన బ్లాక్ ఫీచర్‌ను తొలగించడంతో యూజర్లు మస్క్‌పై గుర్రుమంటున్నారు. దీంతో ఆన్‌లైన్ వేధింపులు పెరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. ‘టెస్లా ఓనర్ సిలకాన్ వ్యాలీ’ పేరుతో ఉన్న ఓ యూజర్ బ్లాక్ ఫీచర్ గురించి అడిగిన ప్రశ్నలకు మస్క్ ఈ విధంగా బదులిచ్చారు. ‘ఎక్స్ ప్లాట్‌ఫాంలో బ్లాక్ ఫీచర్‌ని తొలగిస్తున్నాం. త్వరలోనే ఆ ఫీచర్‌ను డిలీట్ చేస్తాం. దాని వల్ల పెద్దగా ప్రయోజనం ఏమీ ఉండదు. అయితే డైరెక్ట్‌గా మెసేజ్ చేసే వారిని మాత్రం బ్లాక్ చేయవచ్చు అని మస్క్ సమాధానం ఇచ్చారు. దీంతో ఇకపై ఎక్స్‌లో బ్లాక్ ఫీచర్ ఉండదు. దానికి బదులుగా మ్యూట్ ఫీచర్‌ని వినియోగించవచ్చు. మీరు ఏదైనా ఖాతాను మ్యూట్ చేస్తే, ఆ ఖాతాదారు చేసే పోస్టుల్ని మనం వీక్షించకుండా ఉండేందుకు వీలుంటుంది. కానీ మనం చేసే పోస్టులను మ్యూట్ చేసిన వ్యక్తి మాత్రం చూడవచ్చు. ఆ పోస్టులను తన ఫాలోవర్లకు రీపోస్ట్ చేయొచ్చు. అంతేకాకుండా డైరెక్ట్ మెసేజ్‌లు కూడా చేయవచ్చు. ఇలా డైరెక్ట్ మెసేజ్‌లు చేస్తే వాటిని బ్లాక్ చేసుకోవచ్చు. ఎక్స్‌ను కొనుగోలు చేసినప్పటి నుంచి అందులో అనేక మార్పులను తీసుకొచ్చారు. మస్క్ పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగించడం దగ్గర నుంచి ట్విట్టర్‌ను ఎక్స్‌గా మార్చడం వరకూ అనేక నిర్ణయాలు తీసుకున్నారు.



## వాణిజ్యం

## 50 కోట్లు దాటిన జన్‌ధన్ యోజన ఖాతాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** దేశంలో ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన (పిఎంజెడివై) ఖాతాల సంఖ్య 50 కోట్ల మార్క్‌ను దాటాయని, వాటిల్లో 56శాతం మహిళలవేనని కేంద్ర ఆర్థిక శాఖ అధికారికంగా ప్రకటించింది. మొత్తం 50కోట్ల అకౌంట్లలో 67 శాతం రూరల్, సెమి-అర్బన్ ప్రాంతాల ప్రజలు ఓపెన్ చేసినట్లు పేర్కొంది. ఇక ఈ అకౌంట్లలో మొత్తం రూ.2.03 లక్షల కోట్లు డిపాజిట్ చేసినట్లు తెలిపిన ఆర్థిక శాఖ, 34 కోట్ల మందికి రూపేకార్డులను ఉచితంగా అందించి నట్లు వెల్లడించింది. జన్‌ధన్ యోజన ఖాతాల్లో సగటు బ్యాలెన్స్ రూ.4,076 కాగా, వీరిలో 5.5 కోట్లకుపైగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పొందుతున్నారని చెప్పింది. కేంద్ర ప్రభుత్వం నిరుపేదలు కూడా బ్యాంకింగ్ సేవల్ని వినియోగించేందుకు 2014లో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా ఎలాంటి మినిమం బ్యాలెన్స్ లేకుండా జన్‌ధన్ బ్యాంకు ఖాతాల్ని వినియోగించుకోవచ్చు. రూపే డెబిట్ కార్డ్ తీసుకున్నవారికి 2 లక్షల రూపాయల వరకు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ కవరేజీ లభిస్తుంది. ఇక జన్‌ధన్ అకౌంట్‌లో 10 వేల రూపాయల వరకు ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం ఉంది.



## 5 నెలల దిగువకు బంగారం ధరలు

**ముంబై, ఆగస్టు 19:** దాదాపు రెండు వారాలుగా బులియన్ మార్కెట్లో ఎలాంటి చప్పుడు లేదు. రోజురోజుకూ గోల్డ్ ధర క్షీణిస్తూనే ఉంది. తాజాగా తగ్గిన ధరలతో పసిడి ధరలు ఐదు నెలల కనిష్టానికి దిగజారాయని వెల్లడైంది. ప్రధానంగా అమెరికాలో ఆర్థిక పరిస్థితుల వల్ల వడ్డీరేట్ల పెంపు ఉంటుందనే మూడ్ ఆధిపత్యం చెలాయిస్తోంది. దీంతో బంగారం ధరలు చతికిలపడ్డాయి. యూరో జోన్‌లోని దేశాలు కూడా ఒకదాని తర్వాత మరొకటి మాంద్యంలోకి జారుకోవడం పసిడి పరుగులకు బ్రేకులు వేసింది. డాలర్ స్థిరత్వం, ట్రెజరీ దిగుబడులు పెరగడం కూడా పసిడి మెరుపులను తగ్గిస్తున్నాయి. ఈ క్రమంలో యుఎస్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.7శాతం తగ్గి ఔన్స్‌కు 1,915.20 డాలర్ల రేటు వద్ద స్థిరపడ్డాయి. దీనికి తోడు బాండ్ ఈల్డ్స్ పెరగడం, యుఎస్ వడ్డీరేట్లు ఎక్కువగా ఉండవచ్చనే అంచనాలు పసిడి పెట్టుబడి దారులకు తక్కువ ఆకర్షణీయంగా మారింది. ఇది బంగారం ధరలను దెబ్బతీసింది. పైగా డాలర్ కూడా రెండు నెలల గరిష్టానికి చేరింది. నిరుద్యోగ ప్రయోజనాల కోసం కొత్త క్లెయిమ్‌లను దాఖలు చేసే అమెరికన్ల సంఖ్య గత వారం పడిపోయిందని డేటా చూపించింది. ఇది ఇప్పటికీ గట్టి లేబర్ మార్కెట్‌ను సూచిస్తోందని నిపుణులు చెబుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తగ్గిన పసిడి ధరలను గమనిస్తే శనివారం స్థిరంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఏపిలోని విజయవాడ, విశాఖపట్నం, కడప, కాకినాడ, అనంతపురం, తిరుపతి, నెల్లూరుల్లో 22 క్యారెట్ల పసిడి ధర 54,100 రూపాయల వద్ద ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర 59,020 రూపాయలుగా రిటైల్ విక్రయాలు జరిగాయి. ఇక తెలంగాణలోని హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, నిజాంబాద్‌లలో 22 క్యారెట్ల పసిడి ధర 54,100 రూపాయల వద్ద ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర 59,020 రూపాయలుగా ఉన్నాయి. వెండి ధర పరిశీలిస్తే 1000 రూపాయలు పెరిగిన తర్వాత కేజి 76,700 రూపాయలుగా కొనసాగింది.




## క్యారట్‌లేన్‌లో టైటాన్‌కు మరిన్ని వాటాలు

**ముంబై, ఆగస్టు 19:** క్యారట్‌లేన్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అదనంగా 27శాతం వాటాను కొనుగోలు చేస్తున్నట్లు టైటాన్ కంపెనీ లిమిటెడ్ శనివారం ప్రకటించింది. కంపెనీ క్యారట్‌లేన్ వ్యవస్థాపకుడు, అతని కుటుంబ సభ్యుల వద్ద ఉన్న 27.18 శాతం వాటా కొనుగోలు చేయడానికి ఒప్పందంపై సంతకం చేసినట్లు తెలిపింది. కంపెనీ మొత్తం రూ.4,621 కోట్లతో అదనపు వాటాలను కొనుగోలు చేయనుంది. ఈ ఒప్పందంతో క్యారట్‌లేన్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో టైటాన్ వాటా 71.09శాతం నుంచి 98.28 శాతానికి పెరగనుంది. టైటాన్ అక్టోబర్ 31, 2023 నాటికి క్యారట్ లేన్‌లో అదనపు వాటాల కొనుగోలును పూర్తిచేసే అవకాశం ఉంది. ఈ లావాదేవీ సంప్రదాయ నియంత్రణ ఆమోదాలు, ముగింపు షరతులకు లోబడి ఉంటుంది. నగదు నిల్వలు, అంతర్గత జమలు, రుణాల కలయిక ద్వారా ఫైనాన్స్ చేస్తున్నారని భావిస్తున్నారు. 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.1,267 కోట్ల నుంచి 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.2,177 కోట్ల టర్నోవర్‌ని క్యారట్‌లేన్ నివేదించింది. క్యారట్‌లేన్ 2008లో స్వచ్ఛమైన ఆన్‌లైన్ బ్రాండ్‌గా ప్రారంభమైంది. టైటాన్ మొదటిసారిగా 2016లో క్యారట్‌లేన్‌లో పెట్టుబడి పెట్టింది. గత ఎనిమిది సంవత్సరాలలో తనిష్క్ భాగస్వామ్యంతో, బ్రాండ్ వేగంగా అభివృద్ధి చెందింది. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో, కొవిడ్-ప్రభావిత సంవత్సరంలో తక్కువ స్థాయిలో ఉన్నప్పటికీ, దాని అమ్మకాలు 74శాతం కాగ్ర్ వద్ద పెరిగాయి.




## దేశంలో తొలి హైడ్రోజన్ బస్సు..

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** విరివిగా వాడుతున్న శిలాజ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయ ఇంధనాన్ని తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అన్ని దేశాలూ ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ఈ క్రమంలోనే ఓ వైపు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్న కేంద్రం, అటు హైడ్రోజన్‌తో నడిచే వాహనాలకూ పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా హైక్రోజన్‌తో నడిచే బస్సు కమర్షియల్ ట్రయల్స్‌కు సిద్ధమైంది. సముద్రమట్టానికి అత్యంత ఎత్తులో ఉండే శీతల ప్రాంతమైన లడఖ్ రోడ్లపై పరుగులు పెట్టేందుకు సన్నద్ధమైంది. హైడ్రోజన్ ప్రాజెక్ట్‌లో భాగం గా ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి సంస్థ ఎన్‌టిపిసి అశోక్ లేలాండ్‌తో కలిసి ఈ బస్సులను రూపొందించింది. ఒక్కో బస్సు ఖరీదు రూ.2.5 కోట్లు. మొత్తం ఐదు బస్సులను లేహ్ అడ్మినిస్ట్రేషన్‌కు ఎన్‌టిపిసి అప్పగిస్తోంది. ఇందులో భాగంగా తొలి బస్సు తాజాగా లేహ్ చేరుకుంది. ఈ బస్సుల కోసం లేహ్‌లో ఎన్‌టిపిసి రీఫిల్లింగ్ స్టేషన్‌తో పాటు, గ్రీన్ హైడ్రోజన్ ఫ్యూయర్ ఉత్పత్తికి 1.7 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేసింది. త్వరలో కమర్షియల్ ట్రయల్స్ ప్రారంభం కానుంది. మూడు నెలల పాటు ఈ ట్రయల్స్ నిర్వహించనున్నారు. సాధారణ బస్సుల మాదిరిగానే ఈ బస్సులోనూ టికెట్ ధరలు వసూలు చేయనున్నారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14